సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 17 సంచిక: 159

శుక్రవారం 21-2-2025

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'



షమీ.. శుబ్.. ఆరంభం

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో బంగ్లాపై 6 వికెట్ల తేడాతో గెలుపు -13లో



షాపింగ్ ఓ రేంజ్‌లో..

ఖరీదైన పాదరక్షలు, వస్త్రాలు కొనుగోలు.. టాటా క్లిక్ అధ్యయనంలో వెల్లడి -13లో

ఎవరినో గెలిపించేందుకు ప్రయత్నించారు

భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచే ఉద్దేశంతో నిర్వహించే కార్యక్రమాలకు గత బైడెన్ ప్రభుత్వం 2.1 కోట్ల డాలర్ల ఆర్థిక సాయం వెనుక మరేదో కుట్ర కోణం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో ఇంకెవరినో గెలిపించాలని భావించి నాటి సర్కారు ఈ చర్య చేపట్టి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. అసలు భారత్‌లో ఓటర్ల సంఖ్య పెంచేందుకు అమెరికా సొంత డబ్బు ఎందుకు ఖర్చు చేయాలని ప్రశ్నించారు.

వివరాలు 6లో ▶





హైకోర్టు జడ్జిపై లోక్‌పాల్ విచారణా..?

ఒక హైకోర్టు సిట్టింగ్ అదనపు జడ్జిపై లోక్‌పాల్ విచారణ చేపడుతూ ఉత్తర్వులు జారీ చేయడాన్ని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. ఈ ధోరణి ఏమాత్రం ఆమోదనీయం కాదని తేల్చిచెప్పింది. లోక్‌పాల్ జారీ చేసిన ఉత్తర్వుల అమలుపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు జడ్జి ఉదంతంలో స్పందన తెలపాలని కేంద్ర ప్రభుత్వం, లోక్‌పాల్ రిజిస్ట్రార్‌తోపాటు హైకోర్టు జడ్జిపై ఫిర్యాదుచేసిన వ్యక్తికి సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది.

వివరాలు 6లో ▶

న్యూస్‌రీల్

కాల్ మెర్జింగ్‌తో కాజేస్తారు!



దేశంలో సైబర్ నేరగాళ్లు కొత్త స్కాంకు తెరలేపారు. ఫోన్ కాల్ మెర్జింగ్ చేయించి.. మనకు తెలియకుండానే మన నుంచి ఓటీపీలు తీసుకుని బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును కాజేస్తున్నారు. ఈ మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని యూపీఐ హెచ్చరించింది.

వివరాలు 3లో ▸

పనులన్నీ టీడీపీ వారికే ఇవ్వండి!



'హలో కమిషనర్ గారూ.. కార్పొరేషన్‌లో పనులన్నీ మనవారికే ఇవ్వండి. నేను మనిషిని పంపుతున్నాను. పనులు అతనికి అప్పగిస్తే.. అతను పార్టీ కోసం పనిచేసిన వారికి ఇస్తారు' అని తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌ను మంత్రి నారా లోకేశ్ ఆదేశించినట్లు తెలిసింది.

వివరాలు 5లో ▸

మాకు చేతకావడం లేదు



'ఇప్పటి కంటే గత ప్రభుత్వ హయాంలోనే ఏపీఎస్ఎఫ్ఎల్ ప్రసారాలు బాగున్నాయి. మేం అధికారం చేపట్టిన తర్వాత నుంచి ఒక్క కనెక్షన్ ఇవ్వలేదు. ఉన్న కనెక్షన్లకు కూడా ప్రసారాలు నిరంతరాయంగా ఇవ్వలేకపోతున్నాం' అని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి చెప్పారు.

వివరాలు 3లో ▸

సత్యవర్ధన్‌పై కేసు పెట్టి.. లొంగదీసుకొని



వల్లభనేని వంశీపై కేసు వెనుక పోలీసుల చేత ప్రభుత్వ పెద్దలు ఆడించిన నాటకం బట్టబయలైంది. వంశీ అరెస్టుకు 2 రోజుల ముందే సత్యవర్ధన్‌పై టీడీపీ నేతలతో ఫిర్యాదు చేయించి.. కేసు పెట్టి.. దాన్నే బూచిగా చూపించి సత్యవర్ధన్‌ను దాదాపుగా బ్లాక్‌మెయిల్ చేసినట్లు వెల్లడైంది.

వివరాలు 10లో ▸

'మార్గదర్శి' మోసాల కేసు మూత?

బాబు డైరెక్షన్‌లో ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించిన సీఐడీ

రూ.1,050 కోట్ల మార్గదర్శి ఆస్తుల జప్తుపై రాజకీయ ఒత్తిళ్లతో ఇప్పటికే అప్పీళ్లు ఉపసంహరణ

- ఆ చిట్‌ఫండ్ కంపెనీపై కేసు పెట్టడం 'పొరపాటు..'
- దానికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాల్లేవ్
- ఇప్పటివరకు సేకరించినవన్నీ నేరాన్ని నిరూపించడం లేదు
- అందువల్ల ఇక కేసును మూసేయవచ్చు..
- మూసివేతకు అదనపు డీజీ అనుమతి కూడా ఇచ్చారు
- దీంతో కోర్టులో దాఖలు చేసేందుకు తుది నివేదిక సిద్ధం చేశాం
- ఆ నివేదిక దాఖలుకు అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నార్ అనుమతి ఇవ్వాల్సి ఉంది.. హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన దర్యాప్తు సంస్థ
- సీఐడీ తుది నివేదికను సంబంధిత కోర్టు అనుమతిస్తే అంతే సంగతులు
- మార్గదర్శి చిట్‌ఫండ్ అక్రమాలు శాశ్వతంగా సమాధి అయినట్లే..
- అదే కోరుకుంటున్న చంద్రబాబు సర్కార్.. రాజగురువుపై బాబు రాజభక్తి
- అటు అక్రమ డిపాజిట్లు సేకరించిన మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు అనుకూలంగా తెలంగాణ హైకోర్టులో వైఖరి.. ఇటు మార్గదర్శి చిట్‌ఫండ్‌కు అనుకూలంగా ఏపీ హైకోర్టులో సీఐడీ ద్వారా అఫిడవిట్

2లో



మార్గదర్శి అక్రమాలకు కీలక ఆధారాలున్నట్లు గతంలో హైకోర్టుకు నివేదించిన సీఐడీ

ప్రభుత్వం మారడంతో ఆధారాల్లేవంటూ రూటు మార్చిన వైనం



పాలవలస కుటుంబాన్ని పరామర్శించేందుకు పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ వచ్చిన వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న అశేష జనసందోహంలో ఓ భాగం 2లో

రైతుల పట్ల ఇదేనా చిత్తశుద్ధి?

సీఎం చంద్రబాబు తీరుపై వైఎస్ జగన్ ధ్వజం


- ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారానికి వెళ్లి.. రైతుల కోసం అన్నట్లుగా కలరింగ్ ఎందుకు?
- మీ లేఖలోనే.. మిర్చి గరిష్ట ధర రూ.27 వేలు పలికిందని చెప్పడం వాస్తవం కాదా?
- నాడు పెట్టుబడి ఖర్చులు రూ.లక్ష అయితే.. నేడు లక్షన్నరకుపైగా అవుతోంది
- ధరలు పడిపోవడంతో ప్రతి రైతు రూ.లక్షకు పైగా నష్టపోతున్నారు
- వారిని ఆదుకునేందుకు కొత్త మద్దతు ధరలు ఎందుకు ప్రకటించడం లేదు?
- రాష్ట్ర ప్రభుత్వమే ఎందుకు కొనుగోలు చేయడం లేదు?
- గతంలో ఎప్పుడైనా, ఏ రాష్ట్రంలోనైనా.. "నాఫెడ్" మిర్చిని కొనుగోలు చేసిందా?
- మీ చేతిలో ఉన్న మార్క్‌ఫెడ్ ద్వారా కొనకుండా కేంద్రానికి లేఖలు రాయడం రైతులను నిలువునా మోసం చేయడం కాదా?
- కేంద్రంపై ఆధారపడకుండా మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చిని కొనుగోలు చేయాలి
- నేను రైతులను కలుసుకుంటే ఎన్నికల కోడ్ అడ్డు వచ్చిందా?.. మరి 15న మీ మ్యూజికల్ నైట్‌కు కోడ్ అడ్డం రాలేదా?

2లో

పరీక్షా కాలమ్!

- ఇంటర్ నుంచి సెట్స్ వరకు వరుసగా వార్షిక పరీక్షలు
- అన్ని పరీక్షలకు కలిపి 24.50 లక్షల మంది విద్యార్థులు
- మార్చి 1 నుంచి జూన్ మూడో వారం వరకు ఎగ్జామ్స్
- 1 నుంచి ఇంటర్ పరీక్షలు.. రాసే విద్యార్థులు 10.59 లక్షల మంది.. మార్చి 17 నుంచి టెన్త్ ఎగ్జామ్స్.. రాసే వారు 6.49 లక్షల మంది
- ఆ తర్వాత పలు ప్రవేశ పరీక్షలు

12లో



గ్రూప్-2కు పటిష్ట ఏర్పాట్లు



ఈనెల 23న జరిగే ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చెప్పారు. రాష్ట్రంలోని 175 కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షలకు 92,250 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పేపర్-1 రాసేందుకు అభ్యర్థులు ఉదయం 9.30లోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని.. 9.45 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేయాలని ఏపీపీఎస్సీ చైర్మన్ ఎ.అనురాధ స్పష్టం చేశారు.

గ్రూప్–2 పరీక్ష నిలిపివేయలేం: హైకోర్టు 14లో

దురుద్దేశంతోనే జగన్‌కు భద్రత కల్పించలేదు

గవర్నర్ జస్టిస్ నజీర్‌కు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు

- జగన్‌కు రక్షణ కల్పించాలని గవర్నర్‌ను కోరాం
- గుంటూరులో జగన్ భద్రత తొలగించడంపై గవర్నర్ ఆశ్చర్యపోయారు
- విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు
- ఎన్నికల కోడ్ ఉన్నా మాజీ సీఎంకు భద్రత ఇవ్వాలి
- విజయవాడలో సంగీత విభావరికి కోడ్ వర్తించదా?
- శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ

10లో



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్ జగన్ పర్యటనలో లేని వారిపైనా కేసులు

10లో

- మిర్చి యార్డుకు రాని పేర్ని నానిపై కేసులు నమోదు చేసిన పోలీసులు
- అన్నదాతలతో జగన్ మాట్లాడితే కోడ్ ఉల్లంఘన ఎలా అవుతుంది?
- జగన్ పర్యటనలో అడుగడుగునా భద్రతా వైఫల్యం
- జడ్ ప్లస్ కేటగిరి భద్రత ఉన్న జగన్‌కు తగిన సెక్యూరిటీ ఏర్పాటు చేయని పోలీసులు.. ట్రాఫిక్‌ను సైతం నియంత్రించని వైనం

రేఖా గుప్తా అనే నేను..

ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం

మంత్రులుగా ఆరుగురు ఎమ్మెల్యేల ప్రమాణం 6లో

- రామ్‌లీలా మైదానంలో పండుగ వాతావరణం
- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు



మిర్చి సేకరణలో సమస్యలున్నాయ్..



12లో

సీఎం చంద్రబాబు పొంతనలేని సమాధానాలు

రాష్ట్రంలో మిర్చి రైతు ఆర్థిక సమస్యల సుడిగుండంలో కూరుకుపోయి బాధలు పడుతుంటే.. వారిని రక్షించే విషయంలో ఒక నిర్దిష్ట విధానం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది. కేంద్రం లేదా రాష్ట్రం నేరుగా సేకరణ చేస్తుందా? అన్న ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానం ఇవ్వకుండా పొంతనలేని జవాబులిచ్చారు.

తండ్రి కాశీ విశ్వనాథంతో సాత్విక్ (ఫైల్)




సాత్విక్ సాయిరాజ్‌కు పితృవియోగం

'ఖేల్‌రత్న'తో విజయోత్సవ వేడుకలు చేసుకోవాల్సిన ఇంట విషాదం అలుముకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్టార్ షట్లర్ సాత్విక్ సాయి రాజ్ తండ్రి కాశీ విశ్వనాథం గురువారం ఉదయం గుండెపోటుతో కన్నుమూశారు. 65 ఏళ్ల కాశీ విశ్వనాథం.. గురువారం సాయంత్రం ఢిల్లీలో సాత్విక్‌కు 'ఖేల్‌రత్న' పురస్కార ప్రదానోత్సవంలో పాల్గొనాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అమలాపురం నుంచి రాజమండ్రి బయలుదేరిన ఆయన గుండెపోటుకు గురయ్యారు.

13లో

చిరు వ్యాపారులకు షాక్




విద్యుత్ చార్జీలు పెంచడం లేదంటూనే చంద్రబాబు దొంగ దెబ్బ

టైమ్ ఆఫ్ డే టారిఫ్ పేరుతో పీక్ అవర్స్‌లో చార్జీల బాదుడు

- ఇప్పటివరకు హెచ్‌టీ సర్వీసులున్న పెద్ద పరిశ్రమలకే ఈ పద్ధతి
- ఇకపై ఎల్‌టీ వాణిజ్య సర్వీసులకూ వర్తింపు
- చిరు వ్యాపారుల నుంచి పరిశ్రమల వరకు బాదుడే
- ఉదయం 6 నుంచి 10 వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 10 వరకు అదనపు చార్జీలు
- లోడ్‌నుబట్టి 50 పైసల నుంచి 1 రూపాయి వరకు పెరిగే అవకాశం
- ఏప్రిల్ 1 నుంచి అమలు.. 2025-26 టారిఫ్ విడుదల చేసిన ఏపీఈఆర్‌సీ

10లో



రైతుల పట్ల ఇదేనా చిత్తశుద్ధి?

నేను మిర్చి రైతులను కలుసుకుంటే ఎన్నికల కోడ్ అడ్డు వచ్చిందా?
రైతులకు బాసటగా వెళ్లినందుకు మాపై కేసులు పెడతారా?
మరి ఫిబ్రవరి 15న మీ మ్యూజికల్ నైట్‌కు కోడ్ అడ్డం రాలేదా?

సీఎం చంద్రబాబు తీరుపై 'ఎక్స్'లో వైఎస్ జగన్ ధ్వజం

సాక్షి, అమరావతి: ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవ వేడుకలో పాల్గొనేందుకు వెళ్తూ.. మిరప రైతుల సమస్యలపై కేంద్రంతో చర్చించేందుకు వెళ్తున్నట్లు ఎందుకీ కలరింగ్..? ఎవరి కోసం ఈ కలరింగ్..? ఇదేనా రైతుల పట్ల మీ చిత్తశుద్ధి? అని ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వం కష్టాల్లో ఉన్న అన్నదాతలను ఆదుకోవాల్సింది పోయి.. వారికి బాసటగా వెళ్లిన తమపై కేసులు బనాయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మిరప రైతుల విషయంలో టీడీపీ కూటమి సర్కారు వ్యవహరిస్తున్న తీరును తన 'ఎక్స్' ఖాతా ద్వారా ఎండగట్టారు. ట్వీట్‌లో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..



- తెగుళ్లతో మిర్చి దిగుబడులు ఎకరాకు 10 క్వింటాళ్లకు పడిపోయిన దుస్థితి నెలకొంది. కొనేవారు లేక క్వింటాల్ రూ.10 వేలకు రైతులు తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి. పెట్టుబడి ఖర్చులు చూస్తే ఎకరాకు రూ.1.50 లక్షల పైమాటే. కోతల అనంతర ఖర్చులు దీనికి అదనం. ఇంతటి సంక్షోభం కళ్లెదుట కనిపిస్తున్నా.. మేం స్పందించేంతవరకూ మీలో కదలిక లేదు. మీరు ఢిల్లీ నూతన సీఎం ప్రమాణ స్వీకారానికి వెళ్తూ.. మిర్చి రైతుల కోసమే వెళ్తున్నట్లు యథావిధిగా కలరింగ్ ఇస్తున్నారు.
- కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ ఎప్పుడూ, ఏ రాష్ట్రంలోనూ, ఎక్కడా మిర్చిని కొనుగోలు చేయలేదని తెలిసి కూడా లేఖ రాయడం ఏమిటి? మీ బాధ్యతను వేరేవాళ్ల మీద నెట్టడం ఏమిటి? మీరు చేయాల్సిన పనులు చేయకుండా సాకులు వెతుక్కోవడం ఏమిటి? ఈ రకంగా రైతులను మోసం చేస్తున్నారు.
- 2021లో పెట్టుబడి ఖర్చులు ఎకరాకు రూ.లక్ష ఉన్నప్పుడు.. ఎకరాకు 20 క్వింటాళ్లకుపైగా దిగుబడులు వచ్చినప్పుడు కనీస మద్దతు ధర రూ.7 వేలుగా నిర్ణయించాం. గతంలో మీరెప్పుడూ మిర్చికి కనీస మద్దతు ధరలు ప్రకటించలేదు. ఐదేళ్ల క్రితం.. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రం మద్దతు ధర ప్రకటించని పంటలతోపాటు మరికొన్ని పంటలను అదనంగా చేర్చి మొత్తంగా 24 పంటలకు మద్దతు ధరలు ప్రకటించి పోటీ వాతావరణంతో ధరలు పడిపోకుండా అడ్డుకోవడమే కాకుండా ధరలు పెరిగేటట్టు చూశాం.
- ఆ ధరలు ప్రకటించి ఇప్పటికి ఐదేళ్లు అయింది. మరి ఐదేళ్ల తర్వాత పెట్టుబడి ఖర్చులు పెరగవా? అప్పట్లో మిర్చి సాగుకు ఎకరాకు రూ.లక్ష ఖర్చు అయితే ఇప్పుడు రూ.లక్షన్నరకు పైగా వ్యయం అవుతున్న మాట వాస్తవం కాదా? దీనికి కోతనంతర ఖర్చులు అదనమన్న విషయం తెలుసుకోవాలి. ఇప్పుడు కొత్త మద్దతు ధరలు ప్రకటించి రైతులను ఆదుకోవడానికి మీరు ఎందుకు చర్యలు తీసుకోలేదు? రాష్ట్ర ప్రభుత్వమే ఎందుకు కొనుగోలు చేయడం లేదు?
- మా హయాంలో (వైఎస్సార్ సీపీ ప్రభుత్వం) మిర్చి రైతులకు మంచి ధరలు వచ్చాయని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌చౌహాన్‌సింగ్‌కు రాసిన లేఖలో మీరే చెప్పారు. మీరు రాసిన లేఖ ప్రకారమే మా హయాంలో మిర్చికి మోడల్ ధర రూ.20 వేలు ఉంటే గరిష్ట ధర రూ.27 వేలు పలకడం వాస్తవం కాదా?
- మిర్చి రైతుల కడగండ్లపై ఈ జనవరిలో ఉద్యాన శాఖ అధికారులు నివేదించిన తర్వాత అయినా మీరేమైనా కనీసం పట్టించుకున్నారా? మిర్చి రైతుల పరిస్థితి అన్యాయంగా ఉందని, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని నివేదిక ఇచ్చినా ఎందుకు పట్టించుకోలేదు? పైగా తప్పుడు రాజకీయాలు చేస్తూ, మిర్చి కొనుగోళ్లతో సంబంధం లేని కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసి చేతులు దులుపుకొంటారా? మీ చేతిలో ఉన్న మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేయకుండా ఎప్పుడూ మిర్చి కొనుగోళ్లు చేయని నాఫెడ్ ద్వారా కొనాలంటూ లేఖ రాయడం రైతులను నిలువునా మోసం చేయడం, మభ్యపెట్టడం కాదా?
- మిర్చి రైతులకు బాసటగా వెళ్లినందుకు మాపై కేసులు పెట్టారు. మరి ఫిబ్రవరి 15న మీరు పాల్గొన్న మ్యూజికల్ నైట్‌కు ఎన్నికల కోడ్ అడ్డం రాలేదా? నేను మిర్చి రైతులను కలుసుకుంటే ఎన్నికల కోడ్ అడ్డు వచ్చిందా? పైగా మేం ఇప్పుడు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. నిన్నటి కార్యక్రమంలో ఫలానా వారికి ఓటు వేయమని కూడా చెప్పలేదు. కనీసం మైక్‌లో కూడా మాట్లాడలేదు. అయినా అన్యాయంగా కేసులు మోపడం అప్రజాస్వామికం కాదా?

- మీ హయాంలో పంటలకు కనీస మద్దతు ధరలు లభించడం లేదన్నది వాస్తవం కాదా? పత్తి, పెసర, మినుము, కంది, టమాటా, మిర్చి, మొన్న ధాన్యం సహా అన్ని పంటల రైతులకు కనీస మద్దతు ధరలు లభించక మీరే వారిని సంక్షోభంలో నెట్టిన మాట వాస్తవం కాదా?
- మా హయాంలో ధాన్యం కొనుగోళ్లకు రూ.65 వేల కోట్లు ఖర్చు చేయడమే కాకుండా ఇతర పంటల కొనుగోళ్లకు దాదాపు మరో రూ.7,800 కోట్లు ఖర్చుచేసి రైతన్నలకు అండగా నిలిచాం.
- రైతుల కోసం మేం సృష్టించిన మొత్తం వ్యవస్థలను మీరు నిర్వీర్యం చేశారు. ఆర్బీకేలు, ఈ క్రాప్, ఉచిత పంటల బీమా, సీజన్ ముగిసేలోగా ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ, ఆర్బీకేల్లో కనీస మద్దతు ధరల పోస్టర్లు ప్రదర్శించే విధానం, సీఎం యాప్ ద్వారా కొనుగోలు చేసే విధానం, నాణ్యతను ధ్రువీకరిస్తూ ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతులకు అందుబాటులోకి తెచ్చే విధానం, ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ల వ్యవస్థ, రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు కాల్‌సెంటర్, టోల్ ఫ్రీ నంబరును నిర్వహించే వ్యవస్థ, ఆర్బీకేల్లో కియోస్క్‌లతో రైతులకు తోడుగా నిలిచే విధానం, సున్నా వడ్డీ, పెట్టుబడి సహాయం, రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి.. ఇలా మొత్తంగా వ్యవసాయ రంగంలో మేం తెచ్చిన విప్లవాత్మక విధానాలు, వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారు. వ్యవసాయం దండగ అన్న మీ ఆలోచన, మైండ్ సెట్ ఏమాత్రం మారలేదు చంద్రబాబూ!
- మీ తప్పుడు కేసులకు భయపడి ప్రజా పోరాటాలు ఆపేది లేదు. నేను రైతుల పక్షపాతిని, ప్రజల పక్షపాతిని. మీరు ఎన్ని కేసులు బనాయించినా రైతుల కోసం, ప్రజల కోసం కచ్చితంగా నిలబడతా. చంద్రబాబూ..! ఇప్పటికైనా తక్షణమే మిర్చి రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోండి. ఈ సంక్షోభం నుంచి అన్నదాతలు బయట పడేలా, వారికి ఊరటనిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున వెంటనే కొనుగోళ్లు ప్రారంభించండి.

పాలవలస కుటుంబానికి వైఎస్ జగన్ పరామర్శ





పాలవలస రాజశేఖరం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాజశేఖరం భార్య ఇందుమతికి ధైర్యం చెబుతున్న వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ పాలవలస రాజశేఖరం కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పాలకొండలో పరామర్శించారు. రాజశేఖరం చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించిన అనంతరం ఆయన కుమారుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కుమార్తె, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని ఓదార్చారు. రాజశేఖరం భార్య, జడ్పీటీసీ సభ్యురాలు పాలవలస ఇందుమతికి ధైర్యం చెప్పారు. సీనియర్ నేత రాజశేఖరం మృతి తీరని లోటన్నారు.

కిలోమీటర్ల మేర జనసంద్రం..

సార్వత్రిక ఎన్నికల తర్వాత తొలిసారి పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు వచ్చిన వైఎస్ జగన్‌కు జనం నీరాజనం పట్టారు. విశాఖపట్నం విమానాశ్రయం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.55 గంటలకు పాలకొండ చేరుకున్నారు. దాదాపు మూడు కిలోమీటర్ల మేర పాలకొండ ప్రధాన రహదారి జనంతో కిక్కిరిసిపోయింది. పెద్ద ఎత్తున తరలివచ్చిన వారిని నియంత్రించలేక పోలీసులు చేతులెత్తేశారు.

పాలకొండ కౌన్సిలర్లకు అభినందన..

సంఖ్యా బలం లేకపోయినా చైర్ పర్సన్ పీఠం దక్కించుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నినా లొంగకుండా నిలబడిన పాలకొండ నగర పంచాయతీ కౌన్సిలర్లను వైఎస్ జగన్ అభినందించారు. రాజశేఖరం నివాసం వద్ద వారితో మాట్లాడారు. టీడీపీ కూటమి సర్కారు చేష్టలతో గంజాయి వనంలా మారిన రాజకీయాల్లో తులసి మొక్కలా నిలబడి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు నిబద్ధత చాటారని చెప్పారు. తాము ఎప్పటికీ పార్టీలోనే ఉంటామని కౌన్సిలర్లు నినదించారు.

పాలకొండలో కిక్కిరిసిన రహదారులు

కట్లతో వచ్చిన కార్యకర్తలను చూసి...

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ వెంట నిలిచారనే కక్షతో గత ఆదివారం టీడీపీ నాయకులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డ రాజాం నియోజకవర్గం బొమ్మి నాయుడు వలసకు చెందిన బల్ల గొల్లబాబు, కోటా చిన్నారావు, కోలా ఈశ్వరరావు, పాచినవలస పాపారావు, నర్సింగరావు శరీరానికి కట్లతో వైఎస్ జగన్‌ను చూసేందుకు వచ్చారు. వారిని గమనించిన వైఎస్ జగన్ తన కాన్వాయ్‌ను ఆపి దగ్గరకు రావాలని కోరారు. వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వారి యోగ క్షేమాల బాధ్యతను మజ్జి శ్రీనివాసరావు, డాక్టర్ తలే రాజేష్‌కు అప్పగించారు. పాలకొండకు చెందిన ముదిల జ్యోతి క్యాన్సర్‌తో బాధపడుతున్న తన ఐదేళ్ల కుమారుడిని తీసుకుని అక్కడకు వచ్చింది. 'అన్నా.. నా కొడుకును కాపాడండి' అంటూ వేడుకుంది. వారిని చూసి హెలికాప్టర్ నుంచి కిందకు దిగిన వైఎస్ జగన్ ఆ బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. చిన్నారి బాధ్యతను మజ్జి శ్రీనివాసరావుకు అప్పగించారు. సాయంత్రం 4.15 గంటల సమయంలో పాలవలస నుంచి వైఎస్ జగన్ తిరిగి బయల్దేరారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, పార్టీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ మంత్రులు పాముల పుష్ప శ్రీవాణి, పీడిక రాజన్నదొర, సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, పెనుమత్స సురేష్ బాబు, దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, అలజంగి జోగారావు, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బొత్స అప్పల నర్సయ్య, కడుబండి శ్రీనివాస్, కంబాల జోగులు, గొర్లె కిరణ్, శ్రీకాకుళం జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, రాజాం సమన్వయకర్త డాక్టర్ తలే రాజేష్, తదితరులు జగన్ వెంట ఉన్నారు.



పాలకొండలో అశేష జనవాహినికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివాదం

'మార్గదర్శి' మోసాల కేసు మూత?

బాబు డైరెక్షన్‌లో ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించిన సీఐడీ • రూ.1,050 కోట్ల మార్గదర్శి ఆస్తుల జప్తుపై రాజకీయ ఒత్తిళ్లతో ఇప్పటికే అప్పీళ్లు ఉపసంహరణ

> ఆర్బీఐ సెక్షన్ 45 (ఎస్)కి విరుద్ధంగా మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్లను సేకరించిన వ్యవహారంలో రామోజీ, ఆయన కుటుంబ సభ్యులను రక్షించేందుకు ఎంత చేయాలో అంత చేస్తూ వస్తున్న చంద్రబాబు ప్రభుత్వం.. ఇప్పుడు రామోజీ కుటుంబానికి ఆర్థికంగా అత్యంత కీలకమైన మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ విషయంలోనూ అదే రీతిలో వ్యవహరించింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలపై దాఖలు చేసిన అప్పీళ్లను సీఐడీ ద్వారా ఇప్పటికే ఉపసంహరింప చేసిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు మరింత బరి తెగించి మార్గదర్శి చిట్‌ఫండ్‌పై అసలు కేసు నమోదు చేయడమే 'పొరపాటు..' అంటూ దర్యాప్తు సంస్థతో చెప్పించింది.

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్ అక్రమాలు, ఆర్థిక అవకతవకలకు కీలక ఆధారాలున్నాయని గతంలో బల్లగుద్ది గట్టిగా వాదించిన సీఐడీ.. చంద్రబాబు ప్రభుత్వం ఒత్తిడితో ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించింది. తాము సేకరించిన మౌఖిక, రాతపూర్వక ఆధారాలేవీ మార్గదర్శి చిట్‌ఫండ్ అక్రమాలను రుజువు చేసేవి కావంటూ నిస్సహాయంగా చేతులెత్తేసింది. ఈమేరకు మార్గదర్శి చిట్‌ఫండ్ విషయంలో కేసు నమోదు చేయడం పొరపాటు అంటూ సంబంధిత కోర్టులో ఫైనల్ రిపోర్ట్ దాఖలు చేయనున్నట్లు దర్యాప్తు సంస్థ హైకోర్టుకు నివేదించింది. మార్గదర్శి అక్రమాలను నిరూపించేందుకు అన్ని ఆధారాలున్నాయని గతంలో తేల్చి చెప్పిన సీఐడీ హఠాత్తుగా స్వరం మార్చడం వెనుక సీఎం చంద్రబాబు ఒత్తిళ్లు తీవ్ర స్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది. బాబు డైరెక్షన్‌లో.. ఆయన ఆదేశాల మేరకు దర్యాప్తు సంస్థ నడుచుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. రాజగురువు రామోజీ లేనప్పటికీ ఆయన కుటుంబం పట్ల చంద్రబాబు సర్కారు రాజభక్తిని చాటుకుంటూనే ఉంది! రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా నిబంధనలకు విరుద్ధంగా... ఆర్బీఐ సెక్షన్ 45 (ఎస్) తమకు వర్తించదంటూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ చట్ట విరుద్ధంగా అక్రమ డిపాజిట్లను సేకరించిన వ్యవహారంలో రామోజీరావు, ఆయన కుటుంబ సభ్యులను రక్షించేందుకు ఎంత చేయాలో అంత చేస్తూ వస్తున్న చంద్రబాబు ప్రభుత్వం.. ఇప్పుడు రామోజీ కుటుంబానికి ఆర్థికంగా అత్యంత కీలకమైన మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ విషయంలోనూ అదే రీతిలో వ్యవహరించింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల విషయంలో దాఖలు చేసిన అప్పీళ్లను సీఐడీ ద్వారా ఇప్పటికే ఉపసంహరింప చేసిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు మరింత బరి తెగించింది. ఏకంగా మార్గదర్శి చిట్‌ఫండ్‌పై కేసు నమోదే 'పొరపాటు..' అంటూ సీఐడీ చేత చెప్పించింది. అంతేకాక ఇప్పటి వరకు సాగించిన దర్యాప్తులో సేకరించిన మౌఖిక, రాతపూర్వక ఆధారాలు ఏవీ కూడా మార్గదర్శి చిట్‌ఫండ్‌పై పెట్టిన కేసును నిరూపించేవిగా లేవంటూ సీఐడీతో ఏకంగా హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయించింది. మార్గదర్శి చిట్‌పై కేసు నమోదు 'పొరపాటు..' (మిస్టేట్ ఆఫ్ ఫ్యాక్ట్) అంటూ సంబంధిత కోర్టులో ఫైనల్ రిపోర్ట్ దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేయించింది. ఇక ఫైనల్ రిపోర్ట్ దాఖలు చేసేందుకు సీఐడీ అదనపు డీజీ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ అనుమతి మంజూరు చేయడమే తరువాయి. తద్వారా మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలు ఎప్పటికీ బహిర్గతం కాకుండా శాశ్వతంగా సమాధి కట్టాలని బాబు సర్కారు నిర్ణయించింది.

ఒకవైపు తెలంగాణ హైకోర్టులో మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్ల కేసులో రామోజీరావు చట్ట విరుద్ధంగా వ్యవహరించారని ఆర్‌బీఐ బహిర్గతం చేయగా.. మరోవైపు చంద్రబాబు ప్రభుత్వం మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలకు ఆధారాల్లేవని ఏపీ హైకోర్టులో సీఐడీ చేత చెప్పించడం గమనార్హం. మరో కీలక విషయం ఏమిటంటే.. తెలంగాణ హైకోర్టులో మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాల కేసు విచారణకు వచ్చిన రోజే.. ఏపీ హైకోర్టులో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు అనుకూలంగా సీఐడీ కౌంటర్ దాఖలు చేయడం. చట్ట ఉల్లంఘనలకు పాల్పడినందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కి చెందిన రూ.1,050 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు సంబంధించి హైకోర్టులో సీఐడీ దాఖలు చేసిన అప్పీళ్లను ఆ సంస్థ చేత చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపసంహరింప చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఏకంగా మార్గదర్శిపై కేసు నమోదు చేయడం 'పొరపాటు' అంటూ సీఐడీ దాఖలు చేసే తుది నివేదికను సంబంధిత కోర్టు ఆమోదిస్తే చంద్రబాబు ప్రభుత్వం విజయం సాధించినట్లే! మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కేసు క్లోజ్ అయినట్లే!!

> 14) It is humbly submit that, Later on 12-08-2024 the then I.O S.Rajasehara Rao, Addl.SP, CID, RO, Vijayawada addressed a letter to the ADGP, CID, AP to issue necessary instructions to refer the case as "NO EVIDENCE" and to file the final report in the Hon'ble Court accordingly.

కేసుని నిరూపించేందుకు తగిన ఆధారాలు లేవంటూ కౌంటర్‌లో నివేదించిన సీఐడీ

> 15) It is humbly submit that, after verifying the material on record and considering the legal opinion, the Additional Director General of Police, CID, AP, Mangalagiri, granted permission to close the case as a mistake of fact/offense not established, as per the proceedings in C.No:5110/EOW,C-13/CID-AP/2024, dated 16/08/2024.

మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్‌గా కేసుని మూసివేసేందుకు అదనపు డీజీ అనుమతించినట్లు కోర్టులో పేర్కొన్న సీఐడీ

> 17) It is humbly submit that, as the then I.O S.Rajasekhara Rao, Addl.SP, Cid, RO, Vijayawada obtained legal opinion from the legal advisor, Head office, CID in this case to refer the case as mistake of fact and the file the final report in the concerned Court. Later the then I.O G.Srinivas, DSP, CID, RO, Vijayawada forwarded the final report to the ADGP, CID, AP, Mangalagiri, seeking permission to file it in the concerned court, refer the case as "Mistake of Fact".

మార్గదర్శిపై కేసు మూసివేత కోసం ఫైనల్ రిపోర్టుని అదనపు డీజీ అనుమతి కోసం పంపనున్న సీఐడీ

చిట్స్ రిజిస్ట్రార్ ఫిర్యాదుతో రంగంలోకి సీఐడీ...

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆర్థిక అవకతవకలు, తప్పుడు రికార్డుల నిర్వహణ, నిధుల మళ్లింపు, ఇతర చట్ట ఉల్లంఘనలపై చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ 2023 మార్చి 10న సీఐడీకి ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఈ ఫిర్యాదు ఆధారంగా అదే రోజు రామోజీరావు, శైలజా కిరణ్, మార్గదర్శి చిట్స్ ఆడిటర్ కుదరవల్లి శ్రవణ్‌లతో పాటు మొత్తం 15 మందిపై ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), ఏపీ డిపాజిటర్ల పరిరక్షణ చట్టం, చిట్‌ఫండ్ చట్ట నిబంధనల కింద సీఐడీ కేసులు నమోదు చేసింది. అనంతరం మార్గదర్శి చిట్స్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించి కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది. పలువురు ఖాతాదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించింది. వారు ఇచ్చిన వాంగ్మూలాలను రికార్డ్ చేసింది. గడువు ముగిసి ష్యూరిటీలు సమర్పించిన తరువాత కూడా బ్రాంచ్ మేనేజర్లు సకాలంలో చెల్లింపులు చేయడం లేదని పలువురు చందాదారులు దర్యాప్తు సంస్థకు వాంగ్మూలం ఇచ్చారు. సాకులు చెబుతూ ష్యూరిటీలను తిరస్కరించడం, అదనపు ష్యూరిటీలు సమర్పించాలని కోరడంతో పాటు ప్రైజ్ మొత్తాలను చెల్లించకుండా మార్గదర్శి ఇబ్బంది పెడుతోందని చందాదారులు స్పష్టంగా చెప్పారు. సకాలంలో చెల్లింపులు చేయకపోవడం, చెల్లించాల్సిన ప్రైజ్ మొత్తాన్ని డిపాజిట్‌గా తమ వద్దే అట్టిపెట్టుకోవడం, తక్కువ వడ్డీ చెల్లించడం, చెల్లింపులు ఎగవేయడం లాంటి ఉల్లంఘనలకు మార్గదర్శి చిట్స్ పాల్పడినట్లు సీఐడీ దర్యాప్తులో తేలింది. అనంతరం ఆ సంస్థ ఆడిటర్ కుదరవల్లి శ్రవణ్‌ను 2023 మార్చి 29న అరెస్ట్ చేసింది. అనంతరం సంబంధిత కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది.

అప్పట్లో మార్గదర్శికి వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడిన సీఐడీ

శ్రవణ్ కుమార్ అరెస్ట్‌ను, రిమాండ్‌ను ప్రశ్నిస్తూ ఆయన భార్య నర్మదతో పాటు శ్రవణ్ కుమార్ కూడా ఆశ్చర్యకరంగా 'హెబియస్ కార్పస్' రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. కీలక స్థానాల్లో 'అనుకూల' వ్యక్తులు ఉండటంతోనే అసాధారణ రీతిలో వీరు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారన్న ప్రచారం అప్పట్లో గట్టిగా సాగింది. ఈ పిటిషన్‌ను అప్పట్లో తీవ్రంగా వ్యతిరేకించిన సీఐడీ చాలా గట్టిగా వాదనలు వినిపించింది.

ఆధారాల్లేవంటూ తాజాగా కౌంటర్

మార్గదర్శి చిట్‌ఫండ్ విషయంలో కేసు నమోదు చేయడం పొరపాటు అని సంబంధిత కోర్టులో ఫైనల్ రిపోర్ట్ దాఖలు చేయనున్నామంటూ హైకోర్టులో దాఖలు చేసిన తాజా కౌంటర్‌లో నివేదించింది. సంబంధిత కోర్టులో ఫైనల్ రిపోర్ట్ దాఖలు చేసేందుకు సీఐడీ అదనపు డీజీని అనుమతి కోరినట్లు సీఐడీ విజయవాడ ప్రాంతీయ కార్యాలయం అదనపు ఎస్పీ డి.ప్రసాద్ తన కౌంటర్‌లో హైకోర్టుకు తెలిపారు. ఆధారాలు చాలకపోవడంతో మార్గదర్శిపై నమోదు చేసిన కేసును మూసివేసేందుకు అనుమతి కోరుతూ అప్పటి దర్యాప్తు అధికారి రాజశేఖరరావు సీఐడీ అదనపు డీజీకి గత ఏడాది ఆగస్టు 12న లేఖ రాశారని, ఆ లేఖను పరిశీలించిన అదనపు డీజీ మార్గదర్శి చిట్‌ఫండ్‌పై కేసు మూసివేతకు ఆగస్టు 16న అనుమతినిచ్చారని పేర్కొన్నారు. దీంతో తుది నివేదిక సిద్ధం చేసి కోర్టులో దాఖలు చేసేందుకు అనుమతినివ్వాలని అదనపు డీజీని కోరామన్నారు.

నాడు కీలక ఆధారాలు ఉన్నాయన్న సీఐడీ..

వాస్తవానికి మార్గదర్శి చిట్‌ఫండ్స్ అవకతవకలపై దర్యాప్తు జరిపిన సీఐడీ పకడ్బందీగా అన్ని ఆధారాలను సేకరించింది. ఇదే విషయాన్ని గతంలోనే హైకోర్టుకు నివేదించింది. మార్గదర్శి చిట్‌ఫండ్ అక్రమాల కేసులో సంస్థ యజమాని శైలజా కిరణ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ వినిపించిన వాదనల సందర్భంగా ఈ విషయాన్ని చెప్పింది. మార్గదర్శి చిట్‌ఫండ్‌కు వ్యతిరేకంగా కీలక ఆధారాలున్నాయని, అందువల్ల బెయిల్ ఇవ్వొద్దంటూ గట్టిగా వాదనలు వినిపించింది. సీఐడీ సేకరించిన ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఖాతాదారుల ప్రయోజనాలను పరిరక్షించే నిమిత్తం చట్ట ప్రకారం మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన దాదాపు రూ.1,050 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. మార్గదర్శి చిట్‌ఫండ్ అక్రమాలు, అవకతవకలకు కీలక ఆధారాలున్నాయని అప్పుడు తేల్చి చెప్పిన సీఐడీ ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం రాగానే ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించింది. తాము సేకరించిన మౌఖిక, రాతపూర్వక ఆధారాలేవీ కూడా మార్గదర్శి చిట్‌ఫండ్ అక్రమాలను రుజువు చేసేవిగా లేవంటూ నిస్సిగ్గుగా, నిస్సహాయంగా చేతులెత్తేసింది.

మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల్లో మచ్చుకు..

సకాలంలో చందాదారులకు చెల్లింపులు చేయకపోవడం.. చెల్లించాల్సిన ప్రైజ్ మొత్తాన్ని డిపాజిట్‌గా తమ వద్దే అట్టిపెట్టుకోవడం.. తక్కువ వడ్డీ చెల్లించడం.. చెల్లింపులు ఎగవేయడం.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల్లో మచ్చుకు కొన్ని! చందాదారులకు చెల్లించాల్సిన ప్రైజ్‌మనీని చెల్లించకుండా వడ్డీ చెల్లింపు పేరుతో తమ వద్దే అట్టిపెట్టుకోవడానికి ప్రధాన కారణం ఏమిటంటే... చెల్లింపులు చేయడానికి మార్గదర్శి చిట్‌ఫండ్స్ వద్ద సరిపడినంత డబ్బు లేకపోవడమే. తన వద్ద డబ్బు లేదు కాబట్టి చందాదారులకు చెల్లించాల్సిన డబ్బునే భవిష్యత్తులో చెల్లించాల్సిన చందాగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ వద్దే అట్టిపెట్టుకుంది. అలా అట్టిపెట్టుకున్న మొత్తాలను మార్గదర్శి రొటేషన్ చేస్తూ వస్తోంది. చట్ట ప్రకారం చందాదారుల డబ్బును ప్రత్యేక ఖాతాల్లో ఉంచడం తప్పనిసరి. కానీ మార్గదర్శిలో అలా ఉంచకుండా దాన్ని ఇతర అవసరాలకు మళ్లించేశారు. ఈ ఉల్లంఘనలన్నీ డిపాజిటర్ల పరిరక్షణ చట్టం పరిధిలోకి వస్తాయి.



పెట్రోల్, డీజిల్.. మన దగ్గరే చీప్

ప్రపంచ దేశాలన్నింటిలోకీ మనదేశంలోనే పెట్రోల్, డీజిల్ ధరలు ఎక్కువగా ఉన్నాయి అనుకుంటాం. కానీ, 2021 నవంబరు నుంచి 2024 డిసెంబరు మధ్య కాలంలో చూస్తే.. ప్రపంచ దేశాల్లో పెట్రోలియం, డీజిల్ ధరలు భారీగా తగ్గిన దేశం మనదే. పొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్‌లలో పెట్రోల్ ధరలు 12 శాతం నుంచి 54 శాతం వరకు పెరిగితే, డీజిల్ ధరలు 29 నుంచి 98 శాతం వరకు పెరిగాయి. ఫ్రాన్స్, కెనడా లాంటి సంపన్న దేశాల్లోనూ 11 నుంచి 15 శాతం వరకు ధరలు పెరిగాయి. ఈ విషయాన్ని రాజ్యసభలో ఇటీవల కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

దేశం	ధరల పెరుగుదల (శాతంలో)	
	పెట్రోల్	డీజిల్
భారత్ (ఢిల్లీ)	-13.60	-10.92
శ్రీలంక	54.29	98.59
పాకిస్థాన్	27.90	33.37
ఫ్రాన్స్	11.07	10.99
కెనడా	5.55	15.06
స్పెయిన్	5.14	8.58
ఇటలీ	5.21	7.38
జర్మనీ	3.40	6.86
అమెరికా	1.36	6.90

కాల్ మెర్జింగ్‌తో కాజేస్తారు!

సైబర్ మోసాల సరికొత్త రూపు

ఫోన్ కాల్ మెర్జింగ్‌తో ఖాతాలు ఖాళీ

అప్రమత్తంగా ఉండాలని యూపీఐ సూచన



సాక్షి, హైదరాబాద్: దేశంలో సైబర్ నేరగాళ్లు రోజుకో రూపంలో అమాయకులను మోసం చేసి డబ్బు కొల్లగొడుతున్నారు. తాజాగా కాల్ మెర్జింగ్ స్కాంకు తెరలేపారు. మనకు తెలియకుండానే మన నుంచి ఓటీపీలు తీసుకుని మన బ్యాంకు ఖాతాలను కాజేస్తున్నారు. ఈ తరహా మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కు చెందిన ది యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) హెచ్చరించింది. అపరిచితులు ఫోన్ చేసి అడిగితే ఎట్టి పరిస్థితుల్లో ఓటీపీలను చెప్పవద్దని సూచించింది.

కాల్ మెర్జింగ్ స్కాం అంటే?

ఒక అపరిచితుడు మీ ఫోన్ నంబర్‌ను మీ స్నేహితుడి నుంచి తీసుకున్నానని చెబుతూ కాల్ చేయడంతో ఈ స్కాం ప్రారంభమవుతుంది. మీతో ఫోన్ మాట్లాడుతూనే.. మీ స్నేహితుడు వేరే నంబర్ నుంచి కాల్ చేస్తున్నాడని చెప్పి, రెండు కాల్స్‌ను విలీనం (మెర్జ్) చేయమని స్కామర్ అడుగుతాడు. ఆ 'స్నేహితుడి'కాల్ నిజంగా మీ మిత్రుడిది కాదు. అది బ్యాంకు ఓటీపీ కాల్. స్కామర్ అడగ్గానే మీరు కాల్ విలీనానికి అనుమతిస్తే సదరు వ్యక్తి వెంటనే బ్యాంకు ధ్రువీకరణకు సంబంధించిన ఓటీపీ కాల్‌తో కనెక్ట్ అవుతాడు. ఇలా బ్యాంకు కాల్ నుంచి వచ్చే ఓటీపీని అవతలి నుంచి వింటున్న సైబర్ మోసగాళ్లు సేకరిస్తారు. అప్పటికే బ్యాంకు వివరాలు తీసుకుని పెట్టుకునే సైబర్ మోసగాళ్లు..ఆ ఓటీపీని ఉపయోగించి మీ బ్యాంకు ఖాతాల్లోంచి డబ్బులు కొల్లగొడతారు. ఇదంతా కచ్చితమైన సమయంలోపు పూర్తిచేస్తారు. మీరు బ్యాంకు ఓటీపీ వారికి చెప్పినట్లు కూడా గుర్తించలేరు.

కాల్ మెర్జింగ్ స్కాంకు చిక్కకుండా ఉండాలంటే?

- అపరిచిత వ్యక్తులు మీకు ఫోన్ చేసి, మరో నంబర్ నుంచి వస్తున్న కాల్‌ను మెర్జ్ చేయాలని కోరితే అది కచ్చితంగా మోసమని గ్రహించాలి.
- మీకు అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మేం బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, లేదా మీకు స్నేహితుడికి స్నేహితుడిని అని చెప్తే నమ్మవద్దు.
- అనుమానాస్పద ఫోన్‌కాల్స్‌పై వెంటనే సైబర్ సెక్యూరిటీ బ్యూరో టోల్‌ఫ్రీ నంబర్ 1930లో ఫిర్యాదు చేయాలి.
- మీరు ఓటీపీ పంచుకున్నట్టు అనుమానం వస్తే వెంటనే మీ బ్యాంకు అధికారులకు సమాచారం ఇచ్చి డబ్బులు పోకుండా తగిన చర్యలు తీసుకోవాలి.



మార్చి 5న గోదావరి బోర్డు సమావేశం

సాక్షి, అమరావతి: గోదావరి బోర్డు 17వ సర్వ సభ్య సమావేశం మార్చి5వ తేదీన హైదరాబాద్‌లోని జలసౌధలో జరుగుతుందని బోర్డు సభ్య కార్యదర్శి రంగస్వామి అజగేశన్ వెల్లడించారు. ఈ మేరకు ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు గురువారం ఆయన లేఖ రాశారు. గోదావరి బోర్డు చైర్మన్ ఏకే ప్రధాన్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో గోదావరి నదీ పరీవాహక ప్రాంతం (బేసిన్)లో రెండు రాష్ట్రాల్లో అనుమతి లేని ప్రాజెక్టుల డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక)లు.. బోర్డు పరిధిని నిర్దేశిస్తూ 2021, జూలై 15న కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ అమలే ప్రధాన అజెండాగా చర్చలు జరుగుతాయని తెలిపారు.

మాకు చేతకావడం లేదు

గత ప్రభుత్వ హయాంలోనే ఏపీఎస్ఎఫ్ఎల్ ప్రసారాలు బాగున్నాయి

- మేం తొమ్మిది నెలల్లో ఒక్క కనెక్షన్ కూడా ఇవ్వలేకపోయాం
- ఉన్న కనెక్షన్లకు కూడా సరిగా ప్రసారాలు చేయలేకపోతున్నాం
- ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి ఆగ్రహం
- ముగ్గురు అధికారులను టెర్మినేట్ చేస్తున్నామని ప్రకటన


సాక్షి, అమరావతి: 'తొమ్మిది నెలల్లో ఎటువంటి పురోగతి లేని సంస్థ రాష్ట్రంలో ఏదైనా ఉందంటే అది ఒక్క ఏపీ ఫైబర్‌నెట్ లిమిటెడ్(ఏపీఎస్ఎఫ్ఎల్) మాత్రమే. మేం అధికారం చేపట్టిన తర్వాత నుంచి ఒక్క కనెక్షన్ ఇవ్వలేదు. అంతేకాదు... ఉన్న కనెక్షన్లకు కూడా ప్రసారాలు నిరంతరాయంగా ఇవ్వలేకపోతున్నాం. దీనిపై కేబుల్ ఆపరేటర్లు, వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఇప్పుడు అధికారులు శవాలపై పేలాలు ఏరుకుంటున్నారు...' అంటూ ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఆయన గురువారం విజయవాడలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఐఏఎస్ అధికారి, ఏపీఎస్ఎఫ్ఎల్ ఎండీ దినేష్‌కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎండీ మరో ముగ్గురు అధికారులు భరద్వాజ(చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్), సురేష్(బిజినెస్ హెడ్), శశాంక్ (ప్రొక్యూర్‌మెంట్ ఆఫీసర్)లతో కలిసి ప్రభుత్వంపై కుట్రకు తెరతీశారని ఆరోపించారు. సంస్థను చంపే కుట్రకు తెరతీసి రాజద్రోహానికి పాల్పడుతున్నారని విమర్శించారు. తక్షణమే భరద్వాజ, సురేష్, శశాంక్‌లను టెర్మినేట్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఏపీఎస్ఎఫ్ఎల్‌లో



410మంది అక్రమ నియామకాలను రద్దు చేస్తే వారిని ఇంతవరకు తొలగించకుండా జీతాలు చెల్లిస్తున్నారని చెప్పారు. అధికారుల అలసత్వం కారణంగా జీఎస్టీ అధికారులు రూ.370 కోట్ల పెనాల్టీ విధించారని తెలిపారు. ఈ మొత్తాన్ని ఏపీఎస్ఎఫ్ఎల్ చెల్లించదని, జీఎస్టీ పెనాల్టీకి కారణమైన ఎండీ దినేష్‌కుమార్, ఈడీ(హెచ్ఆర్) రమేష్‌నాయుడు నుంచి రికవరీ చేయాలన్నారు. విజిలెన్స్ కమిటీ రూ.60 కోట్ల చెల్లింపులను నిలిపివేయాలని చెప్పినా.. వారు చెల్లించేశారని తెలిపారు. ఈ డబ్బులను కూడా వారి నుంచే రికవరీ చేస్తామన్నారు. దినేష్‌కుమార్, రమేష్‌నాయుడుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అడ్వొకేట్ జనరల్‌కు ఫిర్యాదు చేస్తానని, వారి ఆదేశాలకు అనుగుణంగా తాను నడుచుకుంటానని జీవీ రెడ్డి చెప్పారు. ఇప్పటి కంటే గత ప్రభుత్వ హయాంలోనే ఏపీఎస్ఎఫ్ఎల్ ప్రసారాలు బాగున్నాయన్నారు. తాను అధికారులపై మాత్రమే ఆరోపణలు చేస్తున్నానని, దీనికి, వైఎస్సార్‌సీపీకి సంబంధం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కూడా అధికారుల నిర్వాకం వల్లే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నష్టపోయారన్నారు. 'మరో ఆరు నెలల్లో ఏపీఎస్ఎఫ్ఎల్ చనిపోతుంది. దీనికి కారణమైన మా ప్రభుత్వంలోని అధికారుల నిర్వాకం బహిర్గతం చేయకపోతే జీవీ రెడ్డి వల్లే సంస్థ మూత పడింది. కేబుల్ ప్రసారాలు ఆగిపోయాయి. తొలగించిన ఉద్యోగులను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు తీసుకుని కొనసాగిస్తున్నారు.' అని అనుకునే ప్రమాదం ఉందనే ఈ విషయాలను చెబుతున్నానని ఆయన వివరించారు.

బేసిన్‌లో ఒక పంటకైనా నీరివ్వండి

- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌లో తెలంగాణ ప్రభుత్వం వాదన
- తెలంగాణలోని పునరుత్పత్తి జలాలను ఆంధ్రాకు కేటాయించారు
- కృష్ణా, కావేరి పరీవాహకాల మధ్యన సారూప్యతలు
- కావేరి ట్రిబ్యునల్ సూచించిన మేరకు పంట వాస్తవిక నీటి అవసరాన్ని అంచనా వేయాలి



సాక్షి, అమరావతి: కృష్ణా నదీ పరీవాహకంలోని (బేసిన్) తెలంగాణ ప్రాంతంలో పునరుత్పత్తి అయ్యే జలాలను ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రా ప్రాంతానికి కేటాయించారని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణ ప్రభుత్వం ఏకరవు పెట్టింది. రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ కంటే ముందే ఆలమట్టి, నారాయణపూర్, తుంగభద్ర డ్యాం కాలువ వ్యవస్థను చేపట్టి ఉంటే తెలంగాణ ప్రాంతానికి కృష్ణా జలాలు అందేవని పేర్కొంది. ఏపీలో బేసిన్ ఆవలకు కృష్ణా జలాలను భారీగా తరలిస్తున్నారని.. తెలంగాణలో బేసిన్‌లో కనీసం ఒక్క పంటకు కూడా నీళ్లందించలేని దుస్థితి నెలకొందని పేర్కొంది. బేసిన్‌లోని రైతులకు ఒక్క పంటకైనా నీళ్లందించేలా కేటాయింపులు చేయాలని వాదించింది. జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాళపత్ర సభ్యులుగా ఉన్న కేడబ్ల్యూడీటీ-2లో రెండో రోజు గురువారం తెలంగాణ తరపున సీనియర్ కౌన్సిల్ సీఎస్ వైద్యనాథన్ వాదనలు విన్పించారు. కావేరి ట్రిబ్యునల్ అవార్డుపై సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావించారు. నీటి కొరత.. సరఫరా కంటే డిమాండ్లు ఎక్కువ.. వంటి పలు విషయాల్లో కృష్ణా, కావేరి బేసిన్ల మధ్య అనేక సారూప్యతలు ఉన్నాయన్నారు. శాస్త్రీయ పద్ధతుల ఆధారంగా పంట వాస్తవిక నీటి అవసరాన్ని అంచనా వేయాలని కావేరీ ట్రిబ్యునల్ సూచించిందని పేర్కొన్నారు. సాంబ వంటి దీర్ఘకాలిక రకాలను కాకుండా స్వల్పకాలిక, తక్కువ నీరు అవసరమయ్యే పంటలను పండిస్తే నీటిని మిగిల్చి.. మిగతా ఆయకట్టుకు అందించవచ్చని కావేరి ట్రిబ్యునల్ పేర్కొందని వివరించారు. కృష్ణా బేసిన్‌లో కూడా స్వల్పకాలిక, తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగుచేయడం ద్వారా వినియోగాన్ని తగ్గించి.. మిగిలిన నీటిని బేసిన్‌లోని రైతులకు కనీసం ఒక్క పంటకైనా అందించడానికి కేటాయించాలని వాదించారు.

నేడు కృష్ణా బోర్డు అత్యవసర సమావేశం

వేసవిలో తాగునీటి అవసరాలపై చర్చ

సాక్షి, అమరావతి: ప్రస్తుత నీటి సంవత్సరంలో జూలై వరకూ ఉమ్మడి ప్రాజెక్టులు శ్రీశైలం, నాగార్జునసాగర్ కింద తాగునీటి అవసరాలపై చర్చించి, కేటాయింపులే అజెండాగా శుక్రవారం కృష్ణా బోర్డు అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలకు బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే గురువాం లేఖ రాశారు. కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. దిగువ కృష్ణా బేసిన్‌లో 2024–25లో 1,010.134 టీఎంసీల నికర జలాల లభ్యత ఉందని బోర్డు లెక్కగట్టింది. ఉమ్మడి ప్రాజెక్టుల్లో లభ్యత ఉన్న నీటిలో 50% వాటా కోసం తెలంగాణ పట్టుపట్టగా.. పాత వాటాలే కొనసాగించాలని ఏపీ కోరింది. 2 రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపాక పాత వాటాలు అంటే ఏపీకి 66%, తెలంగాణకు 34% నీటిని కేటాయించేలా బోర్డు నిర్ణయం తీసుకుంది. పాత వాటాల ప్రకారం ఏపీకి 666.688 టీఎంసీలు, తెలంగాణకు 343.446 టీఎంసీలు దక్కుతాయి. ఇప్పటివరకూ ఏపీ639.652 టీఎంసీలు వాడుకోగా.. తెలంగాణ 211.691 టీఎంసీలు వినియోగించుకుంది. ఏపీ వాటాలో 27.036 టీఎంసీలు, తెలంగాణ వాటాలో 131.755 టీఎంసీలు మిగిలాయని బోర్డు తేల్చింది.

దయచేసి పాపపై అసభ్య పోస్టులు పెట్టొద్దు

చిన్నారి దేవిక తండ్రి లక్ష్మణ్‌రెడ్డి విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: 'మాది అత్యంత సాధారణ కుటుంబం ..సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నట్లుగా మాకు రూ.కోట్ల ఆస్తులేమీ లేవు. దయచేసి మా పాపపై అసభ్య పోస్టులు పెట్టొద్దు' అని విజయవాడకు చెందిన చిన్నారి దేవికారెడ్డి తండ్రి లక్ష్మణ్‌రెడ్డి వేడుకున్నారు. చిన్నారి దేవికారెడ్డి ఇటీవల విజయవాడలో వైఎస్ జగన్‌ను కలిసి ఫొటో దిగింది. ఆ ఫొటోపై కూడా టీడీపీ శ్రేణులు అసభ్య పోస్టులు పెడుతుండటంతో గురువారం చిన్నారి తండ్రి లక్ష్మణ్ సోషల్ మీడియాలో ఓ వీడియో పోస్టు చేశారు. 'నేను చిన్న ఉద్యోగం చేస్తున్నా. పాపను ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదివించే స్తోమత మాకు లేదు. రవీంద్రభారతి స్కూల్‌లో చదివిస్తున్నా. మా ఆర్థిక స్తోమత బాగాలేకపోవడంతో పాప పది రోజుల నుంచి ఇంట్లోనే ఉంటుంది. జగన్ మా ప్రాంతానికి రావడంతో.. ఆయనపై అభిమానంతో చూడటానికి వెళ్లి ఫొటో దిగింది. మా పాపను ట్రోలింగ్ చేయడం చూస్తుంటే బాధగా ఉంది. ఇప్పుడు నివసిస్తున్న ఇల్లు కూడా అద్దెది. రూ.7 వేలు అద్దె కడుతున్నా. పాపపై అసభ్యంగా పోస్టులు పెట్టొద్దని వేడుకుంటున్నా' అని లక్ష్మణ్ విజ్ఞప్తి చేశాడు.

అడుగడుగునా స్వామి భక్తి..

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల అత్యుత్సాహం

మేయర్ డాక్టర్ శిరీష, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు వాకౌట్



మేయర్ డాక్టర్ శిరీషతో కూటమి కార్పొరేటర్ల వాగ్వాదం

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్, కౌన్సిల్ సాధారణ సమావేశంలో అధికారులు అడుగడుగునా స్వామిభక్తిని ప్రదర్శించడానికి పోటీ పడ్డారు. అధికారుల తీరుకు నిరసనగా కౌన్సిల్ సమావేశాన్ని నగర మేయర్ డాక్టర్ ఆర్ శిరీష వాకౌట్ చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కూడా మేయర్‌కు మద్దతుగా కౌన్సిల్ నుంచి వెళ్లిపోయారు.

డిప్యూటీ మేయర్‌తో ప్రమాణ స్వీకారం

ఎస్వీయూ సెనేట్ హాల్‌లో గురువారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్, కౌన్సిల్ సాధారణ సమావేశం నగర మేయర్ శిరీష అధ్యక్షతన జరిగింది. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ముందుగా డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆర్సీ మునికృష్ణ చేత నిబంధనలకు విరుద్ధంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఇప్పటి వరకు మేయర్‌ను గానీ, డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన వారిచేతగానీ ప్రత్యేకంగా ప్రమాణ స్వీకారం చేయించిన చరిత్ర లేదు. నిబంధనలను అతిక్రమించి, చట్టాలను గౌరవించకుండా, స్వామి భక్తిని చాటుకునేలా అధికారులు వ్యవహరించిన తీరు విమర్శలకు తావిచ్చింది.

రూ.272 కోట్ల వార్షిక బడ్జెట్‌కు ఆమోదం

సమావేశంలో 2025–26 వార్షిక అంచనా బడ్జెట్‌ను సెక్రటరీ రాధిక ప్రవేశ పెట్టారు. మేయర్ శిరీషసహా కార్పొరేటర్లు ఏకగ్రీవంగా బడ్జెట్‌ను ఆమోదించారు. రూ.272కోట్ల వార్షిక అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం లభించింది. అలానే 2024–25 సవరించిన బడ్జెట్ అంచనాకు సైతం కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

అధికారుల తీరుపై మేయర్ అసంతృప్తి

టీడీపీకి ఒక కార్పొరేటర్ మాత్రమే ఉన్నా, ఇటీవల జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ప్రలోభాలు, దాడులు, కిడ్నాప్‌లతో డిప్యూటీ మేయర్ స్థానాన్ని అధికార బలంతో టీడీపీ కై వసం చేసుకున్న తీరును రాష్ట్రమంతా గమనించింది. ఈ క్రమంలో కార్పొరేటర్లు తమ వైపు తిప్పుకునేందుకు ఆస్తుల ధ్వంసానికి పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్‌కు చెందిన ఓ భవనాన్ని కూల్చేక్రమంలో అక్కడే ఉన్న మేయర్ పట్ల డిప్యూటీ సిటీ ప్లానర్ (డీసీపీ) మహాపాత్ర తీరు విమర్శలకు తావిచ్చింది. ఆయా పరిణామాల్లో మహాపాత్ర వ్యవహరించిన తీరు పట్ల కౌన్సిల్ తాజాగా కన్నెర్ర చేసింది. మేయర్ శిరీష ఈ అంశంపై మాట్లాడుతూ తనను ఏకవచనంలో నువ్వు అంటూ సంబోధిస్తూ మహాపాత్ర మాట్లాడడం సరికాదన్నారు. ఆయన మాటతీరును, దురుసు ప్రవర్తనను ఆమె సభముందు వివరించారు. ఆ అధికారిపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని, చట్టపరమైన చర్యలకు కమిషనర్ చొరవ చూపాలని మేయర్ ఆదేశించారు.

కమిషనర్ దాటవేత ధోరణి

ఈ విషయంపై సంబంధిత మహాపాత్ర కౌన్సిల్‌లో తిరిగి నిర్లక్ష్యపు సమాధానం చెప్పారు. దీనికి మేయర్‌తో పాటు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తీవ్ర అభ్యంతరం తెలిపారు. కాగా, కమిషనర్ ఈ సందర్భంగా కలుగ చేసుకుని ''మీకు ఇబ్బంది కలిగి ఉండి ఉంటే సిబ్బంది తరపున క్షమాపణలు కోరుతున్నా'' అంటూ దాటవేత ధోరణితో సమాధానం చెప్పారు. దీనితో మేయర్ అసహనం వ్యక్తం చేశారు. అధికారుల తీరుకు నిరసనగా ఆమె కౌన్సిల్ నుంచి వాకౌట్ చేశారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మేయర్‌కు మద్దతుగా కౌన్సిల్ నుంచి బయటకు వెళ్లారు.

డిప్యూటీ మేయర్ ద్వారా సభ నిర్వహణ

అనంతరం కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించిన తీరు విమర్శలకు తావిచ్చింది. డిప్యూటీ మేయర్‌తో కౌన్సిల్ నిర్వహణపై కమిషనర్ మౌర్య ఉన్నతాధికారులతో మాట్లాడారు. మూడవ వంతు కార్పొరేటర్ల మద్దతు ఉంటే కౌన్సిల్‌ను నిర్వహించవచ్చునని కమిషనర్ ప్రకటించారు. ఆగమేఘాలపై డిప్యూటీ మేయర్ ద్వారా సభను నిర్వహించేందుకు అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. దీంతో మొదటి డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ద్వారా సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని కొనసాగించారు.

ఈసారైనా కనీస పెన్షన్ పెరిగేనా?

ప్రస్తుతం ఈపీఎఫ్ఓ కనీస పింఛన్ రూ.1,000

- ఈ మొత్తాన్ని పెంచాలంటూ కేంద్రంపై కార్మిక సంఘాల ఒత్తిడి
- ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంపు కోసం డిమాండ్
- ఈపీఎఫ్ఓ పెన్షన్ కంటే రాష్ట్రాల్లో ఇచ్చే సామాజిక పింఛన్ ఎక్కువ
- పెంపుపై వచ్చే వారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ తీర్మానం చేసే అవకాశం



సాక్షి, హైదరాబాద్: ఉద్యోగి భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ద్వారా అమలవుతున్న ఉద్యోగుల పెన్షన్ పథకం (ఈపీఎస్) కింద ఇచ్చే కనీస పెన్షన్ పరిమితి పెంచాలనే డిమాండ్ తీవ్రమవుతోంది. ఈ పథకం కింద అర్హత సాధించిన కార్మికులకు పదవీ విరమణ తర్వాత ఇచ్చే కనీస పెన్షన్ కింద రూ.1000గా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈపీఎస్ ద్వారా అందే కనీస పెన్షన్ కార్మికుడి కుటుంబానికి ఏమాత్రం సరిపోవడం లేదు. దేశంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సామాజిక పెన్షన్ పథకం కింద కూడా ఇంతకు రెట్టింపు స్థాయిలో ఇస్తుండటంతో... కనీసం ఆ మేరకైనా పెంచాలనే డిమాండ్‌ను కార్మిక సంఘాలు బలంగా వినిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే ఈపీఎఫ్ఓ, కేంద్ర కార్మిక శాఖకు పెద్ద ఎత్తున వినతులు సైతం సమర్పించాయి. పెన్షన్ పెంపు కోసం కార్మికులు పదేళ్లుగా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

రూ.2 వేలతో ప్రతిపాదనలు

దేశవ్యాప్తంగా ఈపీఎఫ్ఓలో నమోదైన ఎస్టాబ్లిష్‌మెంట్ (వాణిజ్య, వ్యాపార సంస్థ)లు 7.66 లక్షలు. ఈ సంస్థల పరిధిలో ప్రస్తుతం ఈపీఎఫ్ఓ చందాదారులుగా ఉన్న వారు 7.37 కోట్లు. వీరంతా ఈపీఎస్ కింద వాటా చెల్లిస్తున్న వారే. మరో 78.49 లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు. ఒక్కో పెన్షనర్ కనీస పెన్షన్ కింద రూ.వెయ్యి చొప్పున అందుకుంటున్నారు. అయితే ఈ పెన్షన్ కింద వచ్చే డబ్బులు కనీసం నెలవారీ బీపీ, మధుమేహంలాంటి దీర్ఘకాలిక వ్యాధుల మందుల ఖర్చులకూ చాలడం లేదంటూ వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కనీస పింఛన్ పెంపు కోసం కార్మిక సంఘాలు కేంద్రంపై తీవ్రంగానే ఒత్తిడి చేస్తున్నాయి. మరోవైపు కనీస పెన్షన్ పెంపుకోసం ఏర్పాటైన కమిటీలు సైతం పెంపును సమర్థిస్తూ కేంద్రానికి నివేదికలు సమర్పించాయి. కనీస పెన్షన్‌ను రూ.2 వేలకు పెంచాలంటూ ప్రతిపాదనలు సైతం పంపాయి. పెన్షన్ పెంపుతో తలెత్తే ఆర్థిక భారాన్ని అధిగమించేందుకు ఆర్థిక శాఖ ద్వారా కొంత సాయం అందించాలన్న అంశాన్ని కూడా ప్రస్తావించాయి. కానీ ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలపని ఆర్థిక శాఖ... కనీస పెన్షన్ పెంపు ప్రతిపాదనలను తిరస్కరించింది.

చందాల రూపంలో రూ.65 వేల కోట్లు

ప్రస్తుతం ఈపీఎఫ్ఓకు నెలవారీ చందాల రూపంలో ఏడాదికి రూ.65 వేల కోట్లు సమకూరుతోంది. అదేవిధంగా పెన్షన్ నిధి నిల్వలతో వచ్చే వడ్డీ సైతం భారీగా జమ అవుతోంది. అంతేకాకుండా ఈపీఎఫ్ఓ ద్వారా సెక్యూరిటీస్‌లో పెట్టుబడులతోనూ భారీగా ఆదాయం వస్తోంది. ఈ పరిస్థితుల్లో కనీస పెన్షన్ రెట్టింపు చేసినా ఆర్థిక భారం ఉండదనేది కార్మిక సంఘాల వాదన. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్థిక శాఖ సాయం లేకున్నా కనీస పింఛన్ పెంపుతో ఇబ్బందులు ఉండవని సంఘాల నేతలు చెబుతున్నారు. మరోమారు కనీస పెన్షన్ పెంచుతూ కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఈపీఎఫ్ఓ ట్రస్టీలు సైతం సూచిస్తున్నారు. వచ్చే వారంలో ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) సమావేశం జరగనుంది. అందులోనైనా కనీస పెన్షన్‌పై తీర్మానం చేసి కేంద్ర కార్మిక శాఖకు సమర్పించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఈపీఎఫ్ఓలో నమోదైన ఎస్టాబ్లిష్‌మెంట్లు, చందాదారులు, పెన్షనర్లు ఇలా..

కేటగిరీ	ఎస్టాబ్లిష్‌మెంట్లు	చందాదారులు	పెన్షనర్లు
దేశంలో	7,66,254	7,37,39,204	78,49,338
తెలంగాణ	34,052	41,64,917	3,51,627
ఆంధ్రప్రదేశ్	20,211	14,99,530	2,64,925

'ఎస్జీటీలకు టెన్త్ పరీక్షల విధులు వద్దు'

సాక్షి, అమరావతి: ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలకు పదో తరగతి పబ్లిక్ పరీక్షల విధులు కేటాయించవద్దని ఆంధ్రప్రదేశ్ పూలే టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు అన్నం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వాసిలి సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. పదో తరగతి పరీక్షల విధుల నుంచి ఎస్జీటీలను మినహాయించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) అధ్యక్షుడు ఎ.జి.ఎస్. గణపతిరావు, ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు మరో ప్రకటనలో కోరారు.

కోడ్ అమలులో ఉండగా భద్రత కల్పించకూడదు

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



సాక్షి, అమరావతి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గుంటూరు పర్యటనకు వెళ్లిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పోలీసులు భద్రత కల్పించలేదని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కోడ్ అమలులో ఉండగా భద్రత కల్పించకూడదన్నారు. ఒక వేళ భద్రత కల్పిస్తే పోలీసుల ఉద్యోగాలు పోతాయని, అందుకే పోలీసులు పర్యటనకు దూరంగా ఉన్నారన్నారు. సచివాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

సంచార పశువైద్యసేవలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

- టోల్ ఫ్రీ నం.1962కు ఫిర్యాదు చేయండి
- పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ టి.దామోదర నాయుడు

సాక్షి, అమరావతి: సంచార పశువైద్యసేవల్లో ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర నాయుడు హెచ్చరించారు. ఈ సేవల్లో ఏదైనా ఆటంకం ఏర్పడితే టోల్ ఫ్రీ నం.1962కు లేదా సమీప పశువైద్యాధికారిని సంప్రదించాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంచార వైద్య సేవలందించే అధీకృత ఏజెన్సీ కాలపరిమితి ఇటీవలే ముగిసిందని, అర్హత కలిగిన ఏజెన్సీల ఎంపిక కోసం టెండర్లు పిలిచామని తెలిపారు. కేంద్ర నిబంధనల మేరకు ఏజెన్సీ ఎంపిక ప్రక్రియ జరుగుతోందని, మరికొన్ని రోజుల్లోనే అన్ని అర్హతలున్న ఏజెన్సీ ద్వారా మెరుగైన రీతిలో పూర్తి స్థాయిలో సంచార వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

పారదర్శకంగా దివ్యాంగుల పింఛన్ల వెరిఫికేషన్

ఎంఎస్ఎంఈ, సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దివ్యాంగుల పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని ఎంఎస్ఎంఈ, సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆయన గురువారం రాష్ట్ర సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 8 లక్షలమంది దివ్యాంగులకు సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, ఇప్పటి వరకూ 1.20 లక్షల పింఛన్ల వెరిఫికేషన్ పూర్తయినట్లు చెప్పారు. గతంలో ఉన్న నిబంధనల ప్రకారమే ఈ పింఛన్ల వెరిఫికేషన్ జరుగుతోందని తెలిపారు. ఎంఎస్ఎంఈ సర్వే ఇప్పటికే 50 శాతం పూర్తయిందన్నారు.

పోలీస్ డ్యూటీమీట్ విజేతలకు డీజీపీ అభినందన

సాక్షి, అమరావతి: అఖిల భారత పోలీస్ డ్యూటీమీట్‌లో విజేతలుగా నిలిచిన రాష్ట్ర పోలీసు జట్లను డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా అభినందించారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో నిర్వహించిన ఈ పోటీల్లో వ్యక్తిగత విభాగంలో ఫోరెన్సిక్ సైన్స్, క్రిమినల్ లా, మెడికో లీగల్ విభాగాల్లో ఎస్ఐ కె.కృష్ణమూర్తి స్వర్ణ పతకాలు సాధించారు. మొత్తం 4 స్వర్ణ, 1 రజత, 2 కాంస్య పతకాలతో ఏపీ పోలీస్ జట్లు పతకాల పట్టికలో ద్వితీయస్థానంలో నిలిచాయి. పతక విజేతలు గురువారం మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించారు.

'బకాయిలు చెల్లించాలి'

సాక్షి, అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ రూ.25 వేల కోట్ల చెల్లింపుపై వెంటనే విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఇందులో భాగంగా ఉద్యోగులకు అమరావతితో పాటు 26 జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వం సబ్సిడీపై ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆ సంఘం అధ్యక్షుడు హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. కాంట్రాక్టర్ల బకాయిలు చెల్లిస్తున్న ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఒక్కో ఉద్యోగికి రూ.5 లక్షలకుపైగా ప్రభుత్వం బకాయి పడిందని, సీపీఎస్ ఉద్యోగులకు ఇది ఇంకా ఎక్కువగా ఉందని తెలిపారు. వచ్చే మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుని ప్రభుత్వం చెల్లింపులు చేయాలని వారు కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావుకు ఏపీటీఎఫ్ మద్దతు

సాక్షి, అమరావతి: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావుకు తమ ఫెడరేషన్ మద్దతు ప్రకటించినట్లు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) అధ్యక్షుడు హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. మండలిలో 5 గ్రాడ్యుయేట్, 5 టీచర్ల కోటా ఎమ్మెల్సీలుగా ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, కర్షక, పెన్షనర్ల సమస్యలపై అవగాహన ఉన్నవారిని, ఆ సమస్యలను పరిష్కరించేందుకు ప్రశ్నించేతత్వం ఉన్నవారిని ఎన్నుకోవాలని కోరారు.

> వారు ఆకలితో ఉన్నప్పుడు ఆయనే వారికి ఆహారమిచ్చాడు మరియు ఆయనే వారిని భయం (ప్రమాదం) నుండి కాపాడాడు.
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 21 ఫిబ్రవరి 2025

ఉదారతకు ట్రంప్ వీడ్కోలు!

రెండోసారి అమెరికా అధ్యక్ష పీఠం ఎక్కింది మొదలు వ్యవస్థల్ని ఎడాపెడా తొక్కుకుంటూ పోతున్న డోనాల్డ్ ట్రంప్ దృష్టి ప్రపంచ దేశాలకు ఉదారంగా సాయం అందించే అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (యూఎస్ ఎయిడ్)పై పడింది. గత నెల 27నే ఆ సంస్థ కార్యకలాపాలను నిలిపేస్తూ ఆయన ఉత్తర్వులిచ్చారు. దాన్నుంచి విడుదలయ్యే నిధుల గురించి సమీక్షించి ఆ పంపిణీని 'మరింత సమర్థంగా', తమ విదేశాంగ విధానానికి అనుగుణంగా వుండేలా రూపుదిద్దుతామని ఆ సందర్భంగా ప్రకటించారు. ఇప్పుడు దాని తాలూకు సెగలూ పొగలూ మన దేశాన్ని కూడా తాకాయి. ఆ సంస్థ నుంచి లబ్ధి పొందింది 'మీరంటే మీర'ని బీజేపీ, కాంగ్రెస్‌లు వాదులాడుకుంటున్నాయి. సామాజిక మాధ్యమాల్లో గాలించి గత చరిత్ర తవ్వి పరస్పరం దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. వెనకా ముందూ చూడకుండా చొరవగా దూసుకెళ్లే బీజేపీయే ఈ వాగ్యుద్ధానికి అంకురార్పణ చేసింది. కాంగ్రెస్, మరికొన్ని పౌర సమాజ సంస్థలూ యూఎస్ ఎయిడ్ నుంచి దండిగా నిధులు పొందాయన్నది బీజేపీ ఆరోపణల సారాంశం. పనిలో పనిగా ప్రపంచ కుబేరుడు జార్జి సోరోస్‌తో కాంగ్రెస్‌కున్న సంబంధాలు మరోసారి ప్రస్తావనకొచ్చాయి. జార్జి సోరోస్‌కు చెందిన ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ నుంచి యూఎస్ ఎయిడ్‌కు ప్రధానంగా నిధులు వస్తాయి గనుక దాన్నుంచి నిధులందుకున్నవారంతా మచ్చపడినవారేనని బీజేపీ అభియోగం. కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మరో అడుగు ముందుకేసి యూఎస్ ఎయిడ్ నిధులతోనే ప్రభుత్వంపై అసంతృప్తిని పెంచే నిరసనోద్యమాలు దేశంలో గత కొన్నేళ్లుగా నడుస్తున్నాయని తేల్చారు. దేశద్రోహులు అనే మాటైతే వాడలేదుగానీ... ఆ చట్రంలో ఇమిడే కార్యకలాపాలన్నిటినీ పరోక్షంగా కాంగ్రెస్‌కూ, ఇతర సంస్థలకూ అంటగడుతూ ఏకరువు పెట్టారు. అటు కాంగ్రెస్ ఊరుకోలేదు. కేంద్రమంత్రి స్మృతీ ఇరానీ ఒకప్పుడు యూఎస్ ఎయిడ్ రాయబారిగా పనిచేయటం, నీతి ఆయోగ్, స్వచ్ఛభారత్ వంటి సంస్థలకు నిధులు రావటం వగైరాలను ప్రస్తావించింది. వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయం వెబ్‌సైట్ సమాచారం ప్రకారం యూఎస్ ఎయిడ్ మన ప్రాథమిక విద్య, ఉపాధ్యాయ శిక్షణ, వ్యవసాయం, తాగునీరు, ఇంధనం వగైరాలకు సాయపడుతున్నది.

ఇదంతా చూస్తుంటే 'గొంగట్లో తింటూ వెంట్రుకలు ఏరడం' నానుడి గుర్తుకొస్తుంది. 1961లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ ఏలుబడిలో ప్రారంభమైన ఈ సంస్థనుంచి నిధులందుకున్న పార్టీలూ, స్వచ్ఛంద సంస్థలూ కొల్లలుగా ఉన్నాయని భావించవచ్చు. ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా అది సాయపడింది. అమెరికా తన బడ్జెట్‌లో ఒక శాతాన్ని అంతర్జాతీయ సాయానికి కేటాయిస్తున్నది. ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం ప్రపంచంలో అత్యధిక మానవతా సాయాన్ని అందించే ఏకైక దేశం అమెరికాయే. అంతర్జాతీయంగా నిరుడు వివిధ దేశాలకు అందిన సాయంలో అమెరికా వాటా 40 శాతం. 2025 ఆర్థిక సంవత్సరానికి యూఎస్ ఎయిడ్ ద్వారా 5,840 కోట్ల డాలర్లు వ్యయం కావొచ్చన్న అంచనా ఉంది. ట్రంప్ ప్రస్తుతం దాన్ని నిలుపుదల చేశారు గనుక ఇందులో ఎంత మొత్తానికి కత్తెరపడుతుందో అంచనా వేయటం కష్టం. మనకైతే ఇకపై రాకపోవచ్చు. ఎందుకంటే ట్రంప్ ఉద్దేశంలో భారత్ సంపన్న దేశం. 2021 నుంచి నిరుడు డిసెంబర్ వరకూ మన దేశానికి 2 కోట్ల డాలర్లు కేటాయించగా అందులో కోటీ 25 లక్షల డాలర్లు అందించినట్టు లెక్కలున్నాయి. ఇదంతా 'ప్రజాతంత్ర భాగస్వామ్యం', పౌర సమాజం కోసం అని యూఎస్ ఎయిడ్ అంటున్నది. ఇందులో 55 లక్షల డాలర్లు నిరుడు జరిగిన ఎన్నికల్లో పెద్దయెత్తున వోటర్లు పాల్గొనేలా చూడటానికి అందించారు. ఏ సంస్థ ఎంత పొందిందన్న వివరాలు మాత్రం లేవు.

దక్షిణ అమెరికాలో అమెజాన్ అడవుల రక్షణ, ఆఫ్రికాలో వ్యాధులు అరికట్టడానికి, ఆడపిల్లల విద్యకు, ఉచిత మధ్యాహ్న భోజనానికి సాయం చేయగా... రష్యా ఇరుగు పొరుగు దేశాల్లో దాని ప్రభావం తగ్గించటానికి, యుద్ధక్షేత్రమైన సిరియాలో ఆస్పత్రుల కోసం, ఉగాండాలో అట్టడుగు తెగల అభ్యున్నతికి, కంబోడియాలో మందుపాతరల తొలగింపునకు, బంగ్లాలో పౌరసమాజం కోసం... ఇలా భిన్నమైన పథకాలకూ, కార్యక్రమాలకూ అమెరికా తోడ్పడుతోంది. అసలు ఎవరైనా ఎందుకు సాయం చేస్తారు? వ్యక్తుల వరకూ చూస్తే తమ ఎదుగుదలకు కారణమైన సమాజానికి తిరిగి ఏదో ఇవ్వాలన్న కృతజ్ఞతా భావన కారణం కావొచ్చు. కానీ ఏ ఉద్దేశమూ లేకుండా అయాచితంగా ఖండాంతరాల్లోని సంపన్న దేశాలు వేరే దేశాలకు ఎందుకు తోడ్పాటునిస్తున్నాయి? చరిత్ర తిరగేస్తే దీని వెనకున్న మతలబు అర్థమవుతుంది. అప్పట్లో సోవియెట్ యూనియన్ ప్రభావం నుంచి ప్రపంచాన్ని 'రక్షించే' బాధ్యత తన భుజస్కంధాలపై వేసుకుని అమెరికా ఈ సాయం మొదలెట్టింది. అటు సోవియెట్ సైతం ఆ పనే చేసేది. ప్రపంచం దాదాపు రెండు శిబిరాలుగా చీలిన ఆ కాలంలో అమెరికా, సోవియెట్‌లకు ఈ ఉదారత ఎందుకంటిందో సులభంగానే గ్రహించవచ్చు. సాధారణ ప్రజానీకంలో తమపట్ల అనుకూల భావన కలిగితే అవతలివారిని సగం జయించినట్టేనని ఆ రెండు దేశాలూ భావించేవి. ప్రపంచ దేశాలన్నీ ప్రత్యర్థులుగా కనబడుతున్న వర్తమానంలో అమెరికాకు ఉదారత అవసరం ఏముంది? 'నేను ఆదేశించింది పాటించటమే తప్ప నాతో తర్కానికి దిగొద్ద'ని ట్రంప్ స్వయంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మనదేశం ఈ సాయాన్ని ముందే తిరస్కరించి ఉంటే ఎంతో హుందాగా ఉండేది. కానీ ఇవ్వబోమని అమర్యాదకరంగా చెప్పించుకోవటం ఆత్మాభిమానం గల భారతీయులందరికీ చివుక్కుమనిపించే సంగతి. పాలకులు గ్రహిస్తారా?

దేశ పునర్నిర్మాణానికి మార్గం



అభిప్రాయం

డా॥ కత్తి పద్మారావు

భారతదేశం ఈనాడు సామాజిక, ఆర్థిక సంక్షోభంలో ఉంది. రూపాయి విలువ అంతకంతకూ పతనం కావడం దేశ ఆర్థిక వ్యవస్థ దుఃస్థితిని తెలియజేస్తుంది. యువత నైరాశ్యంలో, మత్తులో కునారిల్లుతోంది. స్త్రీలైతే నిరక్షరాస్యతలో, మత కర్మకాండల్లో, పనిలేనితనంతో ఉత్ప్రేరక రహిత జీవితం జీవిస్తున్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థల్లో కులవివక్ష, అస్పృశ్యత ఇంకా కొనసాగు తున్నాయి. కొన్ని వర్గాల వారే సంపదలను స్వాధీనం చేసుకోవడం పెరుగుతోంది. కొన్ని కులాల వారే వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపార వ్యవస్థల మీద తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. కులం పేరుతో సాంఘిక, ఆర్థిక సంస్థలు, విద్యా వ్యవస్థలు ఏర్పడుతున్నాయి. కుల ఆర్థిక వ్యవస్థ బలీయమైనదిగా రూపొందుతున్నదని సామాజిక శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

హర్షద్ మెహతా లాంటి ఒక సామాన్య వ్యక్తి ప్రభుత్వ ఆర్థిక సంస్థలను వినియోగించుకొని వేల కోట్ల సొమ్మును ఏమార్చాడు. అదే చిన్న పొరపాట్లకే ఎస్సీ, ఎస్టీ సివిల్ సర్వీసు ఉద్యోగులు శిక్షలను అనుభవిస్తున్నారు. నూతన ఆర్థిక విధానం, ఉన్నత కులాలకు తమ ఆర్థిక, సామాజిక అధికారాన్ని పటిష్ఠపరుచుకోడానికి కొత్త అవకాశాల్ని ఏర్పరచింది. ఇటీవల ఒక ఏజెన్సీ భారతదేశంలోని వంద మంది ధనవంతుల పేర్లని వెల్లడించింది. వారిలో ఒక్కడు కూడా దళితుడు లేడు.

భారతదేశంలోని అస్పృశ్యతా భావం వ్యవసాయ ఉత్పత్తులపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతోంది. కారణం భూమి పంపకాన్ని ప్రభుత్వాలు నిరాకరించడం! భూములను కార్పొరేట్లకే ధారాదత్తం చేస్తున్నారు కానీ, పేద ప్రజలకు పంచడం లేదు. ఇటీవల సీపీఎం మహాసభలు జరిగినా వారు అస్పృశ్యతా నివారణ మీద, దళితులకు సాగు భూమి పంచాలనే అంశం మీద, కులనిర్మూలనా అంశం మీద తీర్మానం చేయకపోవడం గమనించదగ్గ విషయం.

పెరగని శాస్త్రీయ భావనలు

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో భక్తుల మధ్య తొక్కిసలాట జరిగి 45 మంది ప్రాణాలు కోల్పోవటం విషాదకరం. మౌని అమావాస్య సందర్భంగా త్రివేణీ సంగమం వద్ద స్నానాలు ఆచరిస్తే పుణ్యం వస్తుందని విపరీత ప్రచారం జరగటంతో పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి చేరారు. అంత మందికి అవసరమైన ఏర్పాట్లు చేయకపోవటం వల్లే ఈ ఘోరం జరిగిందని విమర్శలు వెల్లువెత్తాయి.

అదే రాష్ట్రంలో అంతకుముందు హత్రాస్‌లో జరిగిన ఒక అధ్యాత్మిక కార్యక్రమంలో బోలే బాబా పాద ధూళి కోసం జనం ఎగబడిన సందర్భంలో తొక్కిసలాట జరిగి, 121 మంది చనిపోయారు. ఇటీవల తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చిన భక్తుల తొక్కిసలాటలో ఆరుగురు దుర్మరణం చెందారు. హజ్ యాత్రలో తొక్కిసలాట జరిగి వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ ఆధునిక కాలంలోనూ శాస్త్రీయ భావనలు దేశంలో వెల్లివిరియడం లేదు. సాంకేతిక, వైజ్ఞానిక భావచైతన్యం పెరగడం లేదు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.



అంబేడ్కర్ బాట

అందరూ తమ రాజకీయ మేనిఫెస్టోల్లో దళిత వర్గాల స్త్రీల గురించే హమీలిస్తున్నారు. కానీ చివరకు శూన్య హస్తాలే చూపిస్తున్నారు. ఈ విషయంగా డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 1951 అక్టోబర్ 28న తన ముంబయి ఎన్నికల ప్రచారంలో ఇలా విశ్లేషించారు: 'ప్రతి రాజకీయ పార్టీ తన ఎన్నికల ప్రణాళికను విడుదల చేసింది. అధికారంలోకి వస్తే ఇది చేస్తాం, అది చేస్తాం అని ప్రతి రాజకీయ పార్టీ వాగ్దానం చేస్తుంది. భారత్‌లో అసలు సమస్య పేదరికం. ప్రతి ఏటా కోట్లాది రూపాయిల విలువ గల ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోవాల్సి వస్తే ప్రజలు ఎలా నెట్టుకు రాగలుగుతారు? ఈ విషయాలన్నింటికీ ప్రభుత్వ ఆలోచనల్లో తావులేదు' అన్నారు.

ఆనాటి నుండి ఈనాటి వరకు పాలక వర్గాల మనస్తత్వంలో ఏ విధమైన మార్పూ లేదు. దీన్ని ఎదిరించి నిలబడే దళిత బహుజనులకు స్వీయ రాజకీయ చైతన్యం కావాలని అంబేడ్కర్ ఆనాడే చెప్పారు. రాజ్యాధికారమే ప్రధానమైన 'కీ' అని, దళిత బహుజన రాజ్యాన్ని నిర్మించినప్పుడే సంపద పంపిణీ అవుతుందని అన్నారు. లేదంటే పరిస్థితుల్లో మార్పులు రాకపోగా, మరింత దిగజారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

'ఇవాళ దళితుల పరిస్థితి ఏమిటి? నాకు తెలిసినంత వరకూ ముందు ఎలా ఉండేదో ఇప్పుడూ అలాగే ఉంది. అదే నిరంకుశత్వం, అదే అణచివేత. పరిపాలనలో అంతకుముందున్న వివక్షే కొనసాగుతోంది' అన్నారు. అయినా వారికి ఉపశమనం ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. అంబేడ్కర్ ఆనాడు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ఉద్దేశించి ఈ విశ్లేషణ చేశారు. అవి ఇప్పటికీ స్పష్టంగా అన్వయం అవుతున్నాయి.

> ◆ పరిశోధన – అభివృద్ధికి భారీ మొత్తంలో నిధులు సమకూర్చడం, నవకల్పనలను ఇతోధికంగా ప్రోత్సహించడం, కార్మిక శ్రేణుల నైపుణ్యాలను మెరుగుపరచడం అవసరం.
>
> ◆ రాజ్యాధికారమే ప్రధానమైన 'కీ' అని, దళిత బహుజన రాజ్యాన్ని నిర్మించినప్పుడే సంపద పంపిణీ అవుతుందని అంబేడ్కర్ అన్నారు.
>
> ◆ దేశంలో ఉత్పత్తిని పెంచుకొని, దేశ గౌరవాన్ని పెంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్క భారతీయుని మీద ఉంది.

భారతీయుల బాధ్యత

నిజానికి దేశంలో నిరుద్యోగం, పేదరికం, స్త్రీ అణచివేత ఇంకా కొనసాగుతున్నాయి. మరో పక్క 'మేక్ ఇన్ ఇండియా' నినాదాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. కానీ తయారీ రంగానికి అవసరమైన సమస్త యంత్రాలనూ దిగుమతి చేసుకుంటున్నాం. పరిశోధన, అభివృద్ధి రంగంలో మనం చేస్తున్న వ్యయం స్థూల దేశీయోత్పత్తిలో 1 శాతం కంటే తక్కువ! పరిశోధన అభివృద్ధికి భారీ మొత్తంలో నిధులు సమకూర్చడం, నవకల్పనలను ఇతోధికంగా ప్రోత్సహించడం, కార్మిక శ్రేణుల నైపుణ్యాలను మెరుగుపరచడం అవసరమని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. ఇటువంటి చర్యలూ ఏవీ అమలు జరగడం లేదు.

రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రాథమిక సూత్రాలు విధ్వంసానికి గురి అవుతున్నాయి. సమాఖ్య భావన తగ్గడంతో రాష్ట్రాల అస్తిత్వాలు సంఘర్షణలో ఉన్నాయి. రాష్ట్రాల ఆదాయాన్ని తగ్గిస్తూ కేంద్రం ఆర్థిక ఆధిపత్యాన్ని పెంచుకునే క్రమం సాగుతోంది. మేలిమి చదువులు, తీరైన వసతులు, ఉపాధి అవకాశాల కల్పన, అసమానతల నివారణ ద్వారా జనం బతుకుల్లో వెలుగులు నింపాల్సింది పోయి ప్రజాస్వామ్యాన్ని ప్రలోభస్వామ్యంగా మారుస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో లౌకిక, ప్రజాస్వామిక, సామ్యవాద శక్తులు ఏకం కావలసిన సమయం ఆసన్నమయింది. దేశంలో ఉత్పత్తిని పెంచుకొని, దేశ గౌరవాన్ని పెంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్క భారతీయుని మీద ఉంది. ఈ క్రమంలో అంబేడ్కర్ ఆలోచనలను స్వీకరించి అభివృద్ధి భారతానికి బాటలు వేయాలి.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు
మొబైల్: 98497 41695

సోషల్ మీడియా

ఎక్కడున్నాం?



త్రివేణీ సంగమం నీళ్లలో భారీ స్థాయి మల సంబంధిత కోలిఫార్మ్ బ్యాక్టీరియా ఉన్నట్టు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) గుర్తించింది. కానీ ఆ నీరు స్నానానికీ, తాగడానికీ యోగ్యమైనదనీ, అలాంటి నివేదికలు కుంభమేళా ప్రతిష్ఠను దెబ్బతీయడానికి చేసే ప్రచారమనీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ అంటున్నారు. 2025లో ఇండియా ఎక్కడుందో చూడండి!

– అనుభవ్ సింగ్, విశ్లేషకుడు

పెట్టాల్సిన పెట్టుబడులు



ఉత్తరప్రదేశ్ జనాభా 24 కోట్లు. బిహార్ జనాభా 13 కోట్లు. రెండు రాష్ట్రాలది కలిపి 37 కోట్లు. ఇది దేశ జనాభాలో సుమారు 25 శాతం. అమెరికా జనాభా 34.5 కోట్ల కన్నా ఇది ఎక్కువ. ఆ రాష్ట్రాల సగటు తలసరి ఆదాయం 1,100 డాలర్లు. ఆఫ్రికా దేశాల తలసరి జీడీపీ 1,710 డాలర్లు. 'వికసిత్ భారత్' లక్ష్యంలో ఇది మన పెద్ద సవాలు. అయితే, విమానాశ్రయాల కన్నా సోషల్ క్యాపిటల్, నాలెడ్జ్ క్యాపిటల్ ఆ రాష్ట్రాల ప్రాధమ్యాలు కావాలి.

– డి. ముత్తుకృష్ణన్, ఫైనాన్సియల్ ప్లానర్

ఎన్నికలు జరగకపోతే...



ఎన్నికలు జరగకపోతే... యుద్ధం జరుగుతుండగా ఎన్నికలు నిర్వహించలేదు కాబట్టి, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని 'నియంత' అనడం పూర్తిగా తప్పు. యుద్ధ కాలాల్లో తమ అస్తిత్వం కోసే పోరాడే దేశాల్లో ఇది సాధారణ వ్యవహారం. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటన్‌లో సాధారణ ఎన్నికలు జరగలేదు. యుద్ధం ముగియగానే ఎన్నికలు జరిగాయి. ఉక్రెయిన్‌లో కూడా అదే జరుగుతుంది.

– కాన్‌స్టంటిన్ కిసిన్, పాడ్‌కాస్టర్

అక్కడే ఉండగలరు!



పర్ఫెక్టు మనిషి రోజూ ఐదింటికి నిద్ర లేస్తాడు. రోజూ వ్యాయామం చేస్తాడు. తన గదిని తనే శుభ్రం చేసుకుంటాడు. మద్యం తాగడు. వంటగదిలో సాయం చేస్తాడు. సమయానికి భోంచేస్తాడు. రాత్రుళ్లు తిరగడు. టైముకు వస్తాడు. రోజూ ప్రార్థిస్తాడు. సరిగ్గా తొమ్మిదింటికి నిద్రపోతాడు... ఇలాంటివాళ్లంతా సెంట్రల్ జైల్లో కనబడతారు.

– జేవియర్, వ్యంగ్య వ్యాఖ్యాత

ఎందుకు సమర్థన?



ఔరంగజేబు సమర్థకులుగా ఎవరైనా ఎందుకు ఉండాలనుకుంటారు? ఇది నాకు అర్థం కాని విషయం. ఆయన క్రూరత్వం ఎలాంటిదో చరిత్రలో బాగా నమోదయ్యే ఉంది.

– ప్రియాంకా చతుర్వేది, రాజ్యసభ సభ్యురాలు

ఇన్‌బాక్స్

ఎన్నాళ్లో వేచిన ఉదయం...



మహారాష్ట్ర తెలుగువారి చిరకాల స్వప్నమైన 'తెలుగు సాహిత్య అకాడమీ' సాకారమైంది. దీంతో మహారాష్ట్రలో మూడు వందల సంవత్సరాలకు మించి చరిత్ర కలిగిన తెలుగువారిలో హర్షాతిరేకాలు వెల్లివిరిశాయి. మహారాష్ట్ర అభివృద్ధిలో తెలుగువారి పాత్ర ఎంతో ఉంది. డా॥ బొల్లి లక్ష్మీనారాయణ అన్నట్లుగా, మహారాష్ట్రలోని ప్రతి తెలుగువ్యక్తీ 'తెలుగు ఆయీ, మరాఠీ మౌసీ' (తెలుగును అమ్మ, మరాఠీని పిన్ని) లాగా భావిస్తాడు. వివిధ రంగాల్లో తెలుగువారు క్రియాశీలకంగా ఉండడమే కాకుండా, సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలో కూడా పాల్గొని, అమరులై తమ కర్మభూమి మహారాష్ట్రకు తగిన సేవలందించారు. వంద సంవత్సరాల క్రితమే ముంబైలో తెలుగు పత్రికలు వెలువరించి, తమ మాతృభాషను కాపాడుకునే ప్రయత్నం చేసిన ఘనత తెలుగు ముంబైకర్లకు ఉంది.

2023లో శాసన సభలో మంత్రి సుధీర్ మునిగంటివార్ మాట్లాడుతూ, 'మహారాష్ట్రలో తెలుగు భాషా, సాహిత్య వికాసం కోసం... తెలుగు-మరాఠీ భాషల ఆదానప్రదానాల కోసం తెలుగు సాహిత్య అకాడమీ ఏర్పాటు చేస్తున్న'ట్టు ప్రకటించారు. 2024 మార్చ్‌లో జరిగిన క్యాబినెట్ సమావేశంలో తెలుగు, బెంగాలీ, సంస్కృత సాహిత్య అకాడెమీల ఏర్పాటుకు ఆమోదం లభించింది. మహారాష్ట్రలో పలు విద్యాసంస్థలు నిర్వహిస్తున్న డా॥ పి.వి. రమణను తెలుగు అకాడెమీ కార్యాధ్యక్షుడిగా, మరికొందరు తెలుగు ప్రముఖులను సభ్యులుగా మహారాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరి తరపున మహారాష్ట్ర ప్రభుత్వానికి జేజేలు!

– సంగెవేని రవీంద్ర, మహారాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీ సభ్యులు

అమ్మ భాష

వెలుగు కిరణాల చైతన్యంలో నుంచి
తెలుగక్షరాల శోభ విరాజిల్లింది
చైతన్యపు ఉరవడి విజయం లోంచి
ఒక అక్షరం పురుడు పోసుకుంది
నుడికారాలతో శ్రీకారం చుట్టబడుతూ
దీర్ఘాక్షరాలతో ఒక ఆకారం ఉద్భవిస్తూ
తెలుగు తేటమై వెలుగులీనుతోంది

దేశభాషలందు లెస్సగా కొనియాడబడుతూ
వివిధ యాసల ప్రాసలతో అలరారుతోంది
సాహిత్యపు సౌధమై శోభిల్లుతూ
సుసంపన్నమై చరిత్రలో మెరిసిపోతోంది
ఛందోబద్ధమైన తెలుగు ప్రాకారమై
తీయదనపు భావమై వికసిస్తోంది

కవుల కలం నుండి జాలువారిన అక్షరమై
విజ్ఞాన సంపదకు మూలమవుతోంది

అమ్మ భాషలోని తీయదనం ఒలికిస్తూ
కమ్మని సరాగ స్వర మాధుర్యమైంది
తెలుగు పలుకు నాల్కలయందు
తేనె చుక్కలా చిక్కగా జారిపోయింది
మాతృభాష పరిమళాల హాయిదనంతో
తెలుగులోగిలి ఓలలాడుతోంది
తెలుగు చక్కని చిక్కదనంతో
మనలో జాలువారాలి
తెలుగు ఘన కీర్తి నలుదిశలా విస్తరించాలి!

– నరెద్దుల రాజారెడ్డి
(నేడు ప్రపంచ మాతృభాషా దినోత్సవం)

చంపాల్సింది కులాన్ని... ప్రేమికుల్ని కాదు!

భారత రాజ్యాంగానికి 75 ఏళ్లు నిండాయి. 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభలో అంబేడ్కర్ మాట్లాడుతూ... 'మనం రేపటి నుండి రాజకీయంగా ఓటు ద్వారా మనిషికి ఒకే విలువను సాధించుకున్నాం. కానీ సామాజికంగా సమానతను సాధించుకోవాల్సి ఉంది' అన్నారు. కులమత అంతరాలు ఆర్థిక అసమానతలు, దోపిడీ పీడనలు లేని సమాజాన్ని కలగన్న ఆనాటి మహనీయుల కలలు ఇంకా నెరవేరనే లేదు. భారతదేశ చాతుర్వర్ణ కుల వ్యవస్థ భారత సమాజాన్ని నిలువునా చీల్చిందనీ, కుల నిర్మూలన జరగకుండా, అంధ విశ్వాసాలు తొలగిపోకుండా సమాజం పురోగమించదనీ, ఆ లక్ష్యాల సాధన కోసం రాజ్యాంగ స్ఫూర్తితో సమాజాన్ని పాలకులు ముందుకు నడపాలి. అయితే వారు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కులాల దొంతరలలోని కులాలను స్థిరీకరిస్తూ, అంతరాలను పెంచి పోషిస్తున్నారు.

కులం కట్టుబాట్లను అనుసరించి... తమ ఇష్టానిష్టాలకు భిన్నంగా ఆ యా కులాల్లోనే వివాహాలు చేసుకోవడం ఒకరకంగా దోపిడీకి గురికావడం లాంటిదే. రెండు వందల ఏళ్ల నాడే సావిత్రీబాయి పూలే, జ్యోతిరావు పూలేలు ఈ కుల కట్టుబాట్లను తుదమట్టిస్తూ, కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించారు. ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకునే జంటలకు కాని, కులమత అడ్డుకోటలను కూల్చాలనుకునే ప్రేమికులకు కాని, కుల కట్టుబాట్లు, సంప్రదాయాలు, పెళ్లి తంతులు ఇష్టం లేకపోయినా తల్లిదండ్రుల బలవంతం మీద పెళ్లిళ్లు చేసుకొనేవారు అనేకమంది విడిపోతున్నారు.



ఇవాళ కుటుంబంలో అమ్మాయి పుట్టిందంటే భయపడే పరిస్థితి ఎందుకుంది? ఆమె పెరిగి, పెద్దదై పెళ్లి చేసుకునేదాకా తల్లితండ్రులు భయాందోళనలకు గురికావలసి రావడానికి కారణం ఏమిటి? సమాజంలో పాతుకుపోయిన మనువాదమే కదా. 'న స్త్రీ స్వాతంత్ర్య మర్హసి' (ఏ స్త్రీ కూడా స్వేచ్ఛకు అర్హురాలు కాదు) అనే భావం నరనరాల్లో జీర్ణించుకున్న సమాజం కదా మనది. స్త్రీని ఒక వస్తువుగా, ఆస్తిగా, కుటుంబ పరువును కాపాడవలసిన జీవిగా పురుషాధిక్య సమాజం చూడటం వల్లే... ఆమె కులాంతర, మతాంతర వివాహాలు చేసుకుంటే పరువు హత్యలకు పాల్పడుతున్నారు.

రాజ్యాంగం మనిషికి స్వేచ్ఛగా బ్రతికే హక్కుని ప్రసాదించింది. ఇష్టమైనవారిని కులమతాల ప్రసక్తి లేకుండా వివాహమాడే స్వేచ్ఛను కల్పించింది. వరకట్నం చట్ట వ్యతిరేకమని తెలిసినా పట్టించుకుంటున్నది ఎంతమంది? కట్నాలు లేకుండా, కుల పట్టింపులు లేకుండా తమకి ఇష్టమైన వారిని పెళ్లి చేసుకుంటే వారి మీద కత్తులు నూరటం దుర్మార్గం.


ఇవాళ్టి సామాజిక సందర్భంలో పిల్లలు ఒకరిని ఒకరు కలుసుకోవడం, తెలుసుకోవడం, భావి జీవితం గురించి కలలు కనటం అనేది చాలా సహజాతి సహజమైన పరిణామం. ఇందుకు తల్లిదండ్రులు, సమాజం ప్రోత్సహించాల్సిందిపోయి... వాళ్ళు ఏదో సమాజానికి కీడు చేస్తున్నట్టు నియంత్రించడం తగదు. కులం అనే ఒక కాగితపు పులిని చూసి మనిషి తన కన్న బిడ్డల్ని చంపుకొనే క్రూర జంతువుగా మారడం దారుణం. కుల పెద్దలుగా చలామణీ అయ్యేవారు, నాయకులు కులాంతర వివాహం చేసుకున్న జంటల్ని వెంటాడి వేధిస్తున్నారు. సినిమాల్లో ప్రేమల్ని, ప్రేమికుల కష్టాల్ని చూసి కన్నీళ్లు కార్చే పెద్దలు, తమ కడుపున పుట్టిన బిడ్డలు తమకి ఇష్టం వచ్చిన అబ్బాయినో, అమ్మాయినో కోరుకుంటే... పరువు పోయిందని హత్యలకు తెగపడటం చూస్తూనే ఉన్నాం. సూర్యాపేటలో బంటినీ, మిర్యాలగూడలో ప్రణయ్ లాంటి ప్రేమికులనూ చంపడం ఇందుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి వాళ్ల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించవలసి ఉంది. ప్రేమ వివాహాలు, కులాంతర పెళ్లిళ్లు చేసుకునే పిల్లలకు చట్టం, సమాజం మద్దతుగా నిలవాలి.

తమ ఇష్టాలకు అనుగుణంగా పెళ్లిళ్లు చేసుకునే పిల్లలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరించడం ద్వారా నిజమైన ప్రేమికుల్ని కాపాడుకోవాల్సి ఉంది. అలాగే వాళ్లకు నచ్చకపోతే విడిపోయి స్వేచ్ఛగా బ్రతికే అవకాశాలను కూడా సమాజం ఇవ్వాలి. కులాంతర వివాహం... మానసిక, శారీరక వైకల్యం లేని క్రియాశీల భవిష్యత్ తరానికి బాటలు వేస్తుంది. కులాంతర వివాహాలు చేసుకునే వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు పెంచాలి. ఈ జంటలపై దాడులు చేసేవారిని ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా వెంటనే విచారణ చేసి శిక్షించాలి.

– ప్రభాకర్ కస్తూరి
సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం । 94409 70454

నిర్వాణం

నిర్వాణం అనే సంస్కృత పదానికి ఆరిపోవటం (దీపం కొండెక్కినట్టు), చల్లారిపోవటం, అంతరించిపోవటం, నశించి పోవటం అని అర్థం. అయితే వేదాంత గ్రంథాలలో నిర్వాణం అనే పదాన్ని ముక్తి, మోక్షం అనే అర్థాలలో ఉపయోగిస్తారు. ఈ వాడుక బౌద్ధ, జైన సంప్రదాయాలలో కూడా తరచుగా వినిపిస్తుంది.



'సర్వం బ్రహ్మ' అన్న సత్యపు స్పృహను కోల్పోయి, 'అహం' భావన వల్ల 'నేను వేరు – ఇతరమంతా వేరు' అనే అజ్ఞాన జనిత మైన ప్రత్యేకతను తనకు తాను ఆపాదించుకోవటమే జీవుడి దుఃఖాలన్నిటికీ కారణం. ఈ 'అహం' భావన ఆరిపోయి, అంతరించి, కొండెక్కితే, జీవాత్మ మలిగి పరమాత్మ చైతన్యంతో ఐక్యమైతే, దాని ఫలితం పరమానందమయమైన, శాంతిమయమైన మోక్ష స్థితి. జనన, మరణాల సంసార చక్రం నుంచి విముక్తి. కోరికలు త్యజించి, అహంకార మమకారాలను అధిగమించినవాడు, శాంతిని పొంది, దేహ పతన సమయంలో బ్రహ్మ నిర్వాణాన్ని పొందుతాడు అని భగవద్గీత ప్రవచిస్తుంది (2-71,72).

బౌద్ధ సంప్రదాయంలో కూడా, రాగ-ద్వేష-మోహా లనే మూడు భయంకరమైన అగ్నులు చల్లారి పోవటమే నిర్వాణం అంటారు. మోహ భ్రాంతి అజ్ఞానం. అది ఆరిపోయి జ్ఞానోదయం పొందటమే నిర్వాణ స్థితి. అందుకే బౌద్ధులు బుద్ధుడి జీవితంలో రెండు నిర్వాణ ఘట్టాలను గుర్తిస్తారు. ఒకటి – ఆయనకు జ్ఞానోదయం కలిగిన నాటి 'ఉపాధి శేష నిర్వాణం'. ఇది సశరీరమైన జీవన్ముక్త స్థితి. రెండవది – ఆ తరవాత నలభయ్యేళ్ళకు ఆయన అవతార సమాప్తి చేసినప్పుడు జరిగిన 'పరి నిర్వాణం'.

'నిర్వాణ' అనే పదం ఇప్పుడు ఆంగ్లంతో సహా ఎన్నో విదేశీయ భాషలలో కూడా చేరిపోయింది. ఆ భాషలలో కూడా ఈ పదం వాడుక పరమానంద స్థితి అనే అర్థంలోనే!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం


శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.అష్టమి ఉ.8.25 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** అనూరాధ ప.12.50 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** సా.6.51 నుండి 8.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.47 నుండి 9.35 వరకు, తదుపరి ప.12.39 నుండి 1.27 వరకు, **అమృత ఘడియలు:** తె.5.04 నుండి 6.46 వరకు (తెల్లవారితే శనివారం); **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.28, **సూర్యాస్తమయం:** 5.59.



ఉద్యోగులు తగ్గారు



దేశ బ్యాంకింగ్ రంగంలో ప్రైవేటు బ్యాంకుల్లో ఉద్యోగులు గత దశాబ్ద కాలంలో 2 రెట్లకుపైగా పెరిగారు. అదే సమయంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగులు మాత్రం తగ్గారు. 1991–92లో దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు (కమర్షియల్) బ్యాంకుల్లో మొత్తం 9.8 లక్షల ఉద్యోగులుంటే అందులో ప్రభుత్వ రంగం వారే 87 శాతం. కానీ, 2023–24లో మొత్తం అన్ని బ్యాంకుల్లో కలిపి 18.72 లక్షల మంది ఉద్యోగులుంటే అందులో ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 40 శాతమే.



కిరణ్ రాయల్ నుంచి నాకు ప్రాణహాని

ఎస్పీకి విన్నవించిన బాధితురాలు లక్ష్మి

తిరుపతి క్రైమ్: తిరుపతి జనసేన పార్టీ ఇన్‌చార్జి కిరణ్ రాయల్ బాధితురాలు లక్ష్మి గురువారం మరోసారి తిరుపతి ఎస్పీని కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పోలీసులు కిరణ్ రాయల్‌పై కేవలం చీటింగ్ కేసు మాత్రమే నమోదు చేశారని, తనను హత్య చేస్తానని, తన కుమారులు ఇద్దరిని అంతం చేస్తానని బెదిరింపులకు పాల్పడిన ఆడియో పుటేజీతో సహా అందిస్తే ఇంతవరకు అరెస్టు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కిరణ్ రాయల్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు కిరణ్ రాయల్‌పై కేవలం చీటింగ్ కేసు మాత్రమే నమోదు చేసి, మిగిలిన విషయాలను పక్కన పెట్టారని ఆమె మండిపడ్డారు.

గిరిజన ప్రాంతాల్లోని అర్హులందరికీ సొంతిళ్లు



వివరాలు నమోదు చేసుకుంటున్న నిషి కాందెల్వాల్

చింతపల్లి: అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులందరికీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో పీఎం జన్‌మన్, పీఎం ఆవాస్, పీఎం గ్రామీణ్ వంటి పథకాల ద్వారా సొంతిళ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నామని ఢిల్లీకి చెందిన కేంద్ర గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణ విభాగం ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ రూరల్ హౌసింగ్ (పీఎంయు–ఆర్‌హెచ్) సభ్యురాలు నిషి కాందెల్వాల్ తెలిపారు. గురువారం ఆమె చింతపల్లి మండలంలోని తాజంగి పంచాయతీలో పర్యటించారు. కోరుకొండ గ్రామంలో గిరిజనుల ఇళ్లను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఏ విధంగా అందుతున్నాయో ఆరా తీశారు. వాటి సర్వేకు సంబంధించిన వివరాలను గృహనిర్మాణశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నేటినుంచి రైతుల వద్ద టమాటా కొనుగోలు

మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రైతుల నుంచి ప్రభుత్వమే టమాటాలను కొనుగోలు చేయనున్నట్టు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ధరలు పతనమైన నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ ద్వారా టమాట ఉత్పత్తులను సేకరించాలని ఆదేశించారు. ఆయన గురువారం మార్కెటింగ్ శాఖ అధికారులు, వివిధ జిల్లాల జేసీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. శుక్రవారం (నేడు) నుంచి టమాటా కొనుగోలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా రైతుబజార్లలో నేరుగా విక్రయించాలని చెప్పారు. అవసరం మేరకు పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రవాణా సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలో నేటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తి పట్టణం ముస్తాబవుతోంది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం నుంచి 14 రోజుల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేపట్టారు. మొదటగా శుక్రవారం సాయంత్రం భక్త కన్నప్ప ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. ఈ మేరకు భక్తకన్నప్ప కొండపై ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయంతో పాటు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు ఇంకా నత్తనడకన జరుగుతున్నాయి.

– శ్రీకాళహస్తి



శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ భవానీ ప్రసాద్, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ, ఏపీఈఆర్‌సీ చైర్మన్ టి.రామ్ సింగ్, ఏపీ టూరిజం స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ తదితరులు ఉన్నారు.

– తిరుమల



భృంగివాహనంపై శ్రీశైలేశుడు

శ్రీశైలక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం శ్రీశైలేశుడు భ్రమరాంబా సమేతుడై భృంగి భుజస్కంధాలపై ఊరేగాడు. ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో భృంగివాహనాన్ని సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగివాహనంపై ఆశీనులను చేసి ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రాజగోపురం నుంచి వెలుపల గంగాధర మండపం వరకు తోడ్కొనివచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

– శ్రీశైలం టెంపుల్



మొసలితో కరెంటాఫీసు ముందు ధర్నా


కర్ణాటకలోని కలబుర్గి జిల్లా, అఫ్జల్‌పూర్ తాలూకా గొబ్బుర గ్రామంలో పొలంలోకి వచ్చిన మొసలిని రైతులు బంధించి విద్యుత్ కార్యాలయానికి తీసుకెళ్లి ధర్నా నిర్వహించారు. కలబుర్గిలో రైతులకు తెల్లవారుజామున 4 గంటలకు త్రీఫేజ్ విద్యుత్ ఇస్తున్నారు. రైతులు పొలాలకు నీళ్లు వదలాలంటే తెల్లవారుజామునే వెళ్లాల్సి వస్తోంది. ఈక్రమంలో లక్ష్మణ అనే రైతు పొలానికి వెళ్లగా ఓ మొసలి దాడి చేసింది. దీన్ని గమనించిన చుట్టుపక్కల రైతులు మొసలిని బంధించి ఎద్దుల బండికి కట్టేసి కరెంటాఫీసు వద్ద బైఠాయించారు. ఉదయం 6 గంటల తర్వాతే త్రీఫేజ్ విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ పొలాలు నదీ తీర ప్రాంతాల్లో ఉండటంతో తెల్లవారుజామున మొసళ్లు వస్తున్నాయని తెలిపారు.

– దొడ్డబళ్లాపురం

‘నిమ్మల’మైన అబద్ధాలు

వెలిగొండ ప్రాజెక్టుపై జల వనరుల శాఖ మంత్రి రామానాయుడు వక్రీకరణలు

- జంట సొరంగాలను పూర్తిచేసి జాతికి అంకితం చేసిన నాటి సీఎం వైఎస్ జగన్
- పునరావాసానికి రూ.1400 కోట్లు ఖర్చు చేస్తే జూన్‌లో నీటి తరలింపునకు హామీ
- కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తిగా పడకేసిన పనులు..
- పునరావాసం కల్పించి ఉంటే ఆగస్టులోనే నీటి తరలింపునకు చాన్స్
- రెండేళ్లలో వెలిగొండ పూర్తిచేస్తాం.. రూ.4 వేల కోట్లు అవసరమని మంత్రి వెల్లడి



సాక్షి, అమరావతి: వెలిగొండ ప్రాజెక్టుపై జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వక్రీకరణలతో అవాస్తవాలు మాట్లాడారు. ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేస్తామని.. దీనికోసం రూ.4 వేల కోట్లు అవసరమని చెప్పారు. వెలగపూడిలోని సచివాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 4.50 లక్షల ఎకరాలకు సాగు, 25 లక్షల మందికి తాగునీరు అందజేసే వెలిగొండ ప్రాజెక్టు ప్రధాన పనులను ఏపీ గత ప్రభుత్వం పూర్తి చేయలేదని, రైతులను గృహనిర్బంధం చేసి బందోబస్తు మధ్య ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం విడ్డూరమన్నారు. మొదటి సొరంగంలో 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మేర రోడ్డును, రెండో సొరంగంలో 2 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాల్సి ఉందని వీటిని చేయడానికి 9 నెలలు పడుతుందన్నారు. రెండో సొరంగంలో 6.8 కి.మీ. లైనింగ్ చేయాలని.. భారీ టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) కూడా ఉందని, దానిని తొలగించేందుకు చాలా సమయం పడుతుందని చెప్పారు. 21.8 కి.మీ. ఫీడర్ కెనాల్ పనుల పటిష్ఠతను తేల్చాల్సి ఉందన్నారు. 1996లో సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రాజెక్టుకు భూమి పూజ చేసి.. 2014–19లో పనులకు రూ.1,319 కోట్లు ఖర్చు చేశారని నిమ్మల పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో వెలిగొండ ప్రాజెక్టు పనులకు రూ.647 కోట్లు ఖర్చు చేశారని వివరించారు.

వాస్తవం ఇదీ..

2014–19 మధ్య వెలిగొండ జంట సొరంగాలను పూర్తి చేయలేక టీడీపీ సర్కార్ చేతులెత్తేసింది. కానీ, కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ జంట సొరంగాలను 2019–24 మధ్య అప్పటి సీఎం వైఎస్ జగన్ పూర్తి చేశారు. మొదటి సొరంగం లైనింగ్ పూర్తిగా, రెండో సొరంగంలో 12 కి.మీ. పొడవునా లైనింగ్ పూర్తయింది. రెండు సొరంగాలను 2024, మార్చి 6న సీఎం హోదాలో జగన్ జాతికి అంకితం చేశారు. రెండో సొరంగం లైనింగ్ పూర్తి చేసి.. నల్లమల సాగర్ నిర్వాసితులకు పునరావాసం కోసం రూ.1,400 కోట్లు ఖర్చు చేస్తే శ్రీశైలం నుంచి నల్లమల సాగర్‌కు 2024 జూన్‌లో నీటిని తరలిస్తామని హామీ ఇచ్చారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక వెలిగొండ ప్రాజెక్టు పనులను పట్టించుకోలేదు. రెండో సొరంగం లైనింగ్ పూర్తి చేయలేకపోయినా కనీసం నిర్వాసితులకు పునరావాసం కల్పించి ఉంటే, 2024 ఆగస్టులోనే నల్లమలసాగర్‌కు శ్రీశైలం నుంచి నీటిని తరలించే అవకాశం ఉండేదని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, కూటమి ప్రభుత్వ నిర్వాకాన్ని కప్పిపుచ్చుకోవడానికి మంత్రి నిమ్మల వాస్తవాలను వక్రీకరిస్తుండడంపై వెలిగొండ ప్రాజెక్టు ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెలిగొండ జంట సొరంగాల పురోగతి ఇలా..	సొరంగం	జరిగిన పని(కిమీలలో)			
		2004-14	2014-19	2019-24	మొత్తం
	సొరంగం-1	11.586	4.331	2.883	18.800
	సొరంగం-2	8.747	2.355	7.685	18.787
	మొత్తం	20.333	6.686	10.568	37.587

పనులన్నీ టీడీపీ వారికే ఇవ్వండి!

- తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌కు మంత్రి లోకేశ్ ఆదేశం?
- పనులు అడిగితే జనసేనలోకి రమ్మంటున్నారు
- తిరుపతి టీడీపీ అంతర్గత సమావేశంలో లోకేశ్‌కు నాయకుల ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ‘హలో కమిషనర్ గారూ.. కార్పొరేషన్‌లో పనులన్నీ మనవారికే ఇవ్వండి. నేను మనిషిని పంపుతున్నాను. పనులు అతనికి అప్పగిస్తే.. అతను పార్టీ కోసం పనిచేసిన వారికి ఇస్తారు.’ అని తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌ని మంత్రి నారా లోకేశ్ ఆదేశించినట్లు తెలిసింది. తిరుపతి పర్యటనలో భాగంగా మంత్రి నారా లోకేశ్ బుధవారం టీడీపీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వం, ఓటరు వెరిఫికేషన్, టీడీపీ యాప్‌లో ఉత్తమ పనితీరు కనబరచిన కార్యకర్తలు, నాయకులకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేసి అభినందించారు. ఈ సమయంలో తిరుపతి 31వ వార్డుకు చెందిన తలారి బాలయ్య... స్థానిక జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆ పార్టీ నాయకుల తీరుపై ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టుల కోసం స్థానిక ఎమ్మెల్యే, జనసేన ముఖ్య నాయకుల వద్దకు వెళితే.. పార్టీలో చేరితే ఇస్తామని తేల్చి చెబుతున్నట్లు తెలిపారు. ఏ విషయం గురించైనా ఎమ్మెల్యే, ఆయన అనుచరుల వద్దకు వెళితే.. జనసేనలో చేరాలని టీడీపీ శ్రేణులపై ఒత్తిడి తెస్తున్నారని వివరించారు. మరో మహిళా నాయకురాలు కూడా జనసేన ఎమ్మెల్యే, నాయకులపైనా ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత లోకేశ్ తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌కి ఫోన్ చేసి ‘తలారి బాలయ్య అనే నాయకుడిని పంపిస్తా. పనులు అతనికి అప్పగిస్తే.. అతను ఎవరెవరికి ఇవ్వాలో వారికి ఇస్తారు..’ అని చెప్పినట్లు తెలిసింది. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సైతం జనసేన ఎమ్మెల్యే, ఆ పార్టీ నాయకుల వ్యవహారాల గురించి వివరించినట్లు సమాచారం. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ టీడీపీ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ‘జనసేన నేతలు కలిసి వస్తే కలిసి నడవండి. లేదంటే వదిలేయండి..’ అని ఆయన స్పష్టంచేసినట్లు సమాచారం. అదే సమయంలో ఇంత జరుగుతుంటే.. మీరు ఏం చేస్తున్నారు? అని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యప్రసాద్‌ను లోకేశ్ ప్రశ్నించినట్లు తెలిసింది. అందరూ కలిసికట్టుగా పని చేసి ఇటీవల డిప్యూటీ మేయర్ పదవిని సొంతం చేసుకున్నట్లుగానే మేయర్ పీఠం కూడా కైవసం చేసుకోవాలని సూచించినట్లు తిరుపతిలో ప్రచారం సాగుతోంది.

శ్రీశైలానికి భారీగా భక్తులు

- రాత్రివేళ కూడా ప్రయాణాలకు అనుమతులు
- ఈ నెల 24 నుంచి 28 వరకూ సౌలభ్యత



పెద్దదోర్నాల గణపతి చెక్‌పోస్ట్ వద్ద బారులుదీరిన వాహనాలు

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం పుణ్యక్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు భారీగా శ్రీశైలం తరలివెళ్తున్నారు. శ్రీశైలం వెళ్లే యాత్రికులు, భక్తులతో ప్రకాశం జిల్లాలోని పెద్దదోర్నాల మండల కేంద్రంలో రద్దీ నెలకొంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీశైలం ఘాట్‌రోడ్డులో రాత్రివేళ కూడా ప్రయాణాలు చేసేందుకు అటవీశాఖ అనుమతులిచ్చింది. ఈ నెల 24 నుంచి 28వ తేదీ రాత్రి వరకు మాత్రమే రాత్రివేళల్లో శ్రీశైలం ఘాట్‌రోడ్డులో ప్రయాణించే వెసులుబాటు ఉంటుంది. ఎక్కువ శాతం భక్తులు కాలినడకన నల్లమల అటవీ ప్రాంతం మీదుగా శ్రీశైలం చేరుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం శ్రీశైలం పుణ్యక్షేత్రంలో దేవస్థాన కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీశైలంలో నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

పుకార్లు నమ్మొద్దు

శ్రీశైలం ఘాట్‌రోడ్డులో ఈ నెల 19 నుంచి మార్చి 1వ తేదీ వరకు ప్రయాణాలకు అటవీశాఖ అనుమతులిచ్చిందన్న వార్తలను నమ్మొద్దు. 24 నుంచి 28వ తేదీ వరకు మాత్రమే శ్రీశైలం వెళ్లేందుకు రాత్రివేళ కూడా ప్రయాణాలకు అనుమతులు ఉన్నాయి. యాత్రికులు, భక్తులు ఈ విషయాన్ని గ్రహించి తమ ప్రయాణాలను అందుకు అనుగుణంగా మార్చుకోవాలి.

– జీవన్ కుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, పెద్దదోర్నాల

55 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల తొలగింపు

లోకాయుక్తకు నివేదించిన ఏపీ వైద్య విద్యా డైరెక్టర్

కర్నూలు(సెంట్రల్): ముందస్తు అనుమతి లేకుండా ఏపీ లీవ్ రూల్స్ 1993 నిబంధనలకు విరుద్ధంగా ఏడాదికిపైగా సెలవులో ఉన్న అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు/వైద్యులను విధుల నుంచి తొలగించినట్లు ఏపీ వైద్య విద్యా డైరెక్టర్ లోకాయుక్తకు నివేదించారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లోని 78 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, వైద్యులు సుదీర్ఘకాలంగా విధులకు హాజరు కాకపోవడంతో పేదల వైద్యానికి ఇబ్బందిగా మారిందని 2023లో ఓ సామాజిక కార్యకర్త లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. విచారణకు స్వీకరించిన సంస్థ పూర్తి స్థాయి నివేదిక అందజేయాలని ఏపీ వైద్య విద్యా డైరెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చింది. ఈ క్రమంలో 78 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, వైద్యులకు వైద్య విద్యా డైరెక్టర్ నోటీసులు ఇచ్చి వివరణ కోరారు. అందులో 55 మంది వైద్యులు 2023 ఆగస్టు 10వ తేదీ వరకు గడువు ఉన్నా నోటీసులకు స్పందించకపోవడంతో వారిని విధుల నుంచి తొలగించినట్లు గురువారం వాయిదాలో లోకాయుక్తకు నివేదించడంతో ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజనీ కేసును మూసివేశారు.

టీటీడీ బోర్డు సభ్యుడిని తక్షణం తొలగించాలి

- ఉద్యోగులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- లేని పక్షంలో మా పోరాటం కొనసాగిస్తాం
- టీటీడీ ఉద్యోగ సంఘాల నేతల హెచ్చరిక
- పరిపాలనా భవనం వద్ద బైఠాయించి నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న టీటీడీ ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు

తిరుపతి కల్చరల్: టీటీడీ ఉద్యోగి బాలాజీని బహిరంగంగా దుర్భాషలాడిన టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని టీటీడీ ఉద్యోగ సంఘ నేతలు డిమాండ్ చేశారు. పవిత్ర తిరుమల శ్రీవారి ఆలయంలో నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తున్న బాలాజీని చులకనభావంతో చూడడమే కాక అనుచిత వ్యాఖ్యలు చేసిన నరేష్.. ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలని కోరారు. బాలాజీ పట్ల నరేష్ వ్యవహరించిన తీరును నిరసిస్తూ గురువారం ఉద్యోగ సంఘాల నేతలు టీటీడీ పరిపాలనా భవనం ద్వారం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. నేతలు జి.వెంకటేష్, చీర్ల కిరణ్, వాసు, అంజనేయులు, ఆర్‌కే భట్, ప్రసాద్‌రావు మాట్లాడారు. మూడు నెలలుగా టీటీడీ ఉద్యోగులు కొందరు పాలకమండలి సభ్యుల ఆగ్రహానికి గురై సస్పెండ్ కావడంతో పాటు నిర్దాక్షిణ్యంగా బదిలీ అయ్యారని వాపోయారు. శ్రీవారి ఆలయ మహాద్వారం ఎగ్జిట్ గేట్ తీయొద్దని అదనపు ఈవో ఆదేశాలిచ్చిన నేపథ్యంలో 2 నిమిషాలు ఆలస్యమైందని, ఇంతలోనే టీటీడీ ఉద్యోగిని దూషించి అవమానించడం అమానుషమన్నారు. అయినా టీటీడీ యాజమాన్యం, పాలకమండలి చైర్మన్, ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే ఉద్యోగులంటే ఎంతటి చులకన భావం ఉన్నదో అర్థమవుతోందన్నారు. రెండేళ్లకోసారి మారే బోర్డు సభ్యులు భక్తి భావంతో, ధర్మబద్ధంగా ఉండాలని.. 30, 40 ఏళ్ల విధులు నిర్వహించే ఉద్యోగులపై దురహంకారంతో అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. టీటీడీలో ఖాళీలు భర్తీ చేయకపోవడంతో ఉద్యోగులపై భారం పడుతోందని వాపోయారు. ఉద్యోగ విధులతో పాటు పాలకమండలి సభ్యుల ప్రొటోకాల్ సేవల్లో 24 గంటలు శ్రమిస్తుండగా, విచక్షణ కోల్పోయి దుర్మార్గంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఉద్యోగులపై దాడి చేస్తే క్రిమినల్ కేసులు పెట్టాలని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సనాతన ధర్మ క్షేత్రంలో ఉద్యోగిని దుర్భాషలాడి అవమానించినా ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. టీటీడీ పాలకమండలి చైర్మన్, సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తక్షణం స్పందించి బోర్డు సభ్యుడిని తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

జవానుకు స్వస్థలం కన్నీటి నివాళి

- స్వగ్రామానికి చేరిన మోహన్ వెంకటేష్ భౌతికకాయం
- బోరున విలపించిన కుటుంబ సభ్యులు, పిట్టలవానిపాలెం గ్రామస్తులు
- నేడు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



ప్రత్యేక వాహనంలో భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకువస్తున్న ఆర్మీ అధికారులు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): రాజస్థాన్‌లో గన్ బ్యాక్ ఫైర్ అయి మృత్యువాత పడిన బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం పంచాయతీ గొడపాలెంకు చెందిన జవాను పరిశా మోహన్ వెంకటేష్ భౌతికకాయం గురువారం రాత్రి 8 గంటలకు స్వగ్రామం చేరుకుంది. మోహన్ వెంకటేష్ మృతదేహంతో ఆర్మీ అధికారులు గురువారం ఉదయం 11.30కు ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 1.45కు గన్నవరం విమానాశ్రయానికి తీసుకువచ్చారు. ఆంధ్రా, తెలంగాణా సబ్ ఏరియా హెడ్ క్వార్టర్ అధికారులు.. మోహన్ వెంకటేష్ భౌతికకాయం వద్ద సైనిక లాంఛనాలతో నివాళులర్పించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మిలటరీ వాహనంలో స్వగ్రామానికి తీసుకువస్తుండగా మాజీ సైనికులు, కుటుంబ సభ్యులు, యువకులు త్రివర్ణ పతాకాలు చేతపట్టి బైక్‌లు, కార్లలో అనుసరించారు. సంగుపాలెం కోడూరు వద్ద నుంచి అమర్ రహే మోహన్ వెంకటేష్ అంటూ నినాదాలు చేస్తూ చందోలు, రాంబొట్లవారిపాలెం, పరిశావారిపాలెం, మంతెనవారిపాలెం మీదుగా పిట్టలవానిపాలెం సెంటర్ నుంచి గొడపాలెంలోని స్వగృహానికి తీసుకువచ్చారు. దీంతో బంధువులు, గ్రామస్తుల రోదనలు ఒక్కసారిగా మిన్నంటాయి. నెలాఖరుకు సెలవులో వస్తానని చెప్పి ఇలా విగతజీవిగా వచ్చావా అంటూ తల్లిదండ్రులు, ఇంక నాకెవరు దిక్కు నేనెలా బతకాలిరా దేవుడా అంటూ భార్య విలపించిన తీరు కంటతడి పెట్టించింది. మోహన్ వెంకటేష్ భౌతికకాయానికి శుక్రవారం ఉదయం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

యాదగిరి క్షేత్రంలో రెండోరోజు స్తోత్ర పారాయణాలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ స్వర్ణ దివ్య విమాన గోపురం మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో భాగంగా.. రెండోరోజు గురువారం ఆధ్యాత్మిక వేడుకలను పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారం నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులకు తిరువీధి సేవ అనంతరం.. యాగశాలలో శ్రీస్వామి, అమ్మవారిని అధిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. యాగశాలలోని పంచకుండాల వద్ద రుత్వికులు వేద ఇతిహాసాది పురాణ స్తోత్ర పారాయణాలు పఠించారు. ఈ సందర్భంగా క్షేత్రానికి చేరుకున్న వానమామలై మఠం 31వ మధుర కవి రామానుజ జీయర్ స్వామికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆయన గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠ అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

అంగన్‌వాడీ చిన్నారులకు అస్వస్థత

ఎన్టీఆర్ జిల్లా ఏకొండూరు మండలంలో ఘటన



చికిత్స పొందుతున్న చిన్నారులు

తిరువూరు: అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం తీసుకున్న చిన్నారులు అస్వస్థతకు గురయిన ఘటన గురువారం ఎన్టీఆర్‌జిల్లా ఏకొండూరు మండలం పెదతండాలో కలకలం రేపింది. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏకొండూరు మండలం కంభంపాడు హైస్కూలులో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో భాగంగా పెదతండా కార్యకర్త కూడా వెళ్లగా, సహాయకురాలు ఈ కేంద్రంలోని పిల్లలకు పౌష్టికాహారం అందించారు. మొత్తం 18 మంది పిల్లలుండగా 11మంది హాజరయ్యారు. ఉడికించిన గుడ్లు, పాలు తిన్న తర్వాత ఐదుగురు చిన్నారులకు వాంతులవడటంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించేందుకు 108 అంబులెన్సుకు ఫోను చేసినా స్పందించకపోవడంతో ప్రైవేటు వాహనంలో మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయమై తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి జి.సత్యవతిని వివరణ కోరగా తమ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలన్నిటికీ ఒకేవిధమైన పౌష్టికాహారం సరఫరా చేస్తారని, పెదతండా కేంద్రంలో పిల్లలు అస్వస్థతకు గురైన కారణాలు తెలుసుకుంటామన్నారు.

రేఖా గుప్తా అనే నేను..

ఢిల్లీ నూతన సీఎంగా ప్రమాణ స్వీకారం

- మంత్రులుగా ఆరుగురు ఎమ్మెల్యేల ప్రమాణం
- రామ్‌లీలా మైదానంలో పండుగ వాతావరణం
- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు
- సీఎం పోస్టు కోసం పోటీపడిన పర్వేశ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి
- మోదీ కలలు సాకారం చేయడానికి శ్రమిస్తామన్న రేఖా గుప్తా



సీఎం కార్యాలయంలో రేఖా గుప్తా బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో 26 ఏళ్ల తర్వాత బీజేపీ అధికార పగ్గాలు చేపట్టింది. తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన రేఖా గుప్తా నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే మరో ఆరుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఢిల్లీలోని చరిత్రాత్మక రామ్‌లీలా మైదానంలో గురువారం అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా వారితో ప్రమాణం చేయించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేశ్ వర్మతోపాటు కపిల్ మిశ్రా, మంజీందర్ సింగ్ సిర్సా, ఆశిష్ సూద్, రవీందర్ ఇంద్రజ్ సింగ్, పంకజ్ సింగ్‌కు మంత్రియోగం దక్కింది. ప్రస్తుత కేబినెట్‌లో మహిళలకు చోటు కల్పించలేదు. ప్రమాణ స్వీకార వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జె.పి.నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్, హర్దీప్ పురి, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, హరియాణా సీఎం నాయబ్‌సింగ్ సైనీ, మేఘాలయా ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రజేశ్ పాఠక్‌తోపాటు పలువురు ప్రముఖులు, బీజేపీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. 50 వేల మందికిపైగా జనంతో మైదానంలో పండుగ వాతావరణం నెలకొంది. జైశ్రీరామ్.. మోదీ, మోదీ అనే నినాదాలతో ప్రాంగణమంతా మార్మోగిపోయింది. రేఖా గుప్తా ప్రమాణ స్వీకారానికి ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ స్వాతి మలీవాల్ సైతం హాజరుకావడం చర్చనీయాంశంగా మారింది.

వచ్చే నెల 8 నుంచి మహిళలకు రూ.2,500

ప్రమాణ స్వీకారం కంటే ముందు రేఖా గుప్తా తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8వ తేదీన మహిళల ఖాతాల్లో తొలి విడత సొమ్ము జమ చేస్తామని ప్రకటించారు. ప్రధాని మోదీ కలలను సాకారం చేయడానికి శ్రమిస్తామని, అది 48 మంది బీజేపీ ఎమ్మెల్యేల బాధ్యత అని ఉద్ఘాటించారు. ఢిల్లీలో గత పదేళ్లలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలకు ఆమ్ ఆద్మీ పార్టీ బాధ్యత వహించాలని తేల్చిచెప్పారు. ఖర్చు చేసిన ప్రజాధనానికి లెక్కలు చెప్పాల్సిందేనని అన్నారు. యమునా నది ప్రక్షాళనకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వబోతున్నామని రేఖా గుప్తా వెల్లడించారు. కశ్మీరీ గేటు ప్రాంతంలోని శ్రీమార్ఘాత్‌వాలే హనుమాన్ బాబా ఆలయాన్ని ఆమె దర్శించుకున్నారు.

సచివాలయంలో బాధ్యతల స్వీకరణ

ప్రమాణ స్వీకారం అనంతరం మధ్యాహ్నం రేఖా గుప్తా సచివాలయానికి చేరుకున్నారు. ఢిల్లీ తొమ్మిదో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. 'వికసిత్ ఢిల్లీ' తమ ధ్యేయమని, ఒక్క రోజు కూడా వృథా చేయకుండా విధులు నిర్వర్తిస్తామని చెప్పారు.

ప్రధాని మోదీ అభినందనలు

సీఎం రేఖా గుప్తాకు ప్రధాని మోదీ అభినందనలు తెలియజేశారు. ఆమె కింది స్థాయి నుంచి కష్టపడి పైకి ఎదిగారని ప్రశంసించారు. గతంలో ఎన్నో హోదాల్లో ప్రజలకు సేవలందించారని తెలిపారు. ఢిల్లీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిగా నూతనోత్సాహంతో పని చేస్తారన్న విశ్వాసం తనకు ఉందని పేర్కొన్నారు. రేఖా గుప్తా ఎన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు మోదీ ఒక సందేశం విడుదల చేశారు. మరో సందేశంలో మంత్రి అమిత్ షా కూడా అభినందనలు తెలిపారు.

యమునా హారతి

సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేఖా గుప్తా తన మంత్రివర్గ సహచరులు, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవాతో కలిసి యమునా హారతి నిర్వహించారు. నగరంలో వాసుదేవ ఘాట్‌లో వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'మా యమున పూజ' నిర్వహించారు. ఈ సందర్భంగా రామభజనలతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అధికారంలోకి వస్తే యమునా నదిని శుద్ధి చేస్తామని ఎన్నికల ప్రచారంలో బీజేపీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రేఖా గుప్తా యమునా హారతి ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. యమునా మాతకు హారతి ఇస్తున్న సమయంలో తమ హామీని మరోసారి గుర్తు చేసుకున్నామని రేఖా గుప్తా వ్యాఖ్యానించారు. నదిని ప్రక్షాళన చేయడానికి అన్ని రకాల వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటామని చెప్పారు. యమున హారతి తర్వాత రేఖా గుప్తా నేతృత్వంలో తొలి మంత్రివర్గ సమావేశం జరిగింది.

ఎవరికి ఏ శాఖ

రేఖా గుప్తా (ముఖ్యమంత్రి)	ఆర్థిక, రెవెన్యూ, సేవలు, నిఘా, మహిళా-శిశు అభివృద్ధి
పర్వేశ్ వర్మ	ప్రజా పనులు, సాగునీరు, శాసనసభ వ్యవహారాలు, వరదల నియంత్రణ
ఆశిష్ సూద్	హోం, విద్యుత్, పట్టణాభివృద్ధి, విద్య
మంజీందర్ సింగ్ సిర్సా	పరిశ్రమలు, అడవులు, పర్యావరణం, ఆహారం, సరఫరా
రవీంద్ర కుమార్ ఇంద్రాజ్	సాంఘిక సంక్షేమం, ఎస్సీ/ఎస్టీ సంక్షేమం, సహకార
కపిల్ మిశ్రా	న్యాయం, కార్మిక, ఉపాధి కల్పన, టూరిజం
పంకజ్ కుమార్ సింగ్	ఆరోగ్యం, రవాణా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ

మ్యూజియంగా 'శీష్ మహల్'?

సాక్షి, న్యూఢిల్లీ: ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అధికారంలో ఉండగా నిర్మించిన ముఖ్యమంత్రి అధికారిక నివాసం 'శీష్ మహల్'ను కొత్తగా కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం ఏం చేస్తుందన్న దానిపై అప్పుడే ఢిల్లీలో కొత్త చర్చ మొదలైంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేఖా గుప్తా, తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందే ఎట్టి పరిస్థితుల్లోనూ శీష్ మహల్‌లో ఉండబోనని స్పష్టం చేశారు. ఆమె వాదనకు మద్దతుగా ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా సహా పలువురు నేతలు ఇదే రీతిలో స్పందించారు. దీంతో, ఆ భవనాన్ని మ్యూజియంగా మలిచేందుకు బీజేపీ ప్రభుత్వం భావిస్తోందని తెలుస్తోంది. ప్రభుత్వం ఏదైనా స్థలాన్ని మ్యూజియంగా మార్చాలనుకుంటే, దానిని మంత్రివర్గం, సంబంధిత మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం పంపి, ఆమోదం పొందిన తర్వాత, భవనాన్ని పరిరక్షించాలా, మ్యూజియంగా మార్చడానికి మార్పులు చేయాలా అనే నిర్ణయానికి వస్తారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై కొత్త ప్రభుత్వం ఒకట్రెండు రోజుల్లోనే తన నిర్ణయాన్ని వెల్లడించే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.



ఎవరినో గెలిపించేందుకు ప్రయత్నించారు

అందుకే భారత్‌కు 2.1 కోట్ల డాలర్లు పంపారేమో ● నాటి బైడెన్ ప్రభుత్వంపై ట్రంప్ ఆరోపణలు

న్యూయార్క్: విభిన్న అంశాలపై మెరుపు వేగంతో నిర్ణయాలు తీసుకుంటూ సంచలనం రేపుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈసారి భారతీయ కోణంలో ఆరోపణల బాంబు విసిరారు. భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచే ఉద్దేశంతో నిర్వహించే కార్యక్రమాలకు అమెరికా తన వంతుగా పంపే 2.1 కోట్ల డాలర్ల ఆర్థిక సాయం వెనుక మరేదో కుట్ర కోణం ఉందని ట్రంప్ సంచలన ఆరోపణలు చేశారు. డెమొక్రాట్ల సారథ్యంలోని బైడెన్ ప్రభుత్వం కొలువుతీరిన కాలంలో భారత్‌కు రావాల్సిన ఈ 2.1 కోట్ల డాలర్లతో భారత్‌లో ఎన్నికల్లో ఇంకెవరినో గెలిపించాలని భావించి ఉంటారని ట్రంప్ ఆరోపణలు గుప్పించారు. గురువారం మియామీలో సౌదీ అరేబియా ప్రభుత్వ సారథ్యంలో జరిగిన ఎఫ్ఐఐ 'ప్రియారిటీ' సదస్సులో పాల్గొన్న సందర్భంగా ట్రంప్ ప్రసంగించారు. ''నేను రెండోసారి అధ్యక్షుడిగా ప్రమాణం చేయడం ముందు వరకు మన అమెరికా ప్రభుత్వ ఖజానా నుంచి కొంత నగదు ఎక్కడెక్కడికి వెళ్లిందో మీకు కొన్ని ఉదాహరణలు చెబుతా. అందులో భారత్‌కు కూడా వెళ్లాయి. భారత్‌లో ఓటర్ల సంఖ్య పెంచేందుకు అమెరికా ప్రభుత్వం సొంత డబ్బులు 2.1 కోట్ల డాలర్లను ఎందుకు ఖర్చు చేయాలి?. నేను ఏమనుకుంటున్నానంటే.. బైడెన్ ప్రభుత్వం భారత్‌లో ఇంకెవరినో గెలిపించాలని భావించింది. ప్రస్తుతం భారత్‌లో అధికారంలో ఉన్న ప్రభుత్వానికి నేను ఈ విషయాన్ని తెలియజేస్తా. రష్యా అమెరికాలో ఏ రెండు డాలర్లో ఖర్చు పెట్టింది అనుకుంటే అది ఒక విషయమే కాదు. కానీ మనం భారత్ కోసం 2.1 కోట్ల డాలర్లు ఇవ్వడమనేది నిజంగా పెద్ద విషయం. ఇంతకంటే పెద్దవిషయం ఏంటంటే బంగ్లాదేశ్‌లో రాజకీయ సుస్థిరత కోసం మనం 2.9 కోట్ల డాలర్లు ఖర్చుచేశాం. అసలు ఆసియా దేశాలు అద్భుతంగా రాణిస్తున్నాయి. మనం వాళ్లకు డబ్బులు ఇవ్వాల్సిన అవసరమే లేదు. అసలు ఇలాంటి ఎన్నో దేశాలకు విచిత్రమైన నిధుల జారీ పరంపర కొనసాగింది. ఇది చాంతాడంత పెద్ద జాబితా'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

బంగ్లాదేశ్, నేపాల్‌కు సైతం కోట్ల డాలర్ల నిధులు

అమెరికా ప్రభుత్వ పనితీరు, సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు, పరిపాలనలో సమూల మార్పులు, సంస్కరణలే లక్ష్యంగా దూసుకుపోతున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ (డోజ్) ఫిబ్రవరి 16న ఈ నిధుల అంశాన్ని బయటపెట్టింది. ''అమెరికన్లు ప్రభుత్వానికి పన్నుల రూపంలో కట్టిన సొమ్ము దేశం దాటి ఎన్నో దేశాలకు వెళ్తోంది. భారత్‌కు 2.1 కోట్ల డాలర్లు అక్కడి ఓటర్ల సంఖ్య పెంచేందుకు ఉద్దేశించి మన ప్రభుత్వం ఇన్నాళ్లు పంపుతోంది. బంగ్లాదేశ్‌కు 2.9 కోట్ల డాలర్లు, నేపాల్ ఆర్థిక స్వేచ్ఛ కోసం 2 కోట్ల డాలర్లు, పర్యావరణ వైవిధ్యం పరిరక్షణ కోసం మరో 1.9 కోట్ల డాలర్లు, ఆసియా కోసం 4.7 కోట్ల డాలర్లు ఖర్చు చేస్తున్నాం'' అని డోజ్ పేర్కొనడం తెల్సిందే.

అంతా అబద్ధం!

అయితే డోజ్ గణాంకాలను భారత్‌లోని పలువురు అబద్ధాలుగా అభివర్ణించారు. ''విదేశాలకు నిధులు ఇస్తున్నామని అమెరికా చెప్పేదాంట్లో నిజం లేదు. పైగా యూఎస్ఎయిడ్ అనేది మానవ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణం'' అని ఆర్థిక వేత్త, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలిలో సభ్యుడు సంజీవ్ సన్యాల్ వ్యాఖ్యానించారు. మాజీ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్‌వై ఖురేషి సైతం ఇదే అభిప్రాయం వెలిబుచ్చారు. ''భారత్‌లో ఓటర్ల పెంపు కోసం అమెరికా నిధులు ఇవ్వలేదు. ఈ వివాదం అంతా ఒక మీడియా చేసిన ప్రచారంతో వచ్చింది. నేను సీఈసీగా ఉన్నప్పుడు 2012లో కేంద్ర ఎన్నికల సంఘంతో ఒక అమెరికా ఏజెన్సీ ఒప్పందం కుదుర్చుకుందని, అలా కోట్ల డాలర్ల నిధులు భారత్‌కు వస్తున్నాయని ఆ మీడియా ఒక కథనంలో పేర్కొంది. ఇందులో వాస్తవం లేదు'' అని ఖురేషీ చెప్పారు. అయితే డోజ్ ఆరోపణలను బీజేపీ సమర్థించింది. ''బైడెన్ ప్రభుత్వ హయాంలో భారత్‌కు నిధులు వచ్చి ఉండొచ్చు. అయితే ఆ నిధుల వల్ల పెరిగిన ఓటర్లకు బీజేపీకి ఎలాంటి సంబంధం లేదు. పెరిగిన ఓటర్లతో ఎవరు లబ్ధి పొందారో తెలియాలి'' అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి అమిత్ మాలవీయ వ్యాఖ్యానించారు.

పనామాలో వలసదారులు భద్రమేనా?

- హోటల్ కిటికీల వద్ద 'సాయం చేయండి' ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వలసదారులు
- అందరూ క్షేమంగా ఉన్నారని వివరణ ఇచ్చిన భారత్



తమను కాపాడాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వలసదారులు

పనామా సిటీ: చట్టవిరుద్ధంగా తమ దేశానికి చేరుకున్న వివిధ దేశాల పౌరులను అమెరికా తిరిగి వారివారి స్వదేశాలకు తరలిస్తున్న ప్రక్రియపై కొత్త అనుమానాలు రేకెత్తుతున్నాయి. అమెరికా నుంచి బయల్దేరిన అక్రమ వలసదారులకు మార్గమధ్యంలో కొంతకాలం పనామా నగరంలో బస సౌకర్యాలు కల్పిస్తున్న విషయం తెల్సిందే. అయితే పనామా సిటీలోని డికాపొలిస్ హోటల్‌లో ఉన్న పలు దేశాల అక్రమ వలసదారులు ''దయచేసి సాయం చేయండి'', ''మేము ఇక్కడ క్షేమంగా లేము'' అంటూ ప్లకార్డులను హోటల్ కిటికీల వద్ద ప్రదర్శిస్తుండటంతో నిర్బంధంలో వారి బాగోగులపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. అమెరికా నుంచి భారత్‌కు పలు దఫాల్లో వచ్చిన కొందరు అక్రమ వలసదారులను అమానుషంగా చేతులు, కాళ్లు కట్టేసి సరైన ఆహారం అందించకుండా ఏకబిగిన గంటలతరబడి ఉక్కబోత, వేడి పరిస్థితుల్లో తీసుకొచ్చారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తడం తెల్సిందే. ఈ నేపథ్యంలో పనామా హోటల్‌లో వీరిని స్వేచ్ఛగా ఉండనిస్తున్నారో లేదంటే గదిలో బంధించి, సరైన ఆహారం, కనీస సదుపాయాలు కల్పించ కుండా వేధిస్తున్నారేమోనన్న అనుమానాలు బలపడుతున్నాయి. పనామా సిటీకి చేరుకున్న అక్రమ వలసదారుల్లో దాదాపు 300 మంది చైనా, భారత్, నేపాల్, శ్రీలంక, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ దేశస్తులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేశాలు తమ దేశస్తులను స్వీకరించేందుకు పూర్తిస్థాయి సుముఖత వ్యక్తం చేయని కారణంగా నేరుగా ఆయా దేశాలకు పంపడంలో ఆలస్యం అవుతుండటంతో మార్గమధ్యంలో పనామా సిటీకి తరలించినట్లు తెలుస్తోంది.

ఆరోపణలను తోసిపుచ్చిన పనామా

''హోటల్‌లో వాళ్లంతా క్షేమంగా ఉన్నారు. వాళ్ల స్వేచ్ఛను మేం లాగేసుకోలేదు. వాళ్లను నిర్బంధించలేదు. రక్షణ కోసం కేవలం కస్టడీలోకి తీసుకుని బాగోగులు చూస్తున్నాం. అమెరికాతో ఒప్పందం మేరకు వలసదారులకు ఆహారంతోపాటు ఔషధాలు, వైద్యసాయం అందిస్తున్నాం'' అని పనామా రక్షణ మంత్రి ఫ్రాంక్ అబ్రిగో చెప్పారు. ''సొంత దేశానికి వెళ్లేందుకు ఇష్టపడని వారిని కొలంబియా సరిహద్దుల్లోని డేరియన్ ప్రావిన్స్‌లోని అటవీ ప్రాంత శిబిరానికి తరలిస్తాం. తర్వాత మరేదైనా దేశానికి తరలించే బాధ్యతను అంతర్జాతీయ వలసదారుల సంస్థ, ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థలు తీసుకుంటాయి. 171 మంది సొంత దేశాలకు వెళ్తామంటున్నారు. 97 మంది వేరే దేశాలకు పంపేయాలని వేడుకుంటున్నారు'' అని ఆయన చెప్పారు. ''హోటల్ నుంచి ఒక చైనా దేశస్తురాలు తప్పించుకుంది. ఈమెను ఉత్తర పనామా-కోస్టారికా సరిహద్దు గుండా అమెరికాలోకి పారిపోయేందుకు ప్రయత్నిస్తుంటే మళ్లీ నిర్బంధంలోకి తీసుకున్నాం'' అని ఆయన చెప్పారు.

వారి శ్రేయస్సే మాకు ముఖ్యం: భారత్

పనామా హోటల్‌లో భారతీయ అక్రమ వలసదారులు అవస్థలు పడుతున్నారని వస్తున్న వార్తలపై భారత్ స్పందించింది. ఈ మేరకు పనామా, కోస్టారికా, నికరాగ్వా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన చేశాయి. ''వలసదారుల తరలింపులో ఒక స్నేహ సేతువుగా ఉండేందుకు పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో అంగీకరించడంతో భారతీయ వలసదారుల బృందం క్షేమంగా పనామా సిటీకి చేరుకుంది. వాళ్లకు అన్ని కనీస సదుపాయాలు కల్పించారు. వాళ్లతో మన ఎంబసీ అధికారులు మాట్లాడుతున్నారు. వారి శ్రేయస్సే మాకు ముఖ్యం. ఇందుకు అనుగుణంగా ఆతిథ్యదేశంతో సంప్రదింపులు జరుపుతున్నాం'' అని భారత రాయబార కార్యాలయాలు స్పష్టంచేశాయి.

ఆస్పత్రిలో చేరిన సోనియా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ(78) గురువారం ఉదయం ఢిల్లీలోని సర్ గంగారాం హాస్పిటల్‌లో చేరారు. సోనియాను ఎందుకు ఆస్పత్రిలో చేర్చారనే విషయం స్పష్టం కానప్పటికీ ఆమె బాగానే ఉన్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపా యి. వైద్య బృందం పరిశీలనలో ఉన్న ఆమెను శుక్రవారం డిశ్చార్జి చేసే అవకాశముందని వెల్లడించాయి.

నీతి ఆయోగ్ సీఈవో పదవీ కాలం పొడిగింపు

న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో) బీవీఆర్ సుబ్రమణ్యం పదవీ కాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగిస్తూ కేంద్రం గురువారం ఆదేశాలు జారీ చేసింది. 1987 బ్యాచ్ ఐఏఎస్ అయిన సుబ్రమణ్యం ఛత్తీస్‌గఢ్ కేడర్‌కు చెందిన వారు. 2023 ఫిబ్రవరిలో నీతి ఆయోగ్ సీఈవోగా రెండేళ్ల పదవీ కాలానికి గాను నియమితులయ్యారు. ఈయన పదవీ కాలాన్ని 2025 ఫిబ్రవరి 24 నుంచి ఏడాది పాటు పొడిగించే ప్రతిపాదనపై ఇటీవల కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని ఆ ఆదేశంలో వివరించింది.

విదేశీ వైద్య విద్యకు నీట్ యూజీ అర్హత తప్పనిసరి: సుప్రీం

న్యూఢిల్లీ: విదేశాల్లో వైద్య విద్య ఎంబీబీఎస్ చదవాలనుకునే వారు నీట్ యూజీలో అర్హత సాధించడం తప్పనిసరని సుప్రీంకోర్టు పేర్కొంది. దేశంలో వైద్య వృత్తిలో ప్రమాణాలను కాపాడటమే లక్ష్యంగా 2018లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) తీసుకువచ్చిన ఈ నిబంధనలో పారదర్శకత ఉందని తెలిపింది. గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్-1997కు లోబడే ఉందని కూడా వివరించింది. 1956 నాటి ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్‌ను మార్చకుండానే ఈ నిబంధనను తీసుకువచ్చారన్న పిటిషనర్ల వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. చట్టంలోని సెక్షన్ -33 ప్రకారం ఇలాంటి నిబంధనలను అమలు చేసే అధికారం ఎంసీఐకి ఉందని వివరించింది. అయితే, ఈ నిబంధన అమల్లోకి వచ్చిన తర్వాత విదేశాల్లో ఎంబీబీఎస్ చదివి స్వదేశంలో ప్రాక్టీస్ చేయాలనుకునే వారి కోసం వన్‌టైం మినహాయింపు ఇవ్వాలన్న విజ్ఞప్తిని సైతం తిరస్కరించింది. కాగా, విదేశాల్లో ఎంబీబీఎస్ చేసి, అక్కడే ప్రాక్టీస్ చేసుకునే వారికి మాత్రం నీట్ యూజీ నిబంధన వర్తించదు.

ఏక్‌నాథ్ షిండే కారును పేల్చేస్తామంటూ బెదిరింపు

ముంబై: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే కారును పేల్చేస్తామని బెదిరిస్తూ ఆగంతకులు ముంబై పోలీసులకు మెయిల్స్ పంపారు. గోరెగావ్, జేజే మార్గ్ పోలీస్‌స్టేషన్లకు గురువారం ఉదయం ఈ మేరకు మెయిళ్లు అందాయి. 'ఆగంతకుల మెయిళ్ల ఐపీ అడ్రస్‌లను ట్రాక్ చేస్తున్నాం. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేపట్టాం' అని పోలీసులు తెలిపారు.



హమాస్ అప్పగించిన శవ పేటికలు, ఇన్‌సెట్‌లో మృతులు

నలుగురు బందీల మృతదేహాలు అప్పగింత


ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లోనే మృతి చెందారన్న హమాస్

ఖాన్ యూనిస్: ఇజ్రాయెల్‌కు చెందిన నలుగురు బందీల మృతదేహాలను హమాస్ గురువారం విడుదల చేసింది. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగర సమీపంలో రెడ్ క్రాస్ సంస్థకు అందజేసింది. అనంతరం రెడ్‌క్రాస్ వాహనంలో ఉంచారు. ఆ పేటికల్లో షిరి బిబాస్(32), ఆమె ఇద్దరు పిల్లలు ఏరియల్ బిబాస్(4), కెఫిర్ బిబాస్, రిటైర్డ్ జర్నలిస్ట్ ఓడెడ్ లిఫ్ షిట్జ్‌గా గుర్తించారు. వీరందరూ హమాస్ 2023 అక్టోబర్ ఏడో తేదీన దాడిలో అపహరించిన వారు. అయితే ఈ నలుగురు గతేడాది నవంబర్‌లో ఇజ్రాయెల్ చేసిన దాడిలో మరణించారని హమాస్ తెలిపింది. ఇజ్రాయెల్ క్రూరమైన నిరంతర బాంబు దాడుల వల్ల అపహరణకు గురైనవారందరినీ రక్షించలేకపోయామని హమాస్ తెలిపింది. చనిపోయినవారు... పిల్లల ప్రాణాలనూ లెక్కచేయని నాయకత్వ తీరుకు బలైపోయారని హమాస్ బాధితుల కుటుంబాలకు తెలిపింది. మృతదేహాల పేటికలు తమకు అందాయని ఇజ్రాయెల్ సైన్యం ధ్రువీకరించింది. మరణించినవారి వివరాలను ఇజ్రాయెల్ అధికారికంగా వెల్లడించలేదు. అప్పగింత సమయంలో.. ఖాన్ యూనిస్ శివార్లలో వేలాది మంది గుమిగూడారు. శవపేటికలను ఉంచడానికి ఏర్పాటు చేసిన వేదికపై ముసుగులు ధరించిన సాయుధులు... ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును రక్తపిశాచిగా చిత్రీకరించిన పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించారు. ఒక పెద్ద స్క్రీన్‌లో లిఫ్ షిట్జ్, బిబాస్ కుటుంబం ఫొటోలను, వీడియోలను ప్రదర్శించారు. అత్యంత చిన్నవయస్కుడైన కెఫిర్.. బాట్‌మాన్ దుస్తులు ధరించి చిరునవ్వులు చిందిస్తున్న ఫొటో అందరినీ కదిలించింది.

హైకోర్టు జడ్జిపై లోక్‌పాల్ విచారణా?

ఈ ధోరణి అత్యంత ఆందోళనకరం ● లోక్‌పాల్ ఉత్తర్వుపై స్టే విధించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఒక హైకోర్టు సిట్టింగ్ అడిషనల్ జడ్జిపై లోక్‌పాల్ విచారణ చేపడుతూ ఉత్తర్వులు జారీచేయడాన్ని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. ఈ ధోరణి ఏమాత్రం ఆమోదనీయం కాదని పేర్కొంది. ఈ మేరకు లోక్‌పాల్ జారీచేసిన ఉత్తర్వుల అమలుపై స్టే విధిస్తూ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకాల సుప్రీంకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. ఒక హైకోర్టు జడ్జిపై నమోదైన రెండు ఫిర్యాదులను విచారిస్తూ లోక్‌పాల్ జనవరి 27వ తేదీన ఉత్తర్వులు ఇచ్చిన అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి గురువారం విచారించింది. న్యాయవ్యవస్థ స్వతంత్రకు భంగం కల్గించేలా లోక్‌పాల్ వ్యవహరిస్తోందని కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. హైకోర్టు జడ్జి ఉదంతంలో స్పందన తెలపాలని కేంద్ర ప్రభుత్వం, లోక్‌పాల్ రిజిస్ట్రార్‌తోపాటు హైకోర్టు జడ్జిపై ఫిర్యాదుచేసిన వ్యక్తికి సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. సుప్రీంకోర్టు అభిప్రాయంతో కేంద్రప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఏకీభవించారు. హైకోర్టు జడ్జి ఎప్పుడూ కూడా లోక్‌పాల్, లోకాయుక్త చట్టం,2013 పరిధిలోకి రారని మెహతా వాదించారు. ఈ కేసులో హైకోర్టు జడ్జి పేరు బహిర్గతం కాకుండా చూడాలని, ఆ ఫిర్యాదుదారు పేరు, అతను ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలను రహస్యంగా ఉంచాలని లోక్‌పాల్ రిజిస్ట్రార్ జనరల్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ''ఈ అంశంలో కోర్టుకు సాయపడతా. హైకోర్టు జడ్జీల విషయంలో ఇలాంటివి పునరావృతంకాకుండా ఒక చట్టం ఉంటే మంచిది'' అని ఈ అంశంలో కోర్టుకు హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ అన్నారు. కేసు తదుపరి విచారణను మార్చి 18వ తేదీకి వాయిదావేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. లోక్‌పాల్‌లో ఫిర్యాదుచేసిన వ్యక్తికి వ్యతిరేకంగా ఒక ప్రైవేట్ కంపెనీ ఒక కేసును నమోదుచేసింది. ఈ కేసులో తమకు అనుకూలంగా వ్యవహరించాలని ఈ హైకోర్టు సిట్టింగ్ అడిషనల్ జడ్జిని ఈ ప్రైవేట్ సంస్థ కోరింది. ఈ జడ్జి గతంలో లాయర్‌గా ఉన్న కాలంలో ఇదే సంస్థకు చెందిన కేసును వాదించారు. ఇప్పుడు ఆయన జడ్జీ అయ్యాక ఈ కేసులో హైకోర్టులో మరో జడ్జి, అదనపు జిల్లా జడ్జీలను ఈయన ప్రభావితం చేశారని ఫిర్యాదుదారు లోక్‌పాల్‌లో కేసు వేశారు. దీంతో లోక్‌పాల్ జనవరి 27వ తేదీన హైకోర్టు జడ్జిపై ఉత్తర్వులు జారీచేసింది. లోక్‌పాల్, లోకాయుక్త చట్టం, 2013లోని సెక్షన్ 20(4) ప్రకారం హైకోర్టు జడ్జిపై విచారణ చేపట్టే హక్కు తమకు ఉందని జస్టిస్ ఏఎం ఖన్విల్కర్ సారథ్యంలోని లోక్‌పాల్ బెంచ్ పేర్కొనడంతో సుప్రీంకోర్టు చివరకు ఇలా కలగజేసుకుంది.



మహా కుంభమేళా వేళ మరో అద్భుతం

28వ తేదీన ఆకాశంలో కనువిందు చేయనున్న ఏడు గ్రహాలు

న్యూఢిల్లీ: కోట్లాది మంది భక్తుల రాకతో మహాకుంభమేళా ఘాట్లు, ప్రాంగణాలు కన్నుల పండువగా కనిపిస్తే ఆ కుంభమేళా ముగిసిన తర్వాత సైతం ఆ కన్నుల పండువ కొనసాగనుంది. అయితే ఈసారి నేలపై కాకుండా వినీలాకాశంలో ఓ అద్భుత దృశ్యం చూపరులకు కనువిందు చేయనుంది. అదే సౌరమండలంలోని ఏడు గ్రహాల సాక్షాత్కారం. యురేనస్, నెప్ట్యూన్ మినహా మిగతా అన్ని సౌరకుటుంబ గ్రహాలను నేరుగా మనం కంటితోనే చూడొచ్చు. ఫిబ్రవరి 28వ తేదీన ఇవి అత్యంత స్పష్టంగా కనిపించి మనల్ని ఆశ్చర్యంలో ముంచెత్తనున్నాయి. కాస్తంత దూరంగా ఉండటంతో యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలను మనం చూడలేము. టెలిస్కోప్, బైనాక్యులర్ సాయంతో ఈ రెండింటిని చూడొచ్చు. భూమి సూర్యుని చుట్టూ తిరిగే సూర్యగమన పథమార్గంలోనే ఈ అన్ని గ్రహాలను మనం ఒకేసారి చూడొచ్చు. మహాకుంభమేళా వంటి అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని అద్భుతంగా జరుపుకుని పూర్తిచేసుకుంటున్న వేళ గ్రహాలన్నీ సాక్షాత్కారం కావడం అనిర్వచనీయ అనుభూతిని ఇస్తుందని కొందరు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. హిందూ ఆచార సంప్రదాయాల్లో గ్రహకూటమిని విశేషమైనదిగా చెప్పుకుంటారు. భారత్‌లో రాత్రి వేళ బుధుడు, శుక్రుడు, అంగారకుడు, గురుడు, శని గ్రహాలను నేరుగా చూడొచ్చు. ఇలా ఎక్కువ గ్రహాలు ఒకేసారి మహాకుంభమేళా కాలంలో దర్శనమివ్వడంతో దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక శక్తి ప్రసరణ మరింత తేజోవంతమవుతుందని కొందరు భక్తులు విశ్వసిస్తున్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం | 21 | ఫిబ్రవరి | 2025

మార్చి 3 నుంచి అసెంబ్లీ: స్పీకర్

దొడ్డబళ్లాపురం: మార్చి 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ విధానసౌధ అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని స్పీకర్ యూటీ ఖాదర్ తెలిపారు. గురువారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. తొలిరోజు గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ అసెంబ్లీలో ప్రసంగిస్తారు. మార్చి 7న సీఎం సిద్ధరామయ్య బడ్జెట్‌ను ప్రకటిస్తారని తెలిపారు. లక్ష్మి హెబ్బాళ్కర్, ఎమ్మెల్సీ సీటీ రవి గొడవపై స్పందించనన్నారు. అయితే రాజకీయాలు రోజురోజుకీ మరింత కలుషితమవుతున్నాయని వాపోయారు. రాబోయే రోజుల్లో రాజకీయాల్లో విలువలు లేకుండా పోతాయని జోస్యం చెప్పారు. వ్యాపారవేత్తలు రాజకీయ నాయకులవుతున్నారని, రాజకీయ నాయకులు వ్యాపారవేత్తలవుతున్నారని చెప్పారు. 1960-70 కాలంలో రాజకీయాలు, వ్యాపారాలు వేరుగా ఉండేవన్నారు. అప్పట్లో రాజకీయ నాయకులు విలువలకు ప్రాముఖ్యత ఇచ్చి ప్రజాసేవకు కట్టుబడి ఉండేవారన్నారు.

న్యూస్‌రీల్

చనిపోతూ.. ప్రాణం పోశాడు



యశవంతపుర: రోడ్డు ప్రమాదంలో తలకు గాయాలైన యువకుడు బ్రెయిన్‌డెడ్ కాగా, కుటుంబీకులు అవయవదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఉడుపి జిల్లా కుందాపురకు చెందిన రాఘవేంద్ర (33) ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. చికిత్స పొందుతూ మణిపాల్ ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయ్యాడు. అవయవాలను దానం చేయాలని, ఇతరుల జీవితానికి సాయం చేయాలని వైద్యులు అభ్యర్థించడంతో కుటుంబ సభ్యులు సమ్మతించారు. రాఘవేంద్ర దేహం నుంచి కళ్లు, కిడ్నీలు, గుండె, చర్మం, ఊపిరితిత్తులు తదితర ముఖ్య అవయవాలను సేకరించి అవసరమైన రోగుల కోసం వెంటనే పంపించారు. ఊపిరితిత్తులు, శ్వాస నాళాలను సికింద్రాబాద్‌కు తరలించారు. మరణంలోను రాఘవేంద్ర ముగ్గురికి ప్రాణం నిలిపాడు.

పేలుళ్లు.. మూగజీవాలకు గాయాలు

మైసూరు: మొక్కజొన్న చొప్పలో పెట్టిన మేతను తినబోగా పేలుడు జరగడంతో ఒక గేదెతో పాటు నాలుగు ఆవుల నోళ్లు ఛిద్రమైన ఘటన చామరాజనగర జిల్లా హనూరు తాలూకా భద్రయ్యనహళ్లి గ్రామం వద్ద జరిగింది. గ్రామ శివార్లలో మేత కింద ఎవరో దుండగులు పేలుడు పదార్థాలను దాచి ఉంచారు. దీనిని గ్రహించని మూగ జంతువులు మేత మేయబోగా పెద్ద శబ్దంలో పేలుళ్లు జరిగాయి. ఉమాశంకర్, దేవరాజు, మల్లశెట్టిలకు చెందిన గేదెతో పాటు నాలుగు ఆవుల ముఖాలు పేలుడుతో తీవ్రంగా గాయపడ్డాయి. రెండు నెలల అవధిలో ఇలాంటి 3-4 సంఘటనలు జరిగాయి. దుండగులను పట్టుకుని శిక్షించాలని పశు పోషకులు డిమాండ్ చేశారు.

అన్నీ సెటిల్ చేసే వెళ్లిపోతా

దొడ్డబళ్లాపురం: కన్నడ సినిమా డైరెక్టర్ గురుప్రసాద్ గత ఏడాది నవంబర్ 3న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఆయన అప్పుల బాధ భరించలేక చనిపోయాడనేది కూడా తెలిసిందే. ఇప్పుడు ఓ ఆడియో వెలుగు చూసి ఆసక్తి కలిగిస్తోంది. ఆత్మహత్యకు ముందు రెండవ భార్యకు ఫోన్ చేసిన గురుప్రసాద్.. నీకు, కుమార్తెకు అన్నీ సెటిల్ చేసే పోతానని భరోసా ఇచ్చాడు. ఆడియోను స్నేహితుడికి పంపించాడు. ఆయన ఆత్మహత్య సంగతి రెండవ భార్యకు ముందే తెలుసా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

కొడవళ్లు, కట్టెలతో బైకర్ల హల్‌చల్



కృష్ణరాజపురం: బెంగళూరు నగరంలో పోకిరీ బైకర్ల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. కొడవళ్లు, బేస్‌బాల్ బ్యాట్లు పట్టుకొని బైక్‌లపై దూసుకెళ్తూ బయాందోళన సృష్టించారు. రామ్మూర్తినగర రింగ్ రోడ్డులో ఈ సంఘటన రిగింది. మారణాయుధాలను పట్టుకుని బైక్‌ల మీద వెళ్తూ, ఇతర వాహనదారులను భయపెట్టారు. వీలింగ్ కూడా చేశారు. కృష్ణరాజపురంలో ఉన్న వంతెన పైన, రామ్మూర్తినగరలో రింగ్ రోడ్డులో బైకర్ల దురాగతాలు జరుగుతున్నాయి. వేగంగా వెళ్తూ కొడవలితో రోడ్డుపై గీస్తూ నిప్పురవ్వలు వచ్చేలా చేస్తుంటారు. పోలీసులు గస్తీని పెంచి ఆకతాయిలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఠాణాపై దాడి కేసులో నిందితుడు అరెస్టు


మైసూరు: నగరంలోని ఉదయగిరి పోలీసు స్టేషన్‌ని చుట్టుముట్టి రాళ్ల దాడి చేసిన సంఘటనలో పరారీలో ఉన్న ముఫ్తీ ముష్తాక్ అనే నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు మౌల్వీగా పనిచేస్తున్నాడని, ఆ రోజు ఓ వర్గం వారిని రెచ్చగొట్టి ఠాణా మీద దాడి చేయించాడని అభియోగాలున్నాయి. ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసం కావడమేగాక 14 మందికి పైగా పోలీసులు గాయపడ్డారు. అప్పటినుంచి తప్పించుకు తిరుగుతుండగా సీసీబీ పోలీసులు గాలించి అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు. కాగా నిందితులపై చర్యలు తీసుకోవద్దని పోలీసులపై ప్రభుత్వం నుంచి, హోం శాఖ నుంచి తీవ్రమైన ఒత్తిడి ఉందని స్థానిక ఎమ్మెల్యే శ్రీవత్స కారోపించారు. తాము పోరాటం చేపడతామని హెచ్చరించడంతో నిందితున్ని అరెస్టు చేసిందన్నారు.

వేసవి దాహం తీరేదెట్టా?

- సర్కారు కసరత్తు
- డ్యాముల్లో నీటి మట్టాలపై సమీక్ష
- తీవ్రంగా ఉన్నచోట ట్యాంకర్ల ద్వారా జలం



గురువారం చిక్కమగళూరు వద్ద దావాలనం



ఈసారి వేసవి భీకరంగా ఉండవచ్చని అంచనా

బనశంకరి: వేసవికి ఇంకా 9, 10 రోజులు ఉండగానే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం 7 గంటల నుంచే చుర్రుమనే ఎండ, వేడిమి చికాకు పెడుతోంది. ఈ నేపథ్యంలో వచ్చే వేసవి కాలం, పరిష్కార చర్యలపై కసరత్తు చేపట్టింది.

ఫిబ్రవరిలో అధిక తాపం

ఈ సంవత్సరం ఫిబ్రవరిలో సాధారణం కంటే 2.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత అధికంగా నమోదవుతోంది. అలాగే ముంగారు వానలతో అధిక వర్షాలు కురుస్తాయని రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. గురువారం వాతావరణం, ప్రకృతి వైపరీత్యాల మంత్రివర్గ ఉపకమిటీ సమావేశం జరిగింది. ఈ ఏడాదిలో వేసవి, తాగునీటి సమస్య, వర్షాలు, వ్యవసాయం, జలాశయాల్లో నీటి మట్టాల గురించి అధికారులతో చర్చించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.

535 టీఎంసీల నీటి నిల్వలు

రాష్ట్రంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 14 జలాశయాల్లో ప్రస్తుతం నీటి నిల్వ 535 టీఎంసీలు ఉండగా, ఇది సరాసరి 60 శాతం అని చెప్పారు. గతేడాది ఇదే సమయంలో 332 టీఎంసీలు మాత్రమే ఉండేదని చెప్పారు. కొన్ని జలాశయాల్లో నీటిమట్టం సంతృప్తికరంగా లేదని అన్నారు. చిక్కబళ్లాపుర, చిత్రదుర్గ, తుమకూరు, బెంగళూరునగర, రామనగర జిల్లాల్లో 13 తాలూకాలు పరిధిలో 66 గ్రామాల్లో తాగునీటి కొరత అధికంగా ఉందని అంగీకరించారు. ట్యాంకర్లు, బోర్‌వెల్స్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. చిక్కబళ్లాపుర, బెంగళూరునగర, కోలారు జిల్లాల్లో 5 నగర, స్థానిక సంస్థల్లో ట్యాంకర్, బోర్లు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. జిల్లాల కలెక్టర్లు, తహశీల్దార్లకు పీడీ అకౌంట్లలో రూ.488 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో పలు శాఖల మంత్రులు పాల్గొన్నారు.

కార్చిచ్చులు

బెంగళూరులో వేడి సెగ మొదలైంది. గిరాకీ పెరగడంతో పెద్దమొత్తంలో కళింగర పండ్ల లోడ్లు వస్తున్నాయి. ఎండల వల్ల పలుచోట్ల కార్చిర్చు రేగుతోంది. గురువారం చిక్కమగళూరు దగ్గర కురువంగిలో అటవీప్రాంతంలో మంటలు వ్యాపించాయి. పెద్దమొత్తంలో గడ్డి, చెట్లు కాలిపోయాయి.



తుంగభద్ర జలాశయంలో నీటి మట్టం క్షీణిస్తోంది



గురువారం బెంగళూరులో కళింగర కాయల విక్రయాలు

ఇద్దరికి రూ.87 లక్షలు మస్కా

- మైసూరులో సైబర్ మోసాలు



మైసూరు: పర్యాటక రాజధానిలో ఆన్‌లైన్ మోసాలు దడ పుట్టిస్తున్నాయి. చదువుకున్న వారు ఇట్టే బలవుతున్నారు. సైబర్ మోసగాళ్ల మాటలు నమ్మి అధిక లాభాలకు ఆశ పడిన ఇద్దరు రూ.87 లక్షలను కోల్పోయారు. ఈ స్కాం మైసూరు నగరంలో జరిగింది. మొదటి కేసులో నగరంలోని బోగాది నివాసి, మహిళా టెక్కీకి వంచకులు ఓ వాట్సాప్ మెసేజ్ పంపారు. వంచకుల మాటలను నమ్మిన ఆమె నేవిగేషన్ ఆఫ్ ద కట్టింగ్ ఎడ్జ్ ఆఫ్ స్టాక్ అనే గ్రూప్‌లో చేరారు. షేరు మార్కెట్ ద్వారా డబ్బు పెట్టుబడి పెడితే లక్షలాది రూపాయలను గడించవచ్చని వంచకులు ఆమెకు ఆశ పుట్టించారు. వారి మాటలను నమ్మిన మహిళ దశలవారీగా రూ.57,81,700 వారు చెప్పిన ఖాతాకు బదిలీ చేసింది. రోజులు గడిచినా ఒక్క రూపాయి కూడా తిరిగి రాలేదు.

రిటైర్డు అధికారికి...

మరో కేసులో బోగాది టెలికాం బడావణె నివాసి, రిటైర్డ్ అధికారి వాట్సప్ ద్వారా వే టు వెల్త్ అనే గ్రూప్‌లో చేరారు. తాముచెప్పిన షేర్లు కొంటే ఇబ్బడిముబ్బడిగా లాభం వస్తుందని నకిలీ మెసేజ్‌లు పంపారు. బాధితుడు ప్రలోభానికి గురై దుండగులు చెప్పిన ఖాతాకు రూ.21.60 లక్షలను బదిలీ చేసి మోసపోయాడు. ఫిర్యాదుల మేరకు సైబర్ క్రైం పోలీసులు కేసులు దర్యాప్తు చేపట్టారు.

యువ జంట అనుమానాస్పద మృతి

- చిక్కమగళూరు జిల్లాలో మృతదేహాలు



మధు



పూర్ణిమ (ఫైల్)

యశవంతపుర: యువతీ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన చిక్కమగళూరు తాలూకా దాసరహళ్లివద్ద వెలుగు చూసింది. మృతులను శివమొగ్గ జిల్లా భద్రావతికి చెందిన మధు, మాగడికి చెందిన పూర్ణిమగా గుర్తించారు. పూర్ణిమ శవం కారులో, మధు మృతదేహం కారుకు కొద్ది దూరంలో చెట్టుకు వేలాడుతూ ఉంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో చిక్కమగళూరు రూరల్ పోలీసులు వెళ్లి పరిశీలించారు. పూర్ణిమ గొంతుపై పిసికి చంపిన ఆనవాళ్లు ఉన్నాయి. కాగా మధు బెంగళూరులో కారు డ్రైవర్‌గా, పూర్ణిమ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తుంది. మధు నాలుగైదు ఏళ్ల నుంచి పూర్ణిమా ఇంటికి సమీపంలో బాడుగ ఇంటిలో ఉంటున్నాడు. పూర్ణిమా కుటుంబంతో విశ్వాసంగా మెలిగేవాడు. ఎనిమిది నెలల క్రితం పూర్ణిమ సోదరి వివాహంలోనూ మధు అన్నీ తానై వ్యవహరించాడు. పూర్ణిమా శివమొగ్గకు వెళ్లిన సమయంలో మధు ఇంటికి వెళ్లింది. బుధవారం సాయంత్రం స్కూల్ ముగించుకొని ఇంటికి బయల్దేరిన పూర్ణిమాను మధు తన కారులో ఎక్కించుకొని చిక్కమగళూరుకు తీసుకెళ్లాడు. అనంతరం ఏం జరిగిందో ఏమో ఇద్దరూ విగతజీవులుగా మారారు. పూర్ణిమ మెడలో ఉన్న బంగారు చైన్ మాయమైనట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. వీరు ఆత్మహత్య చేసుకున్నారా? లేక ఎవరైనా హత్య చేశారా? మధునే ఆమెను హత్య చేసి ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భార్య, ఆమె ప్రియుని నరికివేత



బాధితురాలు అరుంధతి (ఫైల్)



ఆస్పత్రిలో హతుడు కిషోర్

- ప్రియుడు హతం
- బెంగళూరులో దారుణం

కృష్ణరాజపురం: అనైతిక సంబంధాలు రక్తపాతానికి కారణమవుతున్నాయి. తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని ఆమె భర్త కత్తితో ఇద్దరిపై దాడి చేశాడు. ప్రియుడు హతం కాగా, భార్య చావు బతుకుల్లో ఉంది. బెంగళూరు మహాదేవపుర పరిధిలోని కాడుగోడి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు.. నిందితుడు యల్లప్ప. ఇతని భార్య అరుంధతి. మరో వ్యక్తి కిషోర్. కిషోర్ తన భార్యతో గొడవపడి కొన్నినెలలుగా వేర్వేరుగా ఉంటున్నారు. ఈ సమయంలో అతడు అరుంధతితో అనైతిక సంబంధం పెట్టుకున్నాడు. ఇది చూసి యల్లప్ప సహించలేకపోయాడు. ఇంట్లో ఇద్దరూ కలిసి ఉన్న సమయంలో కత్తితో విరుచుకుపడ్డాడు. కిషోర్‌ను గొంతు కోశాడు. భార్యను కత్తితో పొడిచి పరారయ్యాడు. స్థానికులు ఇద్దరినీ ఆస్పత్రికి తరలించగా కొంతసేపటికే కిషోర్ చనిపోయాడు. అరుంధతి పరిస్థితి సీరియస్‌గా ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం.

బంగారు గొలుసు కొట్టేయాలని..



శివమొగ్గ: బంగారం రేట్లు ఆకాశాన్ని అంటడంతో దానిపట్ల వ్యామోహం కూడా పెరిగిపోతోంది. దీంతో అడ్డదారులు తొక్కేవారు ఉన్నారు. నగల షాపులో కొనుగోలుదారులుగా వచ్చి బంగారు చైన్ చోరీకి యత్నించి ఇద్దరు మహిళలు దొరికిపోయారు. శివమొగ్గ నగరంలోని గాంధీ బజార్ రోడ్డులో ఈ సంఘటన జరిగింది. వివరాలు..ఈ నెల 18వ తేదీన నగరానికే చెందిన ఇద్దరు మహిళలు మధ్యాహ్నం 2 గంటల సమయంలో హడావుడిగా ఓ నగల అంగడికి వచ్చారు. 15- 20 గ్రాముల బంగారు చైన్లను చూపించాలని యజమాని కిరణ్‌షా ని అడిగారు. ఆయన ఓ చైన్‌ని ట్రేలో పెట్టి ఇచ్చాడు. మహిళలు దానిని పరిశీలిస్తున్నట్లు నటిస్తూ తమతో తెచ్చిన గిల్టు చైన్‌ను ట్రేలో పెట్టి అసలు గొలుసును కొట్టేశారు. షాపు నుంచి గబగబా వెళ్లిపోతుండగా అనుమానంతో పట్టుకుని పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు అసలు చైన్‌ని యజమానికి ఇప్పించి మహిళలను అరెస్టు చేశారు.

సవతికి చిత్రహింసలు



సంగీత

బాగేపల్లి: నా భర్తకే వల వేస్తావా అని రెండో భార్యను మొదటి భార్య బంధువులు ఫాంహౌస్‌లో బంధించి చిత్రహింసలకు గురిచేసిన ఘటన గుడిబండ తాలూకా జిగానహళ్లిలో జరిగింది. బెంగుళూరులోని రాజరాజేశ్వరి నగర నివాసి గంగరాజు తన అమ్మమ్మ గారి ఊరైన జిగానహళ్లికి వచ్చివెళ్తుండేవాడు. తన అక్క తరపు బంధువులైన రాజేశ్వరిని ప్రేమించి పెళ్లాడాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. అయినా గంగరాజు బెంగళూరుకు చెందిన సంగీత అనే యువతిని కూడా ప్రేమించి మూడు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. సంగీత, గంగరాజు బుధవారం జిగానహళ్లికి వచ్చారు. ఈక్రమంలో మొదటిభార్య బంధువులు సంగీతను ఫాంహౌస్‌లో బంధించి హింసించారు. పోలీసులు వచ్చి సంగీతను రక్షించి నిందితులను అరెస్టు చేశారు. సంగీత మొహం గుర్తుపట్టలేనంతగా గాయపడింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

రవి- లక్ష్మి కేసులో వాదనలు

శివాజీనగర: గత డిసెంబర్‌లో బెళగావి సువర్ణసౌధలో బీజేపీ ఎమ్మెల్సీ సీ.టీ.రవి, మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌ను అసభ్యంగా దూషించారనే కేసును రద్దు చేయాలని సీటీ రవి హైకోర్టులో గతంలో పిటిషన్ సమర్పించారు. గురువారం విచారణ జరిగింది. అసెంబ్లీలో మాట్లాడిన మాటలపై కేసులు పెట్టలేరు అని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని రవి వకీళ్లు వాదించారు. లక్ష్మీ హెబ్బాళ్కర్ అంటే గౌరవముందని తెలిపారు. కానీ సీటీ రవి సభా వాయిదా పడిన తరువాత మాట్లాడిన మాటలకు రక్షణ లేదని ప్రభుత్వం తరఫు న్యాయవాది పేర్కొన్నారు. అభ్యంతరం సమర్పించేందుకు లక్ష్మీ తరఫు న్యాయవాది గడువు కోరారు. జడ్జి విచారణను ఫిబ్రవరి 24కు వాయిదా వేస్తూ, విచారణపై ఉన్న స్టేను పొడిగించారు.

కొత్త కారులో కుంభమేళాకు వెళ్తూ..

- హాసన్‌వాసి దుర్మరణం



మృతుడు నితిన్ (ఫైల్)

యశవంతపుర: కుంభమేళాకు వెళుతుండగా కారు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. హాసన్ జిల్లా శ్రవణ బెళగోళ తాలూకా కుంభేనహళ్లివాసి నితిన్ అలియాస్ యశ్ (32) మృతుడు. ఈ నెల 15న నితిన్ కొత్తకారును కొన్నాడు. 16న కుటుంబంతో కలిసి యూపీలోని కుంభమేళాకు బయల్దేరారు. కాశీలో దర్శనాలు చేసుకుని గురువారం ఉదయం ప్రయాగరాజ్‌కు వెళుతున్నారు. వారణాసి వద్ద వీరు ప్రయాణిస్తున్న కారును కంటైనర్ లారీ ఢీకొంది. కారు నుజ్జునుజ్జు కాగా, కారులోని ప్రజ్వల్, హరీశ్, శకుంతల గాయపడ్డారు. నితిన్ చనిపోగా, అతని తల్లి పుష్పలతకు తీవ్ర గాయాలై ప్రాణాపాయంలో ఉంది. స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. స్వగ్రామంలో విషాదం నెలకొంది.

రైలు ఢీకొని ముగ్గురు మృతి

దొడ్డబళ్లాపురం: అనుమానాస్పద రీతిలో ముగ్గురు యువకులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. వేగంగా వస్తున్న రైలు తగిలి విగతజీవులయ్యారు. ఈ దుర్ఘటన దొడ్డ తాలూకా పరిధిలోని సిద్ధేనాయకనహళ్లి వద్ద చోటుచేసుకుంది. ఉత్తర భారతదేశం నుంచి వలస వచ్చి ఇక్కడ కార్పెంటర్లుగా పని చేసుకుంటూ, ముత్తూరులో అద్దె గదిలో నివసిస్తున్న రాహుల్, లల్లన్, బినీత్ మృతులు. వీరి వయస్సు 25- 30 ఏళ్ల మధ్య ఉంటుంది. బుధవారం రాత్రి కొనఘట్ట గ్రామంలో పని ముగించుకుని ఆటోలో తిరిగి వచ్చారు. సిద్ధేనాయనహళ్లి వద్ద ఆటో దిగి రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా పుట్టపర్తి-బెంగళూరు మధ్య సంచరించే రైలు వేగంగా వచ్చి ఢీకొంది. రైలుకి దగ్గరగా వెళ్లి సెల్ఫీ తీసుకోవాలనుకున్నారని, ఈ సమయంలో రైలు ఢీకొని దూరంగా ఎగిరిపడ్డారని స్థానికుల సమాచారం. లేదా ఆత్మహత్య చేసుకున్నారా, పట్టాలపై వస్తుంటే రైలు ఢీకొందా అనే అనుమానాలు ఉన్నాయి. యశ్వంతపుర రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాలను ఆస్పత్రికి తరలించి కుటుంబీకులకు సమాచారం అందించారు.

‘బ్రాండ్ బెంగళూరుకు’ దారి.. నమ్మ రోడ్లు



బెంగళూరులో సేవలందించే వివిధ బీఎంటీసీ బస్సుల నమూనాలు



బెంగళూరు నగరం ఇలా ఉంటుందా.. మ్యాప్‌ను చూస్తున్న బడిబాలలు

- బ్రోచర్ ఆవిష్కరణలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

బనశంకరి: బ్రాండ్ బెంగళూరు నినాదంలో భాగంగా బెంగళూరు నగరంలో రోడ్లు ఎక్కువ కాలం మన్నేలా ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని డిప్యూటీసీఎం డీకే.శివకుమార్ అన్నారు. బీబీఎంపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన నమ్మరోడ్డు-2025 సెమినార్‌ను డిప్యూటీ సీఎం ప్రారంభించి మాట్లాడారు. నమ్మరోడ్డు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రజల సలహాలతో కూడిన బుక్‌లెట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్ల పక్కన మొక్కలు ఎక్కడ నాటాలి, విద్యుత్ స్తంభాలు, మెయిన్‌రోడ్లు ఎలా ఉండాలి, ఫుట్‌పాత్ మార్గాలు ఎలా నిర్మించాలి, ప్రజలు ఎలాంటి నిబంధనలు పాటించాలి, బస్టాండ్ల నిర్మాణం, మెట్రో పిల్లర్లు, సర్కిల్స్ ఆధునీకరణకు బుక్‌లెట్ ద్వారా సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు.

ఆ వైర్లను కత్తిరించాలి

బయట రోడ్లు, వీధుల్లో వేలాడుతున్న టెలికాం సంస్థల వైర్లను భూగర్భంలో అమర్చాలని సూచించినా సంస్థలు పెడచెవిన పెట్టాయని, వాటిని కత్తిరిస్తే దారికి వస్తారని డీసీఎం తెలిపారు. ప్రతిపౌరుని ఆస్తి రక్షణ కోసం కొత్త చట్టాలను తీసుకువస్తామని ఈనెలాఖరున మీడియా సమావేశం నిర్వహించి బహిర్గతం చేస్తామన్నారు. సొరంగమార్గానికి భూస్వాధీనం, ఆర్థిక, సాంకేతిక అంశాలు సవాలుగా ఉన్నాయన్నారు. నూతన మెట్రోమార్గంలో డబుల్ డెక్కర్ సంచరిస్తుందని తెలిపారు. దాదాపు 1,700 కిలోమీటర్ల మేర రోడ్లను వైట్‌టాపింగ్ వేస్తున్నామని, రాజకాలువల పక్కన కొత్తరోడ్ల నిర్మాణం, పై వంతెనల నిర్మాణం తదితర ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు ఉన్నాయని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీకేశి

కన్నడలో బోర్డులు ఉండాల్సిందే

ఎవరూ ఉన్నా లేకపోయినా మనరోడ్డు అనే బుక్‌లెట్ మార్గదర్శనం చేస్తుందని, బుక్‌లెట్‌లో ఉండే నిబంధనల ప్రకారమే పనిచేయాలని సూచించామని డీకే.శివకుమార్ తెలిపారు. కొత్త ఆలోచనలు ఇవ్వడానికి విద్యార్థులు, యువకులు ముందుకురావడం సంతోషకరమన్నారు. నామఫలకాల్లో కన్నడ భాష 60 శాతం ఉండాలని, ఇందులో ఎవరైనా తప్పుచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సులో బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్, ప్రత్యేకకమిషర్ అవినాశ్‌మెనన్ రాజేంద్రన్, బీఎంఆర్‌డీఏ కార్యదర్శి రాజేంద్రచోళన్, చీఫ్ ఇంజనీర్ ప్రహ్లాద్, డబ్ల్యూఆర్ఐ సీఈఓ మాదవపై, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.10 లక్షల విరాళం



చెక్కును ఈఓకు అందజేస్తున్న బెంగళూరు వాసులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి కర్ణాటక రాజధాని బెంగళూరులోని మార్తనహళ్లికి చెందిన ఎం.రమేష్‌రెడ్డి, చంద్రిక కుటుంబసభ్యులు రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డికి గురువారం వారు అందజేశారు. ఈ సందర్భంగా దాతల పేరుతో ఆలయంలో విశేష పూజలు నిర్వహించి స్వామి శేష వస్త్రాం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పాత పింఛన్‌పై పరిశీలన: సీఎం

శివాజీనగర: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకారం పాత పింఛన్ పథకాన్ని అమలుకు చర్యలు తీసుకొంటామని సీఎం సిద్దరామయ్య భరోసా ఇచ్చారు. గురువారం నగరంలోని ప్యాలెస్ మైదానంలో జరిగిన ఉద్యోగ సంఘాల సమావేశంలో వీడియో సమావేశం ద్వారా సీఎం మాట్లాడారు. 2006 ఏప్రిల్ 1 తరువాత ఉద్యోగం చేరినవారికి కూడా పాత పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండు ఉంది. ఉద్యోగుల డిమాండ్ల పరిశీలనకు కమిటీని నియమించాము. నివేదిక రాగానే చర్చించి అమలు చేస్తాము అని చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగుల ఆరోగ్య సేవలు, బీమా పథకాలను, రుణ పథకాలను మెరుగుపరచినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

యశవంతపుర: విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి చెందాడు. ఈ ఘటన దక్షిణకన్నడ జిల్లా పుత్తూరు తాలూకా బజత్తూరు కువెచ్చార్‌లో జరిగింది. దావాణగెరె జిల్లా జగళూరుక తాలూకా పల్లాగట్టికి చెందిన వీరభద్ర(29) కువెచ్చార్‌కు వలస వచ్చాడు. కూలీగా పనిచేస్తున్నాడు. గురువారం ఇనుపరాడ్‌తో కొబ్బరికాయలు తెంపుతుండా విద్యుత్ వైర్ తగిలి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నైజీరియన్ హత్య

- నిందితుడు అరెస్టు

దొడ్డబళ్లాపురం: సిలికాన్ సిటీలో విదేశీ డ్రగ్ పెడ్లర్ హత్య కేసులో బాగలూరు పోలీసులు నిందితున్ని అరెస్టు చేశారు. నైజీరియాకు చెందిన అడియాకో ముసాలియో (40) హతుడు. వివరాలు.. బుధవారం ముసాలియో స్నేహితునితో కలిసి బెళ్లళ్లికి వచ్చి కస్టమర్ పంపించిన లొకేషన్ వెదుకుతుండగా నిందితుడు యాసిన్ ఖాన్ అతనిని చూసి డ్రగ్స్ అమ్మడానికి వచ్చావా అంటూ గొడవ పడ్డాడు. యాసిన్ ఖాన్ పెద్ద కట్టెను తీసుకుని ముసాలియోను చావబాదాడు, అతడు పరిగెత్తుతూ కుప్పకూలి చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్టు చేశారు. అలాగే నైజీరియా రాయబార కార్యాలయానికి సమాచారం ఇచ్చారు.

బాగేపల్లిలో కన్నడనాదం



సాహిత్య సమ్మేళనంలో ప్రముఖులు

బాగేపల్లి: బాగేపల్లి పట్టణంలో తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో 7వ కన్నడ సాహిత్య సమ్మేళనం వేడుకలు ఘనంగా జరిగాయి. వేలాదిమంది కన్నడ జెండాలను పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఎస్ఎన్.సుబ్బారెడ్డి, ప్రముఖులు పాల్గొని జ్యోతి వెలిగించి సమావేశాలను ఆరంభించారు.

గ్యారంటీలకు దళితుల నిధులు: విజయేంద్ర

బనశంకరి: గత బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి మండళ్లకు వినియోగించాల్సిన సుమారు రూ.14–15 వేల కోట్లను గ్యారంటీ పథకాలకు వాడుకుందని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీవై.విజయేంద్ర ఆరోపించారు. గురువారం మల్లేశ్వరం బీజేపీ ఆఫీసులో ఆయన మాట్లాడుతూ ఇది దళిత వ్యతిరేక ప్రభుత్వమని, వేల కోట్లను గ్యారంటీలకు మళ్లించిందని దుయ్యబట్టారు. దీనిపై బీజేపీ నేతలు ప్రతి జిల్లా, గ్రామంలో పర్యటించి ప్రజలను జాగృతం చేస్తారన్నారు. ముడా కుంభకోణంలో సీఎం సిద్దరామయ్యకు లోకాయుక్త పోలీసులు ఇచ్చిన బీ రిపోర్ట్ ఆశ్చర్యం కలిగించలేదన్నారు. ముడా స్కాంలో రూ.5 వేల కోట్ల అక్రమాలు జరిగాయన్నారు. తాము మైసూరుకు యాత్ర చేస్తామని చెప్పడంతో 14 స్థలాలను తక్షణమే ముడాకు ఇచ్చేశారని అన్నారు.

విలువైన కెమెరా లెన్స్ చోరీ

హొసపేటె: తుంగభద్ర జలాశయం పోటు జలాల ప్రాంతంలోని గుండా అడవి సమీపంలో నిలిపి ఉన్న కారు అద్దాలు పగులగొట్టి ప్రీ వెడ్డింగ్ ఫోటో షూట్‌కు ఉపయోగించే కెమెరా లెన్స్‌లను దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన గురువారం జరిగింది. రూ.4 లక్షల విలువైన కెనాన్ ఆర్ 5 కెమెరా, లెన్స్ చోరీకి గురయ్యాయి. కెమెరా, లెన్స్ రాయచూరు జిల్లాలోని మాన్వికి చెందిన ఫోటోగ్రాఫర్ హుమయూన్‌కు చెందినవని పోలీసులు తెలిపారు. హుమయూన్ ఏపీ–40 ఏఎం –5041 నంబరుగల కారులో కెమెరా, లెన్స్ పెట్టుకొని ఫోటో షూట్ చేస్తున్నాడు. కారు వద్ద ఎవరూ లేకపోవడంతో అద్దాన్ని పగలగొట్టి కెమెరా, లెన్స్ చోరీ చేశారు. ఘటనపై మరియమ్మనహళ్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి నిందితుల ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

మహిమాన్విత ఆలయం.. సమస్యల నిలయం

- దత్తాత్రేయుడు కొలువైన పుణ్యక్షేత్రం గాణగాపుర
- అస్తవ్యస్తంగా రోడ్లు, లోపించిన పరిశుభ్రత



ఆలయంలో స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఆలయం వద్ద ప్రధాన వీధిలో లోపించిన పరిశుభ్రత



ఆలయ వీధిలో పడిన చెత్తచెదారం, చిత్తు కాగితాలు

సాక్షి,బళ్లారి: నిత్యం వేలాది మంది భక్తులతో కిటికిటలాడే మహిమాన్విత పుణ్యక్షేత్రంలో మౌలిక సదుపాయాలతో పాటు స్వచ్ఛత కరువు కావడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భక్తులకు కొంగుబంగారంగా పిలవబడే ఈ క్షేత్రానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. మాఘ మాసంలో ప్రతి ఏటా భక్తుల సందడి పెరిగే ఈ ఆలయం విశిష్టత, చరిత్రను పరిశీలిస్తే...

యోగమార్గ శిక్షణ, సన్యాసాశ్రమ ధర్మాచరణ, భక్తి మార్గ పరిరక్షణ అనే మూడు అంశాలు నేపథ్యంగా ఆవిష్కారమైన త్రిమూర్తుల అంశావతార మహాపుణ్యక్షేత్రమైన గాణగాపుర ప్రతి నిత్యం భక్తుల సందడితో విరాజిల్లుతోంది. గురువులకే ఆది గురువైన దత్తాత్రేయుడు దివ్య నిర్గుణపాదుకలను దర్శించుకోవడానికి భక్తుల పరంపరం కొనసాగుతోంది. మహావిష్ణువు దశావతరాల పరంపరలో భాగంగా అత్రి, అనసూయ దంపతులకు మార్గశిర పౌర్ణమి రోజున శ్రీహరి దత్తాత్రేయుడుగా జన్మించారని పురాణాలు చెబుతున్నాయి. అంతేకాకుండా త్రిమూర్తుల అంశావతారమని కూడా పురాణాలు ఘోషిస్తున్నాయి. దత్తాత్రేయ క్షేత్రంలో నిత్యం దిగంబర..దిగంబర.. శ్రీపాదవల్లభ దిగంబర అంటూ భక్తులు వేనోళ్ల కీర్తించుకునే గురుదైవం దత్తాత్రేయుల వారి నిండైన విగ్రహాలు గాణాపురలో వెలసి ఉన్నాయి.

కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్వితుడు

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురిని ఏకకాలంలో దర్శించుకుంటున్నామా అని భక్తులు పరవశించిపోయే మహాపుణ్యక్షేత్రమిది. దత్తాత్రేయుడి పాదుకలను దర్శించుకోవడానికి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి నిత్యం వచ్చే భక్తులతో కిటకిటలాడుతోంది. దివ్యపాదుకలతో పాటు కల్లేశ్వర ఆలయం, సంగమ భీమా దర్శనాలు ఇక్కడి విశేషం. శ్రీదత్త శరణం మమా అంటూ నిత్యం ఇక్కడ స్మరించుకోవడానికి భక్తులు తరలివస్తుంటారు. దత్తక్షేత్రంగా ప్రసిద్ధిపొందిన గాణగాపురలో ఉడిపిలో శ్రీకృష్ణుని దర్శనం మాదిరిగానే దత్తాత్రేయుడు శ్రీగురు పాదుకలను ఒక గవాక్షంలో దర్శనం చేసుకుంటూ భక్తులు పునీతులవుతుంటారు. భీమ, అమర్జా అనే రెండు నదుల సంగమం కూడా ఇక్కడ ఉంది. దత్తాత్రేయుడి రెండో అవతారమైన శ్రీనరసింహస్వామి రూపం అని కూడా భక్తుల నమ్మకం. సంగమ భీమా దర్శనం, ఏకగవాక్షి ద్వారా శ్రీగురు పాదుకలను, శ్రీకల్లేశ్వర, శనిమందిరం, శ్రీఆంజనేయ స్వామి, పంచముఖ గణపతిని, అశ్వర్థ వృక్షాన్ని, నరసింహ సరస్వతి ఆలయం, మేడిచెట్టును దర్శించుకునే శ్రీదత్తాత్రేయ ఆలయం కలబుర్గి జిల్లా అఫ్జల్‌పుర తాలూకాలోని గాణగాపురలో వెలసి ఉంది.

ఆలయ పరిసరాల్లో భక్తుల పాట్లు

దత్తాత్రేయ ఆలయ పరిసరాల్లో సమస్యలు తిష్ట వేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాక్షాత్తు బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరులు కొలువుదీరారని భక్తులు విశ్వసించే, పురాణాలు ఘోషించే శ్రీదత్తాత్రేయ ఆలయ ముఖ ద్వారం ముందే రోడ్డు గుంతలమయంగా కనిపిస్తోంది. శ్రీకల్లేశ్వర, శనిమందిరానికి వెళ్లే దారి కంకర తేలి గుంతల మయంగా ఉండటంతో రెండు కిలోమీటర్ల దూరం మేర ఆలయం వద్దకు చేరుకునేందుకు నానాయాతన పడుతున్నారు. సంగమ, భీమా నదిలో స్నానాలు చేస్తే ఎంతో పుణ్యం వస్తుందని భక్తులు ఎంతో దూరం వచ్చే ఈ క్షేత్రంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో నిత్యం భక్తులు పడుతున్న ఇబ్బందులు వర్ణించలేనివి. గాణగాపుర శ్రీదత్తాత్రేయ ఆలయానికి దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులకు ఇక్కడ స్వామివారిని దర్శించుకునేందుకు క్షేత్ర పరిసరాల్లో కల్పించాల్సిన రోడ్లు, స్వచ్ఛత తదితర మౌలిక సదుపాయాలపై పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి మహామహిమాన్విత క్షేత్రంలో స్వచ్ఛత, పారిశుధ్యంపై ఆలయ కమిటీ నిర్వాహకులు, పాలకులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

డాక్టర్ అనన్యరావు మృతదేహం లభ్యం



గాలింపు అనంతరం నదిలో లభించిన డాక్టర్ అనన్యరావు మృతదేహం

సాక్షి,బళ్లారి: ప్రపంచ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న హంపీ అందాలతో పాటు చుట్టుపక్కల తుంగభద్ర నదీ తీర ప్రాంతాలను సందర్శించి రెండు రోజులు సేద తీరుదామని వచ్చిన డాక్టర్ అనన్యరావు కానరాని లోకాలకు చేరింది. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అనన్య తన స్నేహితులతో కలిసి కొప్పళ జిల్లా గంగావతి తాలూకా సణాపురం వద్ద తుంగభద్ర నదిలో బుధవారం ఉదయం కొట్టుకుపోయిన సంగతి విదితమే. రెండు రోజులుగా అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, గజ ఈతగాళ్లు ముమ్మరంగా గాలించడంతో నదిలో బండరాళ్ల మధ్యలో గురువారం డాక్టర్ అనన్య మృతదేహం లభ్యమైంది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అనన్య వీకేసీ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యురాలిగా పని చేస్తుండేది. సెలవులు రావడంతో సరదాగా గడిపేందుకు, హంపీ పరిసరాలను, తుంగభద్ర నది సోయగాలను వీక్షించేందుకు వచ్చి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై మునిరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీల కోసం ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్తులు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

క్రిష్ణగిరి: గ్రామంలో డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేయాలని పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదని మాదరసనపల్లి గ్రామస్థులు గురువారం ఉదయం సూళగిరి బీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. సూళగిరి యూనియన్‌లోని మాదరసనపల్లి గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని, ప్రధానంగా గ్రామంలో మురికి నీటి కాల్వలను ఏర్పాటు చేయాలని కోరుతూ అధికార్లకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదన్నారు. ఇళ్ల నుంచి మురుగునీరు రోడ్లపై వెళ్తూ దుర్వాసన, దోమలు, రోగాల బెడద నెలకొందని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సూళగిరి బీడీవో ఆఫీసు ముందు నిరసన తెలిపారు. సూళగిరి పోలీసులు, సంబంధిత శాఖాధికార్లు వచ్చి డ్రైనేజీల ఏర్పాటుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

అగ్నిప్రమాదంలో జొన్న పంట దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా కప్పగల్‌లో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు జొన్న పంటల రాశులకు నిప్పంటించిన ఘటన చోటు చేసుకుంది. రాజశేఖర్ గౌడ అనే రైతు తన 14 ఎకరాల పొలంలో పండించిన జొన్న పంటను గ్రామంలోని బసవణ్ణ ఆలయం సమీపంలో కుప్పగా వేశారు. అయితే ఎవరో దుండగులు కుప్పలకు నిప్పంటించారు. సమాచారం అందగానే పోలీసులు అగ్నిమాపక దళం సిబ్బందితో వచ్చి మంటలను ఆర్పారు. ప్రమాదంలో దాదాపు రూ.14 లక్షల మేర నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. తహసీల్దార్ రాజు ఫిరంగి ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఆ కేసు త్వరలో సుఖాంతం



మాట్లాడుతున్న పరిషత్ స్పీకర్ బసవరాజ హొరట్టి

హుబ్లీ: సీటీ రవి, లక్ష్మీ హెబ్బాళ్కర్ కేసు త్వరలో పరిష్కారం అవుతుందని విధాన పరిషత్ స్పీకర్ బసవరాజ హొరట్టి తెలిపారు. గురువారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ సీటీ రవి, మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ జగడం వ్యవహారం పరిషత్ విషయ నీతి నిరూపణ సమితికి పంపించాం. ఇంకా అక్కడి నుంచి నివేదిక వివరాలు అందలేదు. వీలైనంత త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అన్ని పార్టీల 8 మంది సభ్యులతో కూడిన సమితి ఏర్పాటైందన్నారు. ఆ సమితి త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేస్తుందని ఆశిస్తున్నానన్నారు. త్వరలోనే పరిష్కరించే అవకాశం ఉందన్నారు. మార్చిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో కేసును సుఖాంతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కేసుకు సంబంధించి అత్యధికంగా గడువు మేరకు అసెంబ్లీ సమావేశాల నుంచి బహిష్కరించవచ్చన్నారు. కేసుపై మాట్లాడేందుకు ఇటీవల మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్‌కు రెండు సార్లు ఫోన్ చేశాను. అయితే ఆమె ఫోన్ రిసీవ్ చేయలేదన్న రుజువులు కూడా ఆయన ఫోన్‌లో మీడియా ప్రతినిధులకు చూపించారు. కొన్ని సార్లు ఎమోషన్ అయినప్పుడు ఇలాంటి ఘటనలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. అసెంబ్లీ అయితే వాటిని అక్కడే పరిష్కరించేవాడిని, ఏదేమైనా ఈ కేసును ముగించాలి. ఎందుకంటే దీని చరిత్ర అలాగే ఉండిపోతుంది. ఈ కేసు మంచి ముగింపుతో పరిష్కారమవుతుందని అన్నారు.

ఐదోసారి అధ్యక్షురాలిగా ఎన్నిక



వాణిశ్రీ విశ్వనాథ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ తదితరులు

- వాణిశ్రీ విశ్వనాథ్‌కు అభినందనల వెల్లువ



విజయచిహ్నం చూపుతున్న సంఘం డైరెక్టర్లు, అధ్యక్షురాలు వాణిశ్రీవిశ్వనాథ్, ఎమ్మెల్యే విశ్వనాథ్

బనశంకరి: బెంగళూరులో యలహంక నియోజకవర్గంలోని సింగనాయకనహళ్లి రైతులు సేవా సహకార సంఘం అధ్యక్షురాలిగా డాక్టర్ వాణిశ్రీ విశ్వనాథ్ వరుసగా ఐదోసారి ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన ఎన్నికల్లో వాణిశ్రీ నేతృత్వంలోని 12 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, తద్వారా మరోసారి బీజేపీ కైవసం చేసుకుంది. సహకార సంఘం ఎన్నికల చరిత్రలో రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ... సహకార సంఘంలో 7 వేలమందికి పైగా డిపాజిట్‌దారులు ఉన్నారని, ఏడాదికి రూ.1,200 కోట్ల కార్యకలాపాలు నిర్వహిస్తుందని తెలిపారు. సుమారు రూ.300 కోట్లు డిపాజిట్లు కలిగిన సింగనాయకనహళ్లి సహకారసంఘం గత ఏడాది రూ.6 కోట్లు లాభం గడించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.8 కోట్ల లాభం వస్తుందని అంచనాలో ఉన్నామని తెలిపారు. సంఘం ద్వారా 12 వేలమందికి ఉచిత ఆహార ధాన్యాలను అందిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్.. నూతన అధ్యక్షురాలు, డైరెక్టర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీనేతలు ఎస్ఎస్.రాజణ్ణ, దిబ్బూరుజయణ్ణ, డీజీ.అప్పయ్యణ్ణ, చొక్కనహళ్లి వెంకటేశ్, సతీశ్ కడతనమలె, వీ.పవన్‌కుమార్, ఈశ్వర్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ప్రాణం తీసిన వీలింగ్

మండ్య: యువకుడి బైక్ వీలింగ్‌కు మహిళ బలైంది. ఈ ఘటన తాలూకాలోని చిక్కమండ్య గ్రామం వద్ద జరిగింది. గ్రామానికి చెందిన గౌరమ్మ(60) అనే మహిళ కాలి నడకన వెళ్తుండగా యువకులు రెండు బైక్‌ల్లో నాగమంగల వైపు నుంచి మండ్య వైపు వీలింగ్ చేసుకుంటూ వస్తున్నారు. బీడి కాలనీకి చెందిన అల్లాబకాష్ అనే యువకుడు గౌరమ్మను ఢీకొన్నాడు. తలకు బలమైన గాయం కావడంతో మిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. మండ్య సెంట్రల్ స్టేషన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యవసాయ అంకుర సంస్థలకు నిధులు విడుదల

బనశంకరి: వ్యవసాయ అంకుర సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.14 కోట్లు విడుదల చేసిందని, రానున్న బడ్జెట్‌లో మరిన్ని కొత్త పథకాలు అమలు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి ఎన్.చెలువరాయస్వామి తెలిపారు. గురువారం నగరంలోని ఐటీబీటీ సభాంగణంలో వ్యవసాయశాఖ, సమాచార సాంకేతిక, బయోటెక్నాలజీ శాఖల ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన అగ్రిస్మార్ట్ యాప్, 2025 –26 బడ్జెట్ ముందస్తు సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 19 జిల్లాల్లో వ్యవసాయ అంకుర సంస్థలు ఏర్పాటు అయ్యాయన్నారు. వీటికి రూ.808 లక్షల నిధులు ఖర్చుచేశామన్నారు. రూ.678 లక్షల బ్యాంకు రుణాల ద్వారా నిధులు కేటాయించామన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

హొసపేటె: ఆర్థికంగా వెనుకబడిన మహిళల సాధికారత కోసం హొసపేటె ఇన్నర్ వీల్ క్లబ్ ఎల్లవేళలా ముందుంటుందని ఆ క్లబ్ అధ్యక్షురాలు సుష్మా అన్నారు. నగరంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుట్టుమిషన్లను పంపిణీ చేసి మాట్లాడారు. డబ్బు ఉన్నవాళ్లంతా దాతలు కాదన్నారు. దానం చేసే గుణం ఉన్నవాళ్లకు మాత్రమే దానం గుణం ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో పౌర కార్మికుడి మృతి

పావగడ: పట్టణంలోని శని మహాత్మ సర్కిల్‌లో గురువారం ఉదయం 11 గంటల సమయంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ పౌర కార్మికుడు మంజునాథ్ (40) మృతి చెందాడు. సీఐ సురేశ్ తెలిపిన వివరాల మేరకు.. మృతుడు మంజునాథ్ శనిమహాత్మ సర్కిల్‌లో చెత్తను తొలగిస్తుండగా ఎస్ఎస్‌కే సర్కిల్ నుంచి ఆర్ జే సర్కిల్ వైపు వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొంది. మంజునాథ్ తలకు బలమైన గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స తర్వాత తుమకూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మృతుడి కుమార్తె నందిని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేశ్ తెలిపారు.

రేపు రాయచూరు మహోత్సవం

రాయచూరు రూరల్: నగరంలో ఈనెల 22న రాయచూరు మహోత్సవం–2025 నిర్వహిస్తున్నట్లు దాజల్ సూపర్ స్టార్ వీరేంద్ర జాలదార్, విశ్వాస్ జాలదార్ వెల్లడించారు. ఆరోజున నగరంలోని మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో రాయచూరు మహోత్సవం కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.

తాగునీరు అందివ్వకుంటే కఠిన చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ శుభ కళ్యాణ్

పావగడ: నాగేనహళ్లి గ్రామస్తులకు తాగునీరు అందివ్వకుంటే గ్రామ పంచాయతీ అధికారులపై కఠిన చర్యలు తప్పవని తుమకూరు జిల్లా కలెక్టర్ శుభ కళ్యాణ్ హెచ్చరించారు. 'నాగేనహళ్లిలో నీటి ఎద్దడి' శీర్షికతో ఇటీవల సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్.. గ్రామాన్ని పరిశీలించారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తను చూసి విస్మయం చెందారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించి గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. నీటి కొరతపై ఆరా తీశారు. వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి నీటిని అందించాలని ఆదేశించారు. జెడ్పీ సీఈఓ జి.ప్రభు, తహసీల్దార్ వరదరాజు, పీడీఓ సుదర్శన్, గ్రామ పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వజ్ఞ జయంతి



సర్వజ్ఞ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్

పావగడ: సర్వ జ్ఞానాన్ని పొందిన వచన కారుడు, యోగి వేమన సమకాలీనుడు త్రిపద కవి సర్వజ్ఞ జయంతి వేడుకలు తాలూకా కార్యాలయం మీటింగ్ హాల్ లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వరదరాజు తదితరులు సర్వజ్ఞ చిత్ర పటానికి పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 17వ శతాబ్దానికి చెందిన త్రిపద కవి సర్వజ్ఞ హావేరి జిల్లా అంబలూరు మాసూరు అనే గ్రామంలో జన్మించారని, తన వచనాలతో ఆనాడు సమాజంలో పేరుకు పోయిన సాంఘిక దురాచారాలు, మూఢాచారాలు, అసమానతలను తుద ముట్టించి సమ సమాజాన్ని నిర్మించారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజగోపాల్, కార్యదర్శి సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

అసోసియేషన్ అభివృద్ధికి కృషి

పావగడ: కర్ణాటక రాజ్య డ్రగ్స్ ఏజెంట్స్, సేల్స్‌మెన్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు, స్థానిక శాంతి మెడికల్స్ నిర్వాహకుడు గంగిసేని దేవరాజ్ గురువారం భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా అతడిని అసోసియేషన్ పదాధికారులు, సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యుల పిల్లల చదువుకు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఫార్మా క్రికెట్ లీగ్ టోర్నమెంట్ విజేతలకు ప్రథమ బహుమతులు అందించారు.

సీఎం సిద్దుపై గవర్నర్‌కు ఫిర్యాదు

శివాజీనగర: మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) స్థలాల కేసులో సీఎం సిద్దరామయ్యకు లోకాయుక్త పోలీసులు క్లీన్ చిట్ ఇచ్చారు. ఇంతలో బీజేపీ గవర్నర్ గెహ్లోట్‌కు మరో ఫిర్యాదు చేసింది. ముడా ఆస్తుల అక్రమ డినోటిఫికేషన్‌పై సిద్దరామయ్య, బసవేగౌడపై విచారణకు అనుమతి ఇవ్వాలని బీజేపీ నాయకుడు ఎన్ఆర్.రమేశ్, గెహ్లోట్‌కు లేఖ రాశారు. హిణకల్ గ్రామ సర్వే నెంబర్ 70–4ఎ స్థలాన్ని ముడా స్వాధీనం చేసుకోవడమైనది. ఈ భూమిని డినోటిఫికేషన్ చేయటంలో సీఎం చట్టాన్ని ఉల్లంఘించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు.

తాను ఆత్మహత్య చేసుకోవాలని అత్తపై నింద

బనశంకరి: అత్తను చంపడానికి మాత్రలు అడిగిన మహిళ ఆచూకీని సంజయ్‌నగర పోలీసులు కనిపెట్టారు. చౌడ్రిపాళ్యలో నివాసం ఉంటున్న ఆ మహిళను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టగా వ్యక్తిగత సమస్యలతో ఆత్మహత్య చేసుకునేందుకు తన అత్తపేరు చెప్పి మాత్రలు అడిగినట్లు వెల్లడించినట్లు తెలిసింది. కొళ్లేగాల తాలూకాకు చెందిన ఆ మహిళ నాలుగేళ్ల క్రితం ఆమె ఇదే తాలూకాలోని క్యాబ్ డ్రైవర్‌ను పెళ్లి చేసుకుంది. వీరికి ఏడాదిన్నర వయసున్న కుమార్తె ఉంది. ఆమె తన భర్తతో కలిసి చౌడ్రిపాళ్యలో నివాసం ఉంటుంది. అత్త వేరుగా ఉంటుంది. వ్యక్తిగత సమస్యలతో ఆత్మహత్య చేసుకోవాలని భావించి అవసరమైన మాత్రల కోసం గూగుల్‌లో శోధించింది. డాక్టర్ సునీల్‌కుమార్ నంబర్ తెలుసుకొని ఆయనకు ఫోన్ చేసి తన అత్త వేధిస్తోందని, ఆమెను చంపేందుకు మాత్రలు ఇవ్వాలని అడిగింది. దీంతో వైద్యుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు గాలింపు చేపట్టి ఆ మహిళను గుర్తించారు. గతంలో ఆమెకు పోలీసులు రెండుసార్లు కౌన్సిలింగ్ చేసినట్లు దర్యాప్తులో వెలుగుచూసింది. ప్రస్తుతం మరోసారి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు.

ఈడీ సమన్లపై స్టే పొడిగింపు

శివాజీనగర: ముడా కేసులో సీఎం సిద్దరామయ్య సతీమణి పార్వతి, మంత్రి భైరతి సురేశ్‌కు ఈడీ ఇచ్చిన నోటీసులపై హైకోర్టు స్టేను విస్తరించింది. ఈడీ సమన్లను రద్దు చేయాలని వారు కేసులు దాఖలు చేశారు. గురువారం న్యాయవాదుల వాదనలు సాగాయి. జడ్జి తీర్పు రిజర్వు చేస్తూ స్టేను పొడిగిస్తున్నట్లు తెలిపారు.

నిధుల దుర్వినియోగం.. ముగ్గురు అధికారుల సస్పెండ్



నాగరత్న, సిద్దప్ప, ఇబ్రహీం

రాయచూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(నరేగ) నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఆరోపణలపై జిల్లాలోని లింగసూగూరు తాలూకా వ్యవసాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు అధికారులను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆదేశాలు జారీ చేసినట్లు జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే వెల్లడించారు. లింగసూగూరు తాలూకా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరత్న, అధికారి సిద్దప్ప, సింధనూరు రైతు కేంద్రం అధికారి ఇబ్రహీంలు అవినీతిలో భాగస్వాములయ్యారని వెల్లడైన నివేదిక ఆధారంగా వాస్తవాలను గుర్తించి వారిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

బొమ్మనహళ్లి : అతి వేగం ఒక విద్యార్థి ప్రాణాలు తీసింది. మరొకరిని క్షతగాత్రుడిని చేసింది. ఈఘటన ఆనేకల్ తాలూకా చిక్కహాగడె గేట్ సమీపంలో జరిగింది. బెంగళూరులోని కగ్గళిపురకు చెందిన యశస్(25), విజయవాడకు చెందిన ప్రేమ్‌రావు అనే విద్యార్థులు బెంగళూరులోని ప్రైవేటు కళాశాలలో చదువుతున్నారు. వీరిద్దరూ మద్యం తాగి బైక్‌లో వేగంగా వెళ్తూ డివైడర్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో యశస్ మృతి చెందగా ప్రేమ్‌రావు గాయపడ్డాడు. ఆనేకల్లు పోలీసులు క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



నమూనాలు రూపొందించిన విద్యార్థులతో జెడ్పీ సీఈఓ లతా కుమారి

బొమ్మనహళ్లి : విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని బెంగళూరు నగర జెడ్పీ సీఈఓ లతా కుమారి విద్యార్థులకు సూచించారు. ఆనేకల్ పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఉన్న ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. సైన్స్, గణితం విభాగంలో విద్యార్థులు రూపొందించిన నమూనాలను తిలకించారు. అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థులు తమలో ఉన్న ప్రతిభను చాటుకుంటూ లక్ష్యాని ఏర్పరుచుకొని సాధన చేయాలన్నారు. కష్టపడి చదివి టెన్త్ ఫలితాల్లో వందశాతం ఫలితాలు సాధించాలని సూచించారు. తాలూకా పంచాయతీ ఈఓ మంజునాథ్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మంజునాథ్, విద్యాశాఖ సంయోజకులు వాణి, బీఆర్‌పీ భాస్కర్ పాల్గొన్నారు.

అడవికి నిప్పు.. ఇద్దరి అరెస్టు

మైసూరు: చామరాజనగర జిల్లా హనూరు తాలూకాలోని మలెమహదేశ్వర వన్యజీవి ధామ పరిధిలోని కొదళ్లి, బసవనగుడి సమీపంలోని అటవీ ప్రాంతంలో నిప్పంటించినట్లు ఆరోపణలపై హనూరు తాలూకా దంటళ్లి గ్రామానికి చెందిన శివకుమార్(35), బసవణ్ణ(32) అనే వ్యక్తులను అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. రామాపుర వన్యజీవి వలయం కొదళ్లి శాఖ దంటళ్లి అడవిలో మంటలు చెలరేగినట్లు సమాచారంతో సిబ్బంది వెళ్లి మంటలను ఆర్పివేశారు. ఇది ఆకతాయిల పనే అనే అనుమానంతో పై ఇద్దరినీ అరెస్ట్ చేసి జుడీషియల్ కస్టడీకి అప్పగించారు. కార్యాచరణలో వలయ అధికారి రాజశేఖర్ మూర్తి, డీఆర్ఎఫ్ఓ ఆనంద్ హలసప్ప గోళ్, గస్తీ పాలకులు రక్షిత్, సిద్దప్ప, మణికట్టి, కల్లేష్, వీరేష్, ముచ్చబావి పాల్గొన్నారు.

కవి సర్వజ్ఞ వచనాలు ఆచరణీయం



సాధనకులను సన్మానించిన దృశ్యం

గౌరిబిదనూరు: కవి, సంఘ సంస్కర్త సర్వజ్ఞ జయంతిని గురువారం తాలూకా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పుట్టస్వామి గౌడ పాల్గొని సర్వజ్ఞ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. సర్వజ్ఞ కవి తన వచనాల ద్వారా సమాజంలోని మూఢనమ్మకాలను తొలగించడంతోపాటు ప్రజల్లో చైతన్యం తెచ్చారన్నారు. చిత్రదుర్గం బసవమూర్తి కుంబార గుండయ్య స్వామి మాట్లాడుతూ కుంబార సముదాయ ప్రజలు కులవృత్తికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సాధన చేసిన కుంబార సముదాయ ముఖ్యులను సన్మానించారు. తహసీల్దార్ మహేశ్ పత్రి, కుమ్మరి వర్గం తాలూకా అధ్యక్షుడు కెఎన్ నాగరాజప్ప, ఉపాధ్యక్షుడు జి నాగరాజప్ప, సుశీలమ్మ, లక్ష్మీనారాయణప్ప, శూలపాణి, బసవరాజు పాల్గొన్నారు.

సిరిగంధంతో అలంకరణ



మారెమ్మదేవి మూలవిరాట్

బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లి నియోజకవర్గం హెచ్ఎస్ఆర్ లేఔట్ వార్డు మంగమ్మనపాళ్యలో కొలువైన గ్రామదేవత మారెమ్మదేవికి గురువారం ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వినయ్ కుమార్‌దీక్షిత్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించిన అనంతరం సిరిగంధంతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొంగొత్తగా ఆహారవీధి



హైటెక్‌సొబగులతో తీర్చిదిద్దిన వీవీ.పురం ఫుడ్‌స్ట్రీట్‌లో పానీపూరి తింటున్న సందర్శకులు



వంటకాలను ఆరగిస్తున్న నగరవాసులు

- వీవీ పురం ఫుట్ స్ట్రీట్‌కు సొబగులు
- నగరవాసులకు రుచుల విందు



వివిధ రకాలదోసెలు వేస్తున్న దృశ్యం



వంటలు తయారు చేస్తున్న దృశ్యం

బనశంకరి: సిలికాన్‌సిటీలో ఆకలితో ఉన్నవారికి, భోజన ప్రియులకు ఇష్టమైన ప్రదేశాల్లో ఒకటైన విశ్వేశ్వరపురం ఫుడ్ స్ట్రీట్ హైటెక్ సొబగులతో తీర్చిదిద్దారు. ఇక్కడి ఆహార వీధికి దశాబ్దాల చరిత్ర ఉంది. నిత్యం సాయంత్రమైతే చాలు రకరకాల వంటకాలను అందించే హోటళ్లు మొదలవుతాయి. వాటిని రుచి చూడడానికి నగరం నలుమూలల నుంచి టెక్కీలు, యువతీ యువకులు, కుటుంబాలు తరలివస్తారు. 100 రకాల దోసెలు, తెలుగు- కర్ణాటక రుచులు, ఉత్తరాది వంటకాలు, చైనీస్ ఫుడ్, మంచూరియన్ రోల్, పావ్‌బాజి, మిర్చీ బజ్జీ, పిజ్జా-బర్గర్ లాంటి నోరూరించే వంటకాలు ఒకే చోట లభిస్తాయి.

ఘుమఘుమల స్వాగతం

వీవీ పురం సజ్జన్‌రావ్ సర్కిల్ నుంచి మినర్వ సర్కిల్ మార్గంలో ఎక్కడ చూసినా వివిధ ఆహార పదార్థాలు, వంటకాల ఘుమఘుమలు నోరూరిస్తాయి. ఇక్కడ చాలా ఆహార దుకాణాలు, బేకరీలకు వందలాది సంవత్సరాల చరిత్ర కలిగి ఉంది. సజ్జన్‌రావ్ సర్కిల్ వద్ద 120 మీటర్ల పొడవు గల వీవీ.పురం ఫుడ్ స్ట్రీట్‌కు వందలాది యేళ్ల చరిత్ర ఉంది. ఈ నేపథ్యంలో బీబీఎంపీ ఇక్కడ నూతన సౌకర్యాలను కల్పించింది. కొత్త ఫుట్‌పాత్ నిర్మించారు. అక్కడక్కడ కుర్చీలు, రాతి బెంచీలను కూడా ఏర్పాటుచేశారు. నీరు నిలవకుండా డ్రైనేజీని మెరుగుపరిచారు. అలంకరణ మొక్కలను నాటారు. తడి, పొడిచెత్త ను వేర్వేరుగా వేయడానికి చెత్త బుట్టలను అమర్చారు. తాను తరచుగా ఇక్కడికి వస్తుంటానని, ఆహార పదార్థాలు నాణ్యతతో కూడుకుని ఉండటంతో పాటు తక్కువ ధరల్లో లభిస్తాయని శైలజ అనే మహిళ తెలిపారు. తరచూ విదేశీయులు సైతం ఇక్కడ భారతీయ వంటకాలను రుచి చూస్తారు.

ఘనంగా సిద్ధి వినాయక పునః ప్రతిష్ఠాపన



స్వామివారి మూలవిరాట్‌కు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పూజల్లో పాల్గొన్న ప్రముఖులు

బొమ్మనహళ్లి : ఆనేకల్ తాలూకా హెబ్బగోడి సమీపంలోని గొల్లహళ్లిలో జీర్ణోద్ధరణ చేసిన శ్రీ సిద్ధి వినాయక స్వామి పునః ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ఎస్.రాధిక కే.ఆర్.శ్రీధర్ రెడ్డి, వర్తూరు మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, బెంగళూరు నగర శాసన మండలిసభ్యుడు గోపినాథ్‌రెడ్డి సమక్షంలో స్వామి వారికి అభిషేకం, పూజలు, హోమాలు నిర్వహించారు. బీజేపినాయకులు బీటీఎం ముత్తప్ప, కోరమంగళ గోవిందరాజు, రమేష్ రెడ్డి, సరస్వతమ్మ, సరళ, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రాష్ట్ర ఫారెస్ట్ ఫోర్స్ చీఫ్‌గా మీనాక్షీనేగి



మీనాక్షినేగి

బనశంకరి: రాష్ట్ర ఫారెస్ట్ ఫోర్స్ చీఫ్‌గా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారిణి మీనాక్షీనేగి నియమితులయ్యారు. ఈ పదవిని చేపట్టిన తొలి మహిళా అధికారిణిగా ఆమె రికార్డు సాధించారు. ఆమె స్వస్థలం ఉత్తరాఖండ్. 1989 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌లో కర్ణాటక క్యాడర్ కింద ఎంపికై మూడు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నారు. బళ్లారి, మండ్య, చిక్‌మగళూరులో డీసీఎఫ్‌గా విధులు నిర్వహించారు. మీనాక్షీనేగి జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, కార్యదర్శిగా ఉన్నారు. ఆమెను కర్ణాటక ఫారెస్ట్ ఫోర్స్ చీఫ్‌గా నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. దీంతో మీనాక్షినేగిని కేంద్రప్రభుత్వ సేవలనుంచి విడుదల చేశారు.

ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడులు

గౌరిబిదనూరు: రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని పంటలు సాగు చేసి ఉత్తమ దిగుబడులు సాధించాలని జెడ్పీ మాజీ అధ్యక్షులు హోసూరు మంజునాథ్ సూచించారు. తాలూకాలోని కోటాలదిన్నె గ్రామంలో ఒక ఎరువుల కంపెనీ ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎరువుల వినియోగం, మట్టి పరీక్షలు, విత్తనశుద్ధిపై రైతులు వ్యవసాయ నిపుణులతో సలహాలు తీసుకోవాలన్నారు. మానస ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శశిధర్, సువర్ణ కర్ణాటక జనశక్తి వేదిక తాలూకా అధ్యక్షుడు నవీన్, లక్ష్మీపతి, మాచేనహళ్లి మంజునాథ,బాబు పాల్గొన్నారు.

8న లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి లతాకుమారి

గౌరిబిదనూరు: పట్టణంలోని కోర్టులో మార్చి 8న కౌటుంబిక మెగా లోక్ అదాలత్ జరుగుతుందని, కక్షిదారులు ఈ అవకాశాన్ని జిల్లా కౌటుంబిక కోర్టు జడ్జి లతాకుమారి తెలిపారు. జడ్జి బుధవారం కోర్టు ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. కుటుంబ వివాదాలు, చెక్కులు, మోటారు వాహనాల కేసులు, బ్యాంకు కేసులను ఈ సందర్భంగా పరిష్కరిస్తారన్నారు. న్యాయవాదులు సహకరించాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో జిల్లా సీనియర్ జడ్జి శిల్పా, జడ్జిలు గీతా కుంబార్, సచిన్, న్యాయవాదులు వీసీ గంగయ్య, రామచంద్రారెడ్డి, పార్శ్వనాథ్, రంగనాథ్, లింగప్ప, సీనియర్ న్యాయవాది మునిస్వామిరెడ్డి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

మైసూరు: మైసూరులోని రామకృష్ణనగర హెచ్ బ్లాక్‌కు చెందిన సీ.సవిత అనే మహిళ అదృశ్యమైనట్లు కువెంపు నగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆమెకు దాదాపు 47 ఏళ్ల వయస్సు ఉంటుంది. ఐదు అడుగుల ఎత్తు, ఎరుపు రంగు శరీర ఛాయ, గుండ్రని ముఖం, నలుపు, తెలుపు మిశ్రిత వెంట్రుకలు కలిగి కన్నడ భాషలో మాట్లాడగలదు. కుడివైపు నుదుటన పాత గాయం గుర్తు కలిగి ఉంది. ఈ మహిళ సమాచారం ఎవరికైనా తెలిస్తే 0821-2418324 లేదా 9480802247 నంబరులో సంప్రదించాలని కువెంపు నగర పోలీసులు ఓ ప్రకటనలో కోరారు.

పూజారి అనుమానాస్పద మృతి



ధనుష్(ఫైల్)

మండ్య : ఓ పూజారి అనుమానాస్పద స్థితిలో కాలువలో శవమై తేలాడు. ఈఘటన మండ్య జిల్లా మళవళ్లి తాలూకా మాగనూరు వద్ద జరిగింది నిడఘట్ట గ్రామానికి చెందిన చంద్రప్ప కుమారుడు ధనుష్(21) సామేశ్వర స్వామి ఆలయంలో అర్చక విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం తాలూకాలోని కొరెగాల గ్రామంలో ఒక ఇంటిలో పూజ కోసం బైక్‌పై వెళ్లాడు. 9.30 గంటలైనా ఇంటికి చేరలేదు. సెల్ స్విచాఫ్ అయ్యింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాలింపు చేపట్టగా కొరెగాల రోడ్డులో మూలమలుపు వద్ద సుమారు 20 అడుగులలోతులో ఉన్న కాలువలో శవమై కనిపించాడు. వాహనం కూడా కాలువలో కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదవశాత్తూ బైక్ కాలువలోకి దూసుకెళ్లి మృతి చెందాడా? ఇతర కారణాలు ఉన్నాయా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఇరు వర్గాల ఘర్షణ.. 10 మందికి గాయాలు

మైసూరు: డ్రెయినేజీ పనులకు మట్టిని నిల్వ చేసే విషయానికి సంబంధించి తాలూకాలోని ఆనందూరు గ్రామంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగి 10 మంది గాయపడ్డారు. ఆనందూరు గ్రామంలో మోరీ నిర్మాణ పనులకు గ్రాంట్ లభించింది. దీంతో పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్ తరపు వారు లారీలో ఎం.శాండ్‌ను తెచ్చి గ్రామానికి చెందిన రామేగౌడ అనే వ్యక్తి ఇంటి ముందు నిల్వ చేయబోగా, అక్కడకు వచ్చిన రామేగౌడ అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామంలో జాతర జరుగుతోందని, ఇంటి ముందు ఎం.శాండ్ వేస్తే ధూళి వస్తుందని, వేరే చోటకు తరలించాలని సూచించారు. అయితే అక్కడే ఉన్న గ్రామానికి చెందిన ప్రభాకర్ అనే వ్యక్తి ఇక్కడే ఎం.శాండ్‌ను నిల్వ చేయండి అని చెప్పడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చెలరేగి ఘర్షణకు దారి తీసింది. దీంతో 10 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారికి కేఆర్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రభాకర్‌కు తలకు గాయం కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. ఇలవాల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మహిళపై సైబర్ వల

మైసూరు: సైబర్ వంచకులు ఓ మహిళను మోసగించి నగదు కొల్లగొట్టారు. నగరంలోని కృష్ణమూర్తిపురానికి చెందిన ఓ మహిళకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తాను ముంబై పోలీసు అధికారిని చెప్పాడు. మీరు అక్రమ ఆర్థిక వ్యవహారాల్లో పాలుపంచుకున్నారని ఆమెను బెదిరించాడు. కేసు నుంచి బయటపడేందుకు కొన్ని దారులున్నాయని నమ్మబలికాడు. మీ ఖాతాలోని సొమ్మును తన ఖాతాలకు బదిలీ చేయాలని, కొద్ది రోజుల తర్వాత నగదు తిరిగి మీకు అందజేస్తామని చెప్పాడు. దీంతో బాధితురాలు దశల వారీగా రూ.లక్ష దుండగుడు చెప్పిన ఖాతాకు బదిలీ చేసింది. రోజులు గడిచినా స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

వాహనం పల్టీ.. ఇద్దరు కార్మికుల మృతి

యశ్వంతపుర: టైల్స్‌ను రవాణా చేస్తున్న వాహనం పల్టీ కొట్టి ఇద్దరు కార్మికులు మృతి చెందారు. ఈ ఘటన దావణగెరె జిల్లా హరిహర తాలూకా రాజనహళ్లి జాతీయ రహదారిలో కోల్కుంటి వద్ద జరిగింది. మృతులను మహదేవ(38), యరవనాగతిహళ్లికి చెందిన క్యాంప్న హనుమంత(37)గా పోలీసులు గుర్తించారు. అధిక సామర్థ్యంతో టైల్స్ తరలిస్తుండగా టైర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగింది. కార్మికులపై టైల్స్ పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. కాగా మృతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బంధువులు దావణగెరె హదడి రోడ్డులోని సిరామిక్ దుకాణం ముందు ధర్నా చేశారు. దుకాణం వద్దనే మృతదేహాలను ఉంచి బైఠాయించారు. విద్యానగర పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను శాంతింపజేశారు. మృతదేహాలను ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

యువతి ఆత్మహత్య

హోసూరు: ఊత్తంగేరి సమీపంలో ఓ యువతి ఆత్మహత్య చేసుకొంది. వివరాల మేరకు ధర్మపురి జిల్లాకు చెందిన హరిణి (20), క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి సమీపంలోని రెడ్డిపట్టి గ్రామంలో తాత ఇంట్లో ఉంటూ ప్రైవేట్ కళాశాలలో బిఎస్సీ ఫైనలియర్ చదువుతోంది. బుధవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. ఊత్తంగేరి పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

గ్రామస్తులను హడలెత్తిస్తున్న చిరుత



మృతి చెందిన గొర్రె వద్ద యజమాని జయమ్మ

దొడ్డబళ్లాపురం: మాగడి తాలూకా హులాజగల్ గ్రామస్తులను చిరుత హడలెత్తిస్తోంది. రెండు రోజుల క్రితం గుడ్డయ్య అనే రైతు తన పొలంలో పని చేస్తుండగా దాడి చేసి పరారైంది. అదృష్టం కొద్దీ గుడ్డయ్య ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. నిత్యం ఏదో ఒక చోట జీవాలపై దాడి చేసి బలితీసుకుంటోంది. గొర్రెలు, మేకలు మేతకు తోలుకు వెళ్లాలంటే యజమానులు భయపడిపోతున్నారు. బుధవారం రాత్రి కూడా జయమ్మ, వెంకటాచలయ్యలకు చెందిన మేకలు, గొర్రెల మందపై దాడి చేసి ఒక గొర్రెను హతమార్చింది. అటవీశాఖ అధికారులు స్పందించి బోను ఏర్పాటు చేసి త్వరగా చిరుతను బంధించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

గౌరిబిదనూరు: పట్టణ శివారులోని ఆదర్శ పాఠశాలలో 2025-2026 సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానించినట్లు తాలూకా విద్యాశాఖ అధికారి శ్రీనివాస మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో అర్జీలు దాఖలు చేయాలన్నారు. విద్యార్థి ఐడీ నంబరు, జాతి, ఆదాయ ప్రమాణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, మొబైల్ నంబరుతో ప్రస్తుతం చదివే పాఠశాల హెచ్ఎం సెల్ నంబరును అందులో పొందుపరచాలన్నారు. వివరాలకు సమన్వయాధికారి జి గంగిరెడ్డి 9480695125 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

హోసూరు వార్తలు..

బాలిక కిడ్నాపర్ అరెస్టు

కెలమంగలం: ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను కిడ్నాప్ చేసిన యువకున్ని డెంకణీకోట మహిళా పోలీసులు అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేశారు. వివరాల మేరకు డెంకణీకోట సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక పదవ తరగతి వరకు చదువుకొని ఇంట్లో ఉంటోంది. 13వ తేదీ నుంచి బాలిక కనపడలేదని తల్లిదండ్రులు మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరుపగా అదే గ్రామానికి చెందిన శ్రీధర్ (22) కిడ్నాప్ చేసినట్లు తెలిసింది. నిందితున్ని అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేశారు.

హైవేపై పడ్డ బండరాళ్లు



రోడ్డుపై పడిన గ్రానైట్ రాళ్లు

హోసూరు: హోసూరు - క్రిష్ణగిరి హైవేలో లారీలో తరలిస్తున్న పెద్ద పెద్ద గ్రానైట్ రాళ్లు జారి రోడ్డుపై పడిపోయాయి. హోసూరు నుంచి క్రిష్ణగిరి వైపు తరలిస్తుండగా పేరండపల్లి వద్ద ఈ ప్రమాదం ఏర్పడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో వాహన సంచారం లేకపోవడంతో పెద్ద ముప్పు తప్పింది. గంట పాటు వాహనాలకు ఆటంకం ఏర్పడింది. హడ్కో పోలీసులు వచ్చి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు.

ఇద్దరు బైకిస్టులు దుర్మరణం

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి ప్రాంతంలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు చనిపోయారు. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా పెద్దనపల్లి సమీపంలోని వేడియంబట్టి గ్రామానికి చెందిన గోవిందన్ (60), బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనంలో తిరువణ్ణామలై రోడ్డుపై వెళుతుండగా లారీ ఢీకొనడంతో మరణించాడు. అలాగే సుండేకుప్పం సమీపంలోని గొల్లాపురి గ్రామానికి చెందిన అణ్ణాదురై (58), బుధవారం సాయంత్రం బైక్‌లో కావేరిపట్టణం నాలుగు రోడ్ల సర్కిల్లో వెళుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనింది. తీవ్ర గాయాలేర్పడిన అణ్ణాదురై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రైల్వే ప్రాజెక్ట్‌కు భూముల్ని లాక్కోవద్దు



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

హోసూరు బెంగళూరు చుట్టూ 287 కిలోమీటర్ల దూరం రింగ్ రైల్వే ప్రాజెక్ట్ నిర్మాణానికి కేంద్ర రైల్వే శాఖ, కర్ణాటక ప్రభుత్వం చర్యలు చేపట్టాయి. ఈ ప్రాజెక్ట్‌లో హోసూరు తాలూకాలోని సేవగానపల్లి, దేవిశెట్టిపల్లి, జూజువాడి ప్రాంతాల్లో సుమారు 14 కిలోమీటర్ల మేర రైతుల సాగుభూములను స్వాధీన పరుచుకొంటున్నట్లు నోటీసులు జారీ చేశారని, భూముల్ని తీసుకోరాదని గురువారం ఉదయం క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి పి. బాలక్రిష్ణారెడ్డి అధ్యక్షతన పెద్ద ఎత్తున రైతులు రాజ్యసభ ఎంపి తంబిదురైకి వినతిపత్రం అందజేశారు. తంబిదురై మాట్లాడుతూ బెంగళూరు, హోసూరు జంటనగరాలుగా మారుతున్నాయని చెప్పారు. రైల్వే ప్రాజెక్ట్ కోసం రైతుల నుంచి బలవంతంగా భూములను లాక్కోవడం సాధ్యం కాదని చెప్పారు. బెంగళూరు, హోసూరు ప్రాంతాలు అనేక రంగాల్లో పురోగమిస్తున్నందున రైల్వే ప్రాజెక్ట్ పథకాన్ని ప్రవేశ పెడుతున్నారని తెలిపారు. దీనిపై కేంద్ర అధికారులకు తెలియజేస్తానని హామీ ఇచ్చారు.

లారీ ఢీ, బైకిస్టు మృతి

మైసూరు: లారీ ఢీకొని బైకిస్టు మృతి చెందిన ఘటన జిల్లాలోని నంజనగూడు తాలూకా మరడిహుండి గ్రామం వద్ద జరిగింది. నంజనగూడు తాలూకా జీమారహళ్లి గ్రామానికి చెందిన నవీన్ (20) మృతుడు. ఆయన మైసూరులో కూలి పని ముగించుకుని గ్రామానికి వస్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలై మరణించాడు. లారీ డ్రైవర్ నిలపకుండా పరారయ్యాడు. బిళిగెరె పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

క్యాంటర్ ఢీకొని కారు డ్రైవర్...

మండ్య: క్యాంటర్ వాహనం ఢీకొని కారు డ్రైవర్ మరణించిన ఘటన తాలూకాలోని రాగిముద్దనహళ్లి గేట్ వద్ద జరిగింది. మైసూరులోని పుట్టేగౌడన హుండి గ్రామానికి చెందిన శివణ్ణ(39) బెంగళూరు వైపు నుంచి మైసూరు వైపు కారులో బయల్దేరాడు. రాగిముద్దనహళ్లి గేట్ వద్ద ఓ క్యాంటర్ వాహనం సర్వీసు రోడ్డులోకి వచ్చేందుకు రివర్స్ తీసుకుంటూ కారును ఢీకొంది. ఘటనలో కారు డ్రైవర్ శివణ్ణ తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని మిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మరణించాడు. మండ్య గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సత్ప్రవర్తన కలిగిన నలుగురు ఖైదీల విడుదల

మైసూరు: సత్ప్రవర్తన ఆధారంగా నలుగురికి జైలు శిక్ష నుంచి విముక్తి కలిగింది. నగరంలోని కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న నాగేంద్ర, కుమార్, కుమార్ అలియాస్ బేటి, కుంబార్ పూణచలు పలు కేసుల్లో శిక్ష అనుభవిస్తున్నారు. మంచి నడవడిక కింద ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ నలుగురిని కేంద్ర కారాగారం చీఫ్ సూపరింటెండెంట్ పీఎస్ రమేష్ విడుదల చేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ జనజీవనస్రవంతిలో కలిసి సమాజానికి రచనాత్మక సేవలను అందించాలని సలహా ఇచ్చారు. ఇతరులకు హాని కలిగించే ఎలాంటి తప్పుటడుగులు వేయరాదన్నారు. రాబోయే రోజుల్లో ఉపాధి కల్పించుకుని ఉత్తమ జీవితం సాగించాలన్నారు. ఈసందర్భంగా జైలు అధికారులు పాల్గొన్నారు.

బాలికను బంధించి దాడి

దొడ్డబళ్లాపురం: బాలికను యువకుడు బంధించి దాడిచేసిన ఘటన హెగడె నగర్‌లోని జామియా ఆయిషా సిద్ధికి ఆల్ బనాత్ మదరసాలో చోటుచేసుకుంది. మహమ్మద్ హసన్ అలీ(19) అనే యువకుడు మదరసాలోని ప్రిన్సిపాల్‌కు దగ్గరి బంధువు. దీంతో లోపల చనువుగా తిరిగేవాడు. ఓ బాలిక బియ్యం చల్లిందనే కారణంతో గదిలో బంధించి దాడి చేశాడు. బాలిక తల్లితండ్రులు గొడవ చేయడంతో రాజీ చేయడానికి మత పెద్దలు ప్రయత్నించారు. అందుకు సమ్మతించని బాలిక తల్లితండ్రులు కొత్తనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిని అరెస్టు చేశారు. సదరు మదరసాకు లైసెన్సు కూడా లేదని, చాలామంది పిల్లలను లోపల నిర్బంధించినట్లు పోలీసులు తెలిపారు.

బసవేశ్వర జాతర



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

హోసూరు: క్రిష్ణగిరి జిల్లా వేపనపల్లి యూనియన్‌లోని ధరణిసంద్రం గ్రామంలో బుధవారం రాత్రి శ్రీ బసవేశ్వరస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి తీసుకెళ్లి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పిండిదీపాలతో ఆలయానికి చేరుకొని పూజలు జరిపించారు. కొందరు భక్తులు తలపై కొబ్బరికాయలను కొట్టించుకున్నారు.

బాల కార్మికులకు విముక్తి

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలో పనిచేస్తున్న నలుగురు బాలకార్మికులకు అధికార్లు విముక్తి కలిగించారు. కార్మిక సంక్షేమ అధికారి మాదేశ్వరన్ నేతృత్వంలో చైల్డ్‌లైన్ సిబ్బంది గురువారం కొన్ని వర్క్‌షాప్‌లలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. అక్కడ పనిచేస్తున్న నలుగురు బాలలకు విముక్తి కల్పించారు. వారితో పనిచేయిస్తున్న యజమానులకు జరిమానా విధించారు. 18 ఏళ్లు పూర్తికాని బాలలను పనిలో ఉంచుకొన్న యాజమానులకు రూ. 50 వేలు జరిమానాతో పాటు రెండేళ్ల జైలు శిక్ష తప్పదని తెలిపారు.

30 ఏళ్లు దాటినవారికి స్క్రీనింగ్

సాక్షి, అమరావతి: మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ నియంత్రణ చర్యల్లో భాగంగా 30 ఏళ్ల వయసు దాటినవారికి స్క్రీనింగ్ చేయడానికి కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మిర్చి రైతులను ఇంతలా వంచిస్తారా చంద్రబాబూ..

- రాష్ట్రంలో ఎప్పుడైనా నాఫెడ్ ద్వారా మిర్చి కొనుగోళ్లు జరిగాయా?
- అలాంటిది నాఫెడ్‌కు లేఖ రాయడమంటే రైతులను వంచించడమే
- మిర్చి రైతులకు మేలు చేసే ఉద్యాన శాఖ ప్రతిపాదనను పక్కనపెట్టింది మీరు కాదా?
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు(బారకాసు) : రాష్ట్రంలో గతంలో ఏనాడూ నాఫెడ్ ద్వారా మిర్చి కొనుగోళ్లు జరగలేదు.. అలాంటి నాఫెడ్‌కు మిర్చి రైతులను ఆదుకోవాలంటూ సీఎం చంద్రబాబు లేఖ రాయడం రైతులను వంచించడమేనని వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మిర్చి రైతులపై సీఎం చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పథకం(ఎంఐఎస్)కింద రైతులను ఆదుకోవాలని కోరేవారని చెప్పారు. రైతులను ఆదుకోవాలన్న చిత్తశుద్ధి సీఎంకు లేనందునే.. ఉద్యాన శాఖ అధికారులు చెప్పిన రూ.3,480 కోట్ల వర్కింగ్ క్యాపిటల్ గురించి పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను అడ్డుకునే ఉద్దేశంతోనే గుంటూరు మిర్చియార్డు సందర్శనలో ఏ మాత్రం భద్రత కల్పించలేదని ఆరోపించారు. జగన్ పర్యటనతోనే రైతుల సమస్యలపై ప్రభుత్వంలో చలనం మొదలైందని చెప్పారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ వైఎస్ జగన్ మిర్చి యార్డును సందర్శించి రైతులతో మాట్లాడితే కూటమి ప్రభుత్వం తట్టుకోలేకపోతోందన్నారు. రైతులకు అండగా నిలవాలని జగన్ వెళితే.. కేసులు పెడుతోందని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు గానీ, మంత్రి అచ్చెన్నాయుడు, ఇతర టీడీపీ నాయకులు గానీ నేరుగా మిర్చి యార్డుకు వెళ్లి రాగలరా.. అని కాకాణి ప్రశ్నించారు. అక్కడికి వెళితే మిర్చి రైతులు మిమ్మల్ని కారం దంచినట్టు దంచుతారని ధ్వజమెత్తారు.

ఇది వాస్తవం కాదా చంద్రబాబు..

మిర్చి రైతుల సమస్యలపై ప్రభుత్వానికి ఉద్యాన శాఖ అధికారులిచ్చిన నివేదికలో క్వింటాలుకు రూ.11,600 చొప్పున మార్కెట్ ఇంటర్‌వెన్షన్‌కింద ఇస్తూ కనీసం 25 శాతం పంటను కొనుగోలు చేయాలని, ఇందుకోసం రూ.3,480 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవుతుందని పేర్కొన్నారని కాకాణి చెప్పారు. ఆ మొత్తం భరించడానికి ఇష్టపడని సీఎం చంద్రబాబు.. ఆ ప్రతిపాదనను పూర్తిగా పక్కనపెట్టిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మిర్చికి మాత్రమే కాదు, ఏ పంటకూ గిట్టుబాటు ధర దక్కని దుస్థితి నెలకొందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని పంటలకూ మద్ద తు ధర కల్పించామని, కానీ నేడు చంద్రబాబు ఇస్తామన్నవి ఇవ్వకపోగా, గత ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలను కూడా లేకుండా చేస్తోందని కాకాణి ఆగ్రహం వ్యక్తం చేశారు.

చిరు వ్యాపారులకు షాక్

విద్యుత్ చార్జీలు పెంచడంలేదంటూనే చంద్రబాబు దొంగ దెబ్బ

టైమ్ ఆఫ్ డే టారిఫ్ పేరుతో పీక్ అవర్స్‌లో చార్జీల బాదుడు

సాక్షి, అమరావతి/తిరుపతి రూరల్: వ్యాపారాలు, చిన్న పరిశ్రమలతో స్వయం ఉపాధి కల్పించుకొని, మరికొందరికి ఉపాధి కల్పిస్తున్న చిరు వ్యాపారులు, చిన్న పరిశ్రమలపై చంద్రబాబు ప్రభుత్వం దొంగ దెబ్బ కొట్టింది. ఓ పక్క విద్యుత్ చార్జీలు పెంచడంలేదని చెబుతూనే.. వీరిపై టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టీఓడీ) పేరుతో పీక్ అవర్స్‌లో అదనపు విద్యుత్ చార్జీల భారం మోపుతోంది. అంటే విద్యుత్ ఎక్కువగా వాడే ఉదయం, సాయంత్రం సమయాల్లో అదనపు చార్జీలు పడతాయి. చిన్న షాపుల్లో సాయంత్రం వేళ వ్యాపారం జరిగినా, జరగకపోయినా కరెంటు చార్జీలు మాత్రం భారీగా పడతాయి. ఈ సమయాల్లో లోడ్‌నుబట్టి యూనిట్‌కు 50 పైసల నుంచి 1 రూపాయి వరకు అదనపు భారం పడనుంది. ఏప్రిల్ 1 నుంచి కొత్త టారిఫ్‌లు అమల్లోకి రానున్నాయి.

ఇక బాదుడు మామూలుగా ఉండదు

అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూ అప్, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల నుంచి అత్యధికంగా విద్యుత్ చార్జీలు వసూలు చేస్తూ రూ.15,485 కోట్ల విద్యుత్ చార్జీల భారం వేసిన చంద్రబాబు సర్కారు.. ఇప్పుడు సమయాన్ని బట్టి బాదుడు మొదలెట్టింది. ఇన్నాళ్లూ హై టెన్షన్ (హెచ్‌టీ) కనెక్షన్ ఉన్న పెద్ద పరిశ్రమలకు మాత్రమే అమలులో ఉన్న టైమ్ ఆఫ్ డే టారిఫ్ చార్జీలను ఇకపై లో టెన్షన్ (ఎల్‌టీ) పరిశ్రమలు, వాణిజ్య సర్వీసులకూ అమలు చేయనుంది. ఈ మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరం రిటైల్ సరఫరా ధరలు (టారిఫ్ ఆర్డర్)ను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) గురువారం తిరుపతిలో విడుదల చేసింది. విద్యుత్ వినియోగించే సమయాన్ని బట్టి వినియోగదారులపై భారం మోపేందుకు ఏపీఈఆర్సీ అనుమతినిచ్చింది. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 'పీక్ అవర్' వినియోగంలో ఒక విధంగా, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 'ఆఫ్ పీక్ అవర్'లో మరో విధంగా చార్జీలు వసూలు చేస్తారు. మిగతా సమయంలో ఇప్పుడున్న చార్జీలే వర్తిస్తాయి. ఈమేరకు చార్జీల వసూలుకు డిస్కంలు చేసిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఎఆర్ఆర్) ప్రతిపాదనలకు ఏపీఈఆర్సీ ఆమోదం తెలిపింది. గ్రిడ్ డిమాండ్ ఎక్కువగా ఉండే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో చార్జీలు మరింతగా పెంచి విద్యుత్ బిల్లుల్లో వేయనున్నారు. పైగా ఇదీ కిలోవాట్ల లెక్కన లోడ్‌నుబట్టి మారిపోతుంది. అంటే 11 కేవీ, 33 కేవీ, 132 కేవీ, 220 కేవీ లోడ్ ప్రకారం చార్జీ పడుతుంది. ఏమాత్రం లోడ్ పెరిగినా బిల్లు భారీగా పెరుగుతుంది.



టారిఫ్‌ను విడుదల చేస్తున్న ఏపీఈఆర్సీ ఇన్‌చార్జి చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్, సభ్యుడు వెంకట్రామరెడ్డి

టారిఫ్ ఆర్డర్‌లోని మరికొన్ని నిర్ణయాలు

- ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు సమర్పించిన ఏఆర్ఆర్ ప్రకారం.. ఆదాయ అవసరం రూ.57,544.17 కోట్లను ఏపీఈఆర్సీ ఆమోదించింది. ఇది డిస్కంలు అడిగిన దానికంటే రూ.1,324.35 కోట్లు మాత్రమే తక్కువ. మొత్తం ఆదాయం రూ.44,323.30 కోట్లుగా నిర్ణయించింది.
- రూ.12,632.40 కోట్ల ఆదాయ అంతరాన్ని ఆమోదించింది. ఇది డిస్కంలు దాఖలు చేసినదానికంటే రూ.2,050.86 కోట్లు తక్కువ.
- రాష్ట్ర ప్రభుత్వం రూ.12,632.40 కోట్ల ఆదాయ అంతరాన్ని సబ్సిడీగా భరించేందుకు అంగీకరించింది.
- ఎంపిక చేసిన వర్గాలకు ఉచిత విద్యుత్, రాయితీలు కొనసాగుతాయి.
- రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలోని జెన్‌కోలు దిగుమతి చేసుకున్న బొగ్గు రవాణాకు రైలు, సముద్ర మార్గాలను వినియోగించుకోవచ్చు.
- స్వల్ప కాలిక విద్యుత్ అవసరాల కోసం తొలిసారిగా అవర్లీ డిస్పాచ్‌ను తీసుకువచ్చింది.
- ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇళ్లను నిర్మించుకునే లేదా పునర్నిర్మించే వ్యక్తులు వాణిజ్య టారిఫ్‌కు బదులుగా డొమెస్టిక్ టారిఫ్ బిల్ చెల్లించుకోవచ్చు.
- స్థిరమైన టారిఫ్‌లు గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ వినియోగదారులకే కాకుండా ఓపెన్ యాక్సెస్ వినియోగదారులకూ వర్తిస్తాయి.
- 150 కేడబ్ల్యూ వరకు కనెక్ట్ చేసిన ఈవీ ఛార్జింగ్ స్టేషన్లకు ఎల్‌టీ వోల్టేజ్ స్థాయిలో విద్యుత్ సరఫరా చేయడానికి ఆమోదం. డిమాండ్ చార్జీలు లేకుండా ఈవీల టారిఫ్ యూనిట్‌కు రూ.6.70 వసూలు చేస్తారు.

కొత్తగా అదనపు లోడ్ క్రమబద్ధీకరణ పథకం

డెవలప్‌మెంట్ చార్జీల్లో 50 శాతం చెల్లించడం ద్వారా గృహ వినియోగదారులు అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించే పథకాన్ని ఏపీఈఆర్సీ ఆమోదించింది. ఈ పథకం 2025 మార్చి 1 నుంచి 2025 జూన్ 30 వరకు అమలులో ఉంటుంది. ఆన్‌లైన్ విండో ద్వారా వినియోగదారులు స్వచ్ఛందంగా అదనపు లోడ్‌లను ప్రకటించవచ్చు. డిస్కంలు అదనపు లోడ్‌లను క్రమబద్ధీకరిస్తాయి. డెవలప్‌మెంట్ ఛార్జీల్లో 50 శాతం వసూలు చేస్తాయి. అదనపు లోడ్ కోసం సెక్యూరిటీ డిపాజిట్లు కూడా సేకరిస్తాయి. ఈ అవకాశం ఒకసారి మాత్రమే ఉంటుంది.

డిమాండ్‌కు సరిపడా సరఫరా చేయాలి

ఈ వేసవిలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 260 మిలియన్ యూనిట్లకు పెరిగే అవకాశం ఉన్నందున ఎలాంటి కోతలు లేకుండా సరఫరా చేయాలని డిస్కంలను ఏపీఈఆర్సీ ఇన్‌చార్జి చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ ఆదేశించారు. తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గృహావసరాలకు అవసరమైన అదనపు లోడ్లను డిస్కంల పరిధిలో క్రమబద్ధీకరించి కోతలు లేకుండా చూడనున్నట్లు చెప్పారు. ఇప్పుడు వాడుతున్న విద్యుత్‌కు అదనంగా విద్యుత్ అవసరమని అంచనా వేశామన్నారు. స్మార్ట్ మీటర్లు ఎక్కడా ఏర్పాటు చేయడంలేదని, వాటిని ఇంకా ఆమోదించలేదని, ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టును మాత్రమే ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం విద్యుత్ వాడకం పెరుగుతుండడంతో అందుకు తగినట్లుగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు. ఏపీఆర్సీ సభ్యుడు వెంకట్రామరెడ్డి, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ ప్రాణాలకు ముప్పు

- కేంద్ర బలగాలతో రక్షణ కల్పించండి
- వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్ రెడ్డి
- ప్రధాని, హోంమంత్రికి లేఖలు

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ సీఎం వైఎస్ జగన్‌కు రక్షణ కల్పించడంలో ఏపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్ష నేత, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం విధానాలతో జగన్ ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరు మిర్చి మార్కెట్ యార్డ్ పర్యటనకు వెళ్లిన జగన్‌కు పోలీసులు రక్షణ కల్పించలేదని విమర్శించారు. జగన్ పర్యటనలో తీవ్ర భద్రతా వైఫల్యం తలెత్తిందన్నారు. ఈ మేరకు గురువారం ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షాలకు వేర్వేరుగా లేఖలు రాశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని జెడ్ ప్లస్ సెక్యూరిటీ కేటగిరీలో ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్‌కు కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. అంతేగాక ఇటీవల వైఎస్ జగన్ నివాసం వద్ద కొన్ని ఘటనలు జరిగాయని... ఇవి భారీ ఎత్తున పన్నిన కుట్రలో భాగమేనన్న అనుమానం లేఖలో వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ ప్రాణాలకు ముప్పు తెచ్చే విధంగా భద్రతా వైఫల్యం కనిపిస్తోందని, ప్రజాస్వామ్య విధానాలకు తూట్లు పొడిచేలా ప్రమాదకర ధోరణికి కూటమి ప్రభుత్వం తెరలేపుతోందని ప్రధాని మోదీకి రాసిన లేఖలో ఎంపీ మిథున్‌రెడ్డి పేర్కొన్నారు.

దురుద్దేశంతోనే జగన్‌కు భద్రత కల్పించలేదు

- గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ
- శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ వెల్లడి

సాక్షి, అమరావతి: జెడ్ ప్లస్ కేటగిరీలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు పర్యటనలో ఆయన భద్రతను ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా తొలగించడంపై వైఎస్సార్‌సీపీ నేతల బృందం గవర్నర్‌కు ఫిర్యాదు చేసింది. మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, వెలంపల్లి శ్రీనివాస్, కారుమూరు నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్ తదితరులతో కూడిన బృందం గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిసింది. వైఎస్ జగన్ పర్యటనల్లో ప్రభుత్వం ఆయనకు ఏ మాత్రం భద్రత కల్పించడం లేదని ఫిర్యాదు చేసింది. బుధవారం గుంటూరు మిర్చి యార్డు సందర్శన సందర్భంగా జగన్‌కు ప్రభుత్వం ఏమాత్రం భద్రత కల్పించకపోవడాన్ని ప్రస్తావించింది. ఇకనైనా జగన్‌కు రక్షణ కల్పించాలని, ఇటువంటిది పునరావృతం కాకుండా విచారణకు ఆదేశించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేసింది.

అనంతరం బొత్స సత్యనారాయణ రాజ్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి అయిన వైఎస్ జగన్‌కు పోలీసులు భద్రత తొలగించడంపై గవర్నరే ఆశ్చర్యపోయారని తెలిపారు. తక్షణం దీన్ని పరిశీలిస్తామని, విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. గవర్నర్ స్పందించిన తీరు సంతృప్తికరంగా ఉందన్నారు. మిర్చికి ధర లేక నష్టపోతున్న రైతులకు ప్రభుత్వం నుంచి అందుతున్న సాయంపై ఆరా తీసేందుకు గుంటూరు వెళ్లిన జగన్‌కు జెడ్ ప్లస్ భద్రతను ఉద్దేశపూర్వకంగానే పోలీసులు తొలగించారని చెప్పారు. అక్కడ యూనిఫాంతో ఒక్క కానిస్టేబుల్ కూడా లేరని తెలిపారు. ఈ ప్రభుత్వం జగన్‌ను ఏం చేయాలనుకుంటుందో అర్థం కావడం లేదని అన్నారు. చంద్రబాబుపట్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏనాడూ ఇలా వ్యవహరించలేదన్నారు. కానీ కూటమి ప్రభుత్వం దురుద్దేశంతోనే ఇలా చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల కోడ్‌కు, బందోబస్తుకు సంబంధం లేదని, మాజీ సీఎం జగన్‌కు అన్ని సందర్భాల్లో జెడ్ ప్లస్ భద్రత వర్తిస్తుందని వివరించారు. ఒకవేళ ఎన్నికల కోడ్ కారణంగా జెడ్ ప్లస్ భద్రత కుదరదనుకుంటే ముందుగా సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత పోలీసులకు లేదా అని ప్రశ్నించారు. ఇదే ఎన్నికల కోడ్ విజయవాడలో సంగీత విభావరికి ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు.

ఏదైనా జరిగితే వారు బాధ్యులు కారా?

జగన్‌కు ఏమాత్రం సెక్యూరిటీ ఇవ్వొద్దని గుంటూరు ఐజీ, ఎస్పీకి ప్రభుత్వ పెద్దలు సూచించినట్లు తమకు సమాచారం ఉందని బొత్స చెప్పారు. భద్రత లేకపోతే ఏదైనా జరిగితే దానికి ఐజీ, ఎస్పీలు బాధ్యులు కారా అని ప్రశ్నించారు. చట్టాలను అమలు చేయాల్సిన ఉన్నతాధికారులే ఇలా వ్యవహరించడం న్యాయమా అని నిలదీశారు. అనుమతి లేకుండా మిర్చియార్డుకు వెళ్ళారని పోలీసులు అంటున్నారని, ముందురోజు తాము సమాచారం ఇచ్చినప్పుడు ఎందుకు అభ్యంతరం చెప్పలేదని అన్నారు. వైఎస్ జగన్ వెళ్ళింది ఎన్నికల ప్రచారం కోసం కాదని స్పష్టం చేశారు. రూ.20 వేలు ఉన్న క్వింటా మిర్చి రూ.10 వేల దిగువకు పడిపోయి, దైన్య స్థితిలో ఉన్న రైతులకు అండగా ఉండేందుకు జగన్ వెళ్తే దాన్ని కూడా రాజకీయం చేస్తారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసాను క్రమం తప్పకుండా ఇచ్చిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా రాష్ట్రం నుంచి పైసా ఇవ్వకపోగా, కేంద్రం నుంచి వచ్చింది కూడా రైతులకు ఇవ్వలేదని తెలిపారు. తమ హయాంలో ఆర్బీకేల ద్వారా విత్తనం నుంచి విక్రయం దాకా అండగా ఉన్నామని, నేడు ఆ వ్యవస్థనే నిర్వీర్యం చేశారని, దళారీలు రైతులను దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. ఎరువులు, విత్తనాల ధరలను ఎవరూ నియంత్రించే పరిస్థితి లేదని, రాష్ట్ర రైతాంగం పరిస్థితి దయనీయంగా మారిందని చెప్పారు.

వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం

సాక్షి, అమరావతి: 2024-25 విద్యా సంవత్సరానికి మెడికల్ పీజీ స్ట్రే వెకెన్సీ కౌన్సిలింగ్‌కు వెబ్ ఆప్షన్ల నమోదుకు గురువారం ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ ఇచ్చింది. గురువారం ఉదయం 11.30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 11.30 గంటల వరకు ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించింది. స్ట్రే వెకెన్సీ కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకుని తుది మెరిట్ జాబితాలో స్థానం దక్కించుకున్నవారే ఆప్షన్ల నమోదుకు అర్హులని తెలిపింది. అందుబాటులో ఉన్న అన్ని సీట్లను అన్‌రిజర్వ్‌డ్ ఓపెన్ జనరల్ సీట్లుగా పరిగణిస్తున్నట్లు పేర్కొంది. కళాశాలల వారీగా ఖాళీగా ఉన్న 145 సీట్ల వివరాలను నోటిఫికేషన్‌లో తెలిపింది.

వైఎస్ జగన్ పర్యటనలో లేని వారిపైనా కేసులు

గుంటూరు మిర్చి యార్డుకు రాని పేర్ని నానిపై కేసులు నమోదు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మిర్చి రైతులను పరామర్శించి.. భరోసా కల్పించేందుకు గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లిన మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పర్యటనలో పాల్గొనని వారిపైనా పోలీసులు కేసులు నమోదు చేశారు. కృష్ణా జిల్లాకు చెందిన మాజీ మంత్రి పేర్ని నాని ఈ కార్యక్రమానికి హాజరవ్వకపోయినా.. ఆయనపై నల్లపాడు పోలీసులు కేసులు నమోదు చేశారు. వైఎస్ జగన్, తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, కొడాలి నాని, అంబటి రాంబాబు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కావటి మనోహరనాయుడు, మోదుగుల వేణుగోపాలరెడ్డి, పేర్ని నానితో పాటు మరికొందరిపై బీఎన్ఎస్ 223, 189(2),329(4), 292,126(2), 195(1) రెడ్‌విత్ 190 బీఎన్ఎస్, 125 ఆర్‌పీఏ 1951 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కలెక్టర్, మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి అనుమతి లేకుండా మార్కెట్ యార్డులోకి వెళ్లారని, రైతులకు, ప్రజలకు ఇబ్బందులు కలిగించారంటూ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాసరావు(ఎన్నికల ఫ్లెయింగ్ స్క్వాడ్ టీం హెడ్) ఫిర్యాదులో పేర్కొన్నారు. అసలు వైఎస్ జగన్ తన పర్యటనలో ఎక్కడా రాజకీయాలు మాట్లాడలేదు. ఎన్నికల ప్రచారం చేయలేదు. అసలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కూడా బరిలో లేరు. రైతులు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వారి గోడు వినేందుకు మాత్రమే మిర్చి యార్డుకు వెళ్లారు. ఎన్నికల కోడ్ ఉన్నందున రైతుల కష్టాలు పట్టించుకోకూడదన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

వైఎస్ జగన్ భద్రత విషయంలో ఇంత నిర్లక్ష్యమా!

వైఎస్ జగన్ పర్యటన గురించి ముందుగానే జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్పీకి కూడా సమాచారం ఉంది. అయినా జెడ్ ప్లస్ కేటగిరిలో ఉన్న వైఎస్ జగన్ భద్రతను గాలికొదిలేశారు. కనీస బందోబస్తు కూడా ఏర్పాటు చేయకుండా ఆయన ప్రాణాలకు ముప్పు కలిగేలా గుంటూరు పోలీసులు వ్యవహరించారు. ఆయన ప్రయాణించే మార్గంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేయాల్సిన బాధ్యతనూ గాలికొదిలేశారు. మార్కెట్ యార్డులో, బయట రెండు మూడు సార్లు తోపులాట పరిస్థితి ఏర్పడినా.. ప్రజలు పెద్ద ఎత్తున జగన్ వద్దకు దూసుకెళ్లినా పోలీసులు దూరంగా నిలబడి చోద్యం చూడటంపై వైఎస్సార్‌సీపీ నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బందోబస్తు ఏర్పాట్లు చేయొద్దని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని.. అందువల్లే తాము దూరంగా ఉండిపోవాల్సి వచ్చిందని పలువురు పోలీసులు చెప్పారు. ఇలాంటి పరిస్థితి తాము గతంలో ఎన్నడూ చూడలేదని వారు చెబుతున్నారు. ఈ పరిణామాలన్నీ గమనిస్తే జగన్‌పై కుట్ర జరుగుతుందన్న అనుమానం కలుగుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు.

వల్లభనేని వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత



సాక్షి, అమరావతి/విజయవాడ లీగల్: గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి కేసులో వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ గురువారం తీర్పు వెలువరించారు. తీర్పు కాపీ బయటకు రాకపోవడంతో వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేతకు కారణాలు తెలియరాలేదు. 2023 ఫిబ్రవరిలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి జరిగింది. దీనిపై ఆ పార్టీ కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పలువురిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో పోలీసులు వల్లభనేని వంశీని 71వ నిందితునిగా చేర్చారు. ఈ నేపథ్యంలో ఆయన ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు, ఈ వ్యాజ్యం పరిష్కారమయ్యేంత వరకు వంశీపై కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించిన విషయం తెలిసిందే. అటు తరువాత వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ పూర్తిస్థాయిలో విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విని తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి గురువారం తన నిర్ణయాన్ని వెలువరించారు.

తెలంగాణ

గుండెపోటుతో విద్యార్థిని మృతి

పాఠశాలకు వెళ్తుండగా విషాదం

కామారెడ్డి టౌన్/రామారెడ్డి: పాఠశాలకు వెళ్తున్న ఒక విద్యార్థిని గుండెపోటుతో మృతి చెందింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. రామారెడ్డి మండలం సింగరాయిపల్లి గ్రామానికి చెందిన అల్లే శ్రీనిధి (14) జన్మభూమి రోడ్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కామారెడ్డి కల్కినగర్ కాలనీలో నివసిస్తున్న పెద్దనాన్న ఇంట్లో ఉంటూ పాఠశాలకు వెళ్తుంది. ఎప్పట్లాగే ఉదయం పాఠశాలకు బయల్దేరిన శ్రీనిధి.. దారిలో గుండె నొప్పి రావడంతో స్పృహ కోల్పోయి పడిపోయింది. పాఠశాల ఉపాధ్యాయుడు గమనించి వెంటనే ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ స్పందన లేకపోవడంతో.. మరో ఆస్పత్రికి తరలించారు. అక్కడ సీపీఆర్ చేసినా ఫలితం లేకపోవడంతో విద్యార్థిని మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విద్యార్థిని మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలి తల్లి గౌతమి, తండ్రి నరేందర్ కన్నీరు మున్నీరుగా విలపించారు.

పులివెందుల పోలీసులకు కోర్టులో చుక్కెదురు

కృష్ణారెడ్డి ఫిర్యాదు తప్పంటూ వేసిన పిటిషన్ తిరస్కరణ

పులివెందుల : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి పులివెందుల కోర్టులో పోలీసులకు చుక్కెదురైంది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారి రాంసింగ్‌తో పాటు నర్రెడ్డి సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డిపై వివేకానంద రెడ్డి పీఏ కృష్ణారెడ్డి 2023లో చేసిన ఫిర్యాదు తప్పు అని, దానిని కొట్టివేయాలంటూ గురువారం పులివెందుల పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. వివేకా హత్య కేసులో సీబీఐ అధికారి రాంసింగ్, నర్రెడ్డి సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి వారికి అనుకూలంగా స్టేట్‌మెంట్ ఇవ్వాలని బెదిరించారంటూ కృష్ణారెడ్డి 2023లో పులివెందుల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోడంతో ఆయన పులివెందుల కోర్టులో ప్రైవేట్ కంప్లైంట్ దాఖలు చేశారు. దీనిపై పూర్తి విచారణ చేయాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. దీంతో పోలీసులు రాంసింగ్, సునీత, రాజశేఖరరెడ్డిపై కేసు నమోదు చేసి చార్జిషీట్ కూడా దాఖలు చేశారు. అయితే కృష్ణారెడ్డి ఫిర్యాదు కొట్టివేయాలంటూ హైకోర్టులో రాంసింగ్, సునీత, రాజశేఖరరెడ్డి పిటిషన్ దాఖలు చేయగా.. హైకోర్టు ఈ కేసు కొనసాగించాల్సిందేనని తీర్పు చెప్పింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సునీత సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు పెండింగ్‌లో ఉంది. అయితే, చంద్రబాబు కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పులివెందుల పోలీసులు అత్యుత్సాహంతో ఏకపక్షంగా విచారణ చేశారు. కృష్ణారెడ్డి ఫిర్యాదు తప్పంటూ కోర్టుకు గురువారం నివేదించారు. దీనిని తప్పుడు ఫిర్యాదుగా పరిగణించాలని కోరారు. సుప్రీం కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా అసత్యమని ఎలా చెబుతారంటూ పులివెందుల పోలీసులు వేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది.

సిప్ అబాకస్ తాడేపల్లి విద్యార్థిని ఘనత

గణితంలో మమిడి శ్రీ సాయి రత్న సాన్వి ప్రతిభ




సాక్షి, అమరావతి: సిప్ (ఎస్ఐపీ) అబాకస్ తాడేపల్లి విద్యార్థిని మమిడి శ్రీ సాయి రత్న సాన్వి- గణితంలో తన అసాధారణ ప్రతిభను చాటింది. 'బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్- వరల్డ్స్ లార్జెస్ట్ ఆన్‌లైన్ ఇంటర్ అబాకస్ ఒలంపియాడ్' పోటీలో విజేతగా నిలిచింది. ఈ విజయానికి ఉపాధ్యాయురాలు జాహ్నవి అందించిన అబాకస్ శిక్షణ, మార్గదర్శకత్వం కీలకంగా మారాయి. ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు పోటీపడ్డ ఈ ప్రతిష్ఠాత్మక పోటీలో తన ప్రతిభతో సాన్వి సిప్ అబాకస్ తాడేపల్లికి సాన్వి విశేష గౌరవాన్ని తీసుకువచ్చింది. అలాగే ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విజయం సాధించింది. కేవలం ఐదు నిమిషాల్లో 100 ప్రశ్నల్లో 90కి పైగా ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పి పతకాన్ని గెలుచుకుంది. సిప్ అబాకస్ తాడేపల్లి విద్యార్థులకు అబాకస్ శిక్షణ ద్వారా గణితాన్ని సరళంగా నేర్పుతూ, వారి మేధస్సును అభివృద్ధి చేసే దిశగా కృషి కొనసాగిస్తోంది. సాన్వి సాధించిన గొప్ప విజయం సంస్థకు మరో అపూర్వమైన గుర్తింపు నివ్వడం గమనార్హం. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు అద్భుత విజయాలు సాధించాలని సంస్థ అధికారులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

సత్యవర్ధన్‌పై కేసు పెట్టి.. లొంగదీసుకుని

వల్లభనేని వంశీ అరెస్టుకు ప్రభుత్వ పెద్దల కుతంత్రం బట్టబయలు


- టీడీపీ కార్యాలయంపై దాడిపై ఫిర్యాదుతో సంబంధం లేదని చెప్పిన సత్యవర్ధన్
- ఆ మర్నాడే అతనిపై 'టీడీపీ' ఫిర్యాదు
- అదే రోజు క్రైం నంబరు 84/2025తో సత్యవర్ధన్‌పై కేసు



టీడీపీ కార్యకర్తలు చేసిన ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై కేసు, అరెస్టు వెనుక పోలీసుల చేత ప్రభుత్వ పెద్దలు ఆడించిన నాటకం బట్టబయలైంది. వంశీ అరెస్టుకు రెండు రోజుల ముందే సత్యవర్ధన్‌పై టీడీపీ నేతలతో ఫిర్యాదు చేయించి, దాని ఆధారంగా కేసు పెట్టి, దాన్నే బూచిగా చూపించి సత్యవర్ధన్‌ను, అతని కుటుంబ సభ్యులను దాదాపుగా బ్లాక్‌మెయిల్ చేసినట్లు వెల్లడైంది. దీంతో భయపడిన సత్యవర్ధన్ కుటుంబ సభ్యులు పోలీసులు చెప్పినట్లుగా వంశీపై కేసు పెట్టినట్లు, సత్యవర్ధన్ మేజిస్ట్రేట్ ఎదుట ఇచ్చిన వాంగ్మూలానికి భిన్నంగా స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు బయటపడింది. ఇక్కడ గమనించాల్సిన ఇంకో విషయం ఏమిటంటే.. ఒకవేళ నిజంగా వంశీనే సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి, బెదిరించి ఉంటే అదే పెద్ద కేసు అయి ఉండేది. టీడీపీ వర్గీయులు సత్యవర్ధన్‌పై కేసు పెట్టాల్సిన అవసరమే ఉండేది కాదు. వంశీపై అక్రమ కేసు, అరెస్టు వెనుక కుతంత్రం ఇదీ..

గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడిపై పెట్టిన కేసుతో తనకు సంబంధం లేదని, ఆ ఫిర్యాదు తానివ్వలేదంటూ అప్పటివరకు ఫిర్యాదుదారుగా భావించిన సత్యవర్ధన్ 10న మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇవ్వడం చంద్రబాబు కూటమికి శరాఘాతంలా తగిలింది. వంశీని అక్రమ కేసులో ఇరికించి, అరెస్టు చేయించాలన్న దుగ్ధతో ఉన్న చంద్రబాబు కూటమి ఓ కుతంత్రానికి తెరలేపింది. ఆ మరుసటి రోజునే కొందరు టీడీపీ కార్యకర్తలతో ఆయనపైన ఓ తప్పుడు ఫిర్యాదు ఇప్పించారు. సత్యవర్ధన్ రూ.5 లక్షలు డిమాండ్ చేశాడని, లేకపోతే వంశీకి అనుకూలంగా వాంగ్మూలం ఇస్తానంటూ బెదిరించాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దాని ఆధారంగా 11వ తేదీనే క్రైం నంబరు 84/2025తో కేసు పెట్టారు. వెంటనే సత్యవర్ధన్, ఆయన కుటుంబ సభ్యులను పోలీసుల ద్వారా బెదిరించారు. సత్యవర్ధన్‌పై కేసు నమోదైందని, తాము చెప్పినట్లుగా వంశీకి వ్యతిరేకంగా వాంగ్మూలం ఇస్తే ఆ కేసులో రాజీ చేస్తామంటూ బ్లాక్ మెయిల్ చేశారు. లేకపోతే సత్యవర్ధన్‌తో పాటు కుటుంబ సభ్యులనూ నిందితులుగా చేర్చి అరెస్టు చేసి, ఐదారు నెలలు బయటకు రాకుండా చేస్తామంటూ భయపెట్టారు. దీంతో కుటుంబ సభ్యుల ఒత్తిడి మేరకు సత్యవర్ధన్ మాట మార్చినట్లు తెలుస్తోంది. సత్యవర్ధన్, కుటుంబ సభ్యులను బెదిరించి, వారితో వంశీపై ఫిర్యాదు చేయించారు. వంశీని హైదరాబాద్‌లో 13వ తేదీ తెల్లవారుజామునే అదుపులోకి తీసుకొన్నారు. అదే రోజు ఉదయం 7 గంటల తర్వాత సత్యవర్ధన్‌ను విశాఖలో అదుపులోకి తీసుకున్నారు. అంటే సత్యవర్ధన్‌ను విచారించి, స్టేట్‌మెంట్ తీసుకోకుండానే వంశీని అరెస్టు చేసినట్లు తేటతెల్లమైంది. ఆరోజు సాయంత్రం వంశీకి వ్యతిరేకంగా సత్యవర్ధన్‌తో వాంగ్మూలం నమోదు చేయించారు. ఇలా సత్యవర్ధన్‌పై ముందే కేసు పెట్టి, బ్లాక్‌మెయిల్ చేసి కిడ్నాప్ కేసు పెట్టించడం, అతన్ని విచారించకుండానే వంశీని అరెస్టు చేయడం ద్వారా ఇదంతా ప్రభుత్వ పెద్దల కుతంత్రమన్న విషయం స్పష్టంగా తెలిసిపోతోందన్న వాదన వినిపిస్తోంది.



పసిపిల్లలకు భయం ఎక్కువ.
ఆ భయాన్ని వాడుకునే నీడలు ఎక్కువ.
నీడలు వారిని బంధిస్తాయి
వారితో చెడు పనులు చేస్తాయి
వారి పసితనాన్ని అశుభ్రం చేస్తాయి.
నీడలు ఈ పనికి దేవుణ్ణో, దెయ్యాన్నో
తోడు తెచ్చుకుంటాయి.
తల్లిదండ్రులు స్వయంగా తీసుకెళ్లి
అమాయకత్వంతోనో మూర్ఖత్వంతోనో
పిల్లల్ని ఈ నీడలకు అప్పగిస్తారు.
పిల్లలు పులి నోటికి చిక్కుతారు.
న్యాయం ఎప్పుడోగాని ఉదయించదు.
జమ్ము-కశ్మీర్‌లో మంత్రాల పేరు చెప్పి
పిల్లలను లైంగికంగా వేధించిన బాబాకు
శిక్ష విధిస్తూ న్యాయమూర్తి
ఉద్వేగంగా కవిత రాశారు.
భయం లేని వేకువకై ప్రార్థించారు.

● చైల్డ్ అబ్యూజ్

పసికూనలకు రక్షణ..లా

జనవరి, 2021.

మదనపల్లె ఘటన అందరికీ గుర్తుంది.

మూఢ విశ్వాసం నెత్తికెక్కి ఇద్దరు ఎదిగొచ్చిన కుమార్తెల ఉసురు తీశారు తల్లిదండ్రులు.

చనిపోయాక వారు సత్యయుగంలో జన్మిస్తారట.

అందుకోసమని బతికుండగానే సమాధి చేశారు.

ప్రాణం పోయడం దైవం. ప్రాణం తీయడం దెయ్యం.

•••

అక్టోబర్, 2024.

ఛత్తీస్‌గఢ్‌లోని శక్తి జిల్లా.

తల్లి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి ఇద్దరు కుమారులను గొంతు పిసికి చంపేసింది. తర్వాత ఉజ్జయినీ నుంచి తెచ్చుకున్న ఒక 'గురువు' ఫొటో పెట్టుకొని ఆ చనిపోయిన కుమారులను ప్రాణాలతో లేచేందుకు మంత్రాలు చదవడం మొదలెట్టింది.

ఇదంతా ఆమె తంత్ర సాధనలో భాగమట.

కడుపున పుట్టిన వారినే కాటేసే గుడ్డితనమే అంధ విశ్వాసం.

•••

జూన్, 2024.

తమిళనాడులోని అరియలూరు జిల్లా.

లేక లేక మనవరాలు పుడితే ఆ పుట్టిన శకునం బాగ లేదని స్వయంగా తాతే ఆ పసికూన ప్రాణాలు తీశాడు. ఆ శకునం కుటుంబానికి హానికారక సూచన కనుక ఈ పని చేశాడట.

చేతులతో పూజ చేయడం భక్తి. అదే చేతులతో పీక పిసకడం మూఢ భక్తి.

•••

ఫిబ్రవరి 18, 2025.

జమ్ము-కశ్మీర్‌లోని సాపోర్ నగర కోర్టులో చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ మీర్ వజాహత్ ఒక 123 పేజీల తీర్పును వెలువరించారు. ఆ తీర్పు అంతా మూఢ విశ్వాసాల వల్ల చిన్నపిల్లల మీద సాగుతున్న దౌర్జన్యాల పట్ల, అకృత్యాల పట్ల ఆవేదన. కారణం? ఆ తీర్పు ఏజాజ్ అహ్మద్ అనే దొంగబాబా పసిపిల్లల మీద సాగించే అకృత్యాల మీద కావడం. ఈ ఘోరాన్ని ఆ బాబా ఏళ్ల తరబడి కొనసాగిస్తూ ఉండటం. విషయం తెలియకనే తల్లిదండ్రులు అందులో భాగం కావడం.

ఏం జరిగింది?

జమ్ము-కశ్మీర్‌లో 'పీర్ బాబా'గా పేరుబడ్డ ఏజాజ్ షేక్ దగ్గరకు చాలా మంది తమ దైనందిన బాధల నుంచి విముక్తి కోసం వచ్చేవారు. అనారోగ్యం, ఆర్థిక బాధలు, తగవులు... వీటికి విరుగుడు కోసం ఆయన దగ్గరకు మంత్ర తంత్రాలకు వచ్చేవారు. అయితే ఇక్కడే ఆ బాబా ఒక చిట్కా పాటించేవాడు– 'మీ కష్టాలు పోవడానికి దైవ సహాయం కంటే 'జిన్ను' (భూతం)ల సాయం మంచిది. జిన్నులతో మాట్లాడి పరిష్కారం చేస్తాను. అయితే జిన్నులు పెద్దల కంటే పిల్లలతో మాట్లాడటానికి ఇష్టపడతాయి. మీరు మీ పిల్లల్ని (అబ్బాయిల్ని) తెచ్చి నాకు అప్పగిస్తే తంత్రాలు ముగిశాక మళ్లీ మీకు అప్పగిస్తాను' అనేవాడు. అమాయక/ఆశబోతు తల్లిదండ్రులు ఈ మాటలు నమ్మి తమ పిల్లల్ని బాబా దగ్గరకు తీసుకెళ్లేవాళ్లు.

పదేళ్లలోపు మగపిల్లలు

ఈ బాబా చేతిలో బాధితులుగా మారిన వారందరూ పదేళ్ల లోపు అబ్బాయిలే. బాబా వారిని పూజ పేరుతో నగ్నంగా మార్చి అసహజ లైంగిక కార్యకలాపాలకు పాల్పడేవాడని ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. పిల్లల్ని భయపెట్టేందుకు బాబా తనలోనే 'జిన్' ఉందని, అది అన్ని కష్టాల నుంచి దూరం చేస్తుందని, కోరికలు నెరవేరుస్తుందని చెప్పి లైంగిక వాంఛలు తీర్చుకునేవాడు. కొందరు పిల్లలు నాలుగైదు ఏళ్లపాటు ఇతని వల్ల బాధ పడ్డారు. భయం వల్ల, ఆ బాబా స్కూల్ టీచర్ కూడా కావడం వల్ల నోరు మెదపలేక తల్లిదండ్రులు బాబా దగ్గరికెళ్దామంటే వారు మొండికేయడం మొదలెట్టారు. అప్పుడు గాని పెద్దలకు అనుమానం రాలేదు. ఒక బాలుడు తెగించి తండ్రికి జరిగేది చెప్పడంతో బండారం బయటపడింది.

శిక్ష పడింది

2016లో బాబా అకృత్యాలు బయటపడి బేడీలు పడ్డాయి. అప్పటి నుంచి జైలులో శిక్ష అనుభవిస్తున్న బాబాకు ఫిబ్రవరి 18న న్యాయమూర్తి మీర్ వజాహత్ 14 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించారు. అంతేకాదు భక్తి, విశ్వాసాలను జనం బలహీనతగా ఎంచి దొంగ వేషగాళ్లు పసిపిల్లలను కబళించడంపై న్యాయమూర్తి తీవ్రమైన ఆవేదన, ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి బాబాలు మొత్తం విశ్వాస ప్రపంచానికి విఘాతం కలిగిస్తారన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఈ మొత్తం కేసు మీద ఒక లోతైన, సంకేతపూర్వకమైన కవిత రాశారు. ఎంత కదిలిపోతే ఇంత గాఢమైన కవిత వస్తుందనే ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది.

జస్టిస్ మీర్ వజాహత్ రాసిన కవిత

విశ్వాసపు గుసగుసలు... భయవిహ్వాల పెనుకేకలు

వెలుగు దుస్తులు ధరించి నిలిచిన వాడు
కారు చీకటిలో దారి చూపుతానని మాటిచ్చాడు
గుసగుసగా మంత్రాలు జపిస్తూ తన పవిత్ర హస్తాలతో
అంగలార్చే నేలలో విశ్వాసపు బీజాన్ని నాటాడు

సాంత్వనకై వెదుకుతూ అభయానికై తపిస్తూ
విప్పారిన నేత్రాలతో చేరవచ్చిందొక పసితనం
కానీ ఆ వెలుగుల మాటున చీకటి నీడలు
గడ్డకట్టిన మంచులా వణికించిన గుసగుసలు

'భూతమంటే భయమేలే కానీ నాపై నమ్మకముంచు
నిన్ను బయటపడేసే తాళంచెవి నా దగ్గరుంది'
పవిత్ర వేషంలో మాటలే సంకెళ్లు
ఇక గొంతు దాటని రోదన... విశ్వాసం గల్లంతు

చెప్పినట్టు, తాకినట్టు, దయగా చూసినట్టు
మాయామంత్రాల మత్తుగాలి... ఆశలను బూడిద చేస్తూ
కానరాని వలయాల్లో సుళ్లు తిరిగిన ఉత్త మాటలు
ఇక మిగిలింది కలవర పెట్టే పీడకలలు

ఏళ్లు గడిచిపోతాయి... పుళ్లు సలుపుతూనే ఉంటాయి
కాని ఆ నొప్పి వెనుక దాగి వెంటాడే ఆనాటి గుసగుసలు
చీలికలైనదేదీ అతుకు పడనే లేదు
నిబద్ధమై ఉండాల్సిన ఆత్మ గాలివాటుగా పరిభ్రమిస్తూ

కాని నిజం తలెత్తుకుని నిలబడుతుంది
జాతకాలు తలకిందులవుతాయి
న్యాయానికి ఎదురు నిలవక నీడలు చెదిరిపోతాయి
గాయాల ఆనవాళ్లు మాసిపోవేమోలే కానీ
భయం లేని వేకువలో భళ్లున తెల్లారుతుంది



సోషల్ మీడియా

నిదుర పో కన్నా...

తమ పసిబిడ్డను ఇంట్లోవాళ్లకు అప్పగించి ఉద్యోగం చేసుకునే అవకాశం అందరు తల్లులకు ఉండకపోవచ్చు. అలాంటి వారికి ఆ బిడ్డను భుజాన వేసుకొని ఉద్యోగానికి పోవడం అనివార్యం అవుతుంది.

అయితే అదేమీ అంత ఆషామాషీ విషయం కాదు.

'ఎంత కష్టం! ఎంత కష్టం!' అనిపిస్తుంది, అయినా సరే తప్పదు.

ఇక తాజా విషయానికి వస్తే...

తన పసికందును మోసుకుంటూ న్యూ దిల్లీ రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వహిస్తోన్న రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్(ఆర్పీఎస్‌ఎఫ్) కానిస్టేబుల్ రీనా వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చేతిలో లాఠీ ఒకవైపు, స్టేషన్ రణగొణ ధ్వనులను పట్టించుకోకుండా ప్రశాంతంగా నిద్రపోతున్న బిడ్డ మరోవైపు.

ఆమె భర్త సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అత్త మామలు లేరు. దీంతో బిడ్డతోపాటు డ్యూటీకి రావడం తప్ప ఆమెకు వేరే మార్గం లేదు. 'ఇది నా దినచర్యలో భాగం, ఎవరైనానా సహాయం చేస్తారేమోనని ఎదురుచూస్తున్నాను. అప్పటివరకు ఇది తప్పదు' అంటుంది రీనా.

ఇంతకుమించి ఆ వీడియోలో సాంకేతిక అద్భుతాలేవీ లేవు. అయినా సరే ఆ వీడియో నెటిజనులను ఉద్వేగానికి గురిచేసింది.

మాతృత్వాన్ని, ఉద్యోగ విధులను సమన్వయం చేసుకునే ఎంతోమంది తల్లులకు ఈ వీడియో ప్రాతినిధ్యం వహించడం వల్లే అంతగా పాపులారిటీ వచ్చింది.

బిడ్డకు తగినన్ని పాలు పడాలంటే..?



కొత్తగా అమ్మగా మారిన ఆ తల్లి తన బిడ్డకు సరిపోయినన్ని పాలు పడకపోతే ఆ మాతృమూర్తి పడే వేదన అంతా ఇంతా కాదు. చిన్నారికి సరిపోయినన్ని పాలు పడాలనుకునేవారు తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలివి...

- కొత్తగా తల్లి అయిన మహిళ తాను తీసుకునే ఆహారంలో పాలు, పెరుగు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, నీళ్లు తప్పని సరిగా తీసుకోవాలి.
- అన్ని రకాల పోషకాలు అందేలా మంచి బలవర్ధకమైన ఆహారంతో పాటు... ముఖ్యంగా నువ్వులు, వెల్లుల్లి, పాలు, కోడిగుడ్లు, కొబ్బరి, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలి.
- సిజేరియన్ జరిగి బిడ్డను పొందిన మహిళల్లో కుట్లు చీము పడతాయనే అపోహతో పప్పుధాన్యాలు తీసుకోరు. కానీ పప్పులు తీసుకోవడం వల్ల గాయం త్వరగా మానుతుంది. కానీ పప్పుధాన్యాలు ఇవ్వడం వల్ల కూడా పాలకు మంచి రుచి వచ్చి పాపలు ఇష్టంగా తాగుతారు.

తల్లి మంచినీళ్లు కూడా ఎక్కువగా తాగాలి. ఈ సూచనలు పాటించాక కూడా బిడ్డకు ఇంకా పాలు సరిపోకపోయినట్లయితే డాక్టర్ సలహా తీసుకోవాలి.

బ్యూటిప్స్ చుండ్రు తగ్గాలంటే...



యువతను విసిగించే సమస్యలలో చుండ్రు ఒకటి. దీనికి విరుగుడుగా కొన్ని జాగ్రత్తలతో ఈ సమస్యలను నివారించుకోవచ్చు.



- అల్లం ముక్కను సన్నగా తరగాలి. ఈ ముక్కలను నువ్వుల నూనెలో వేసి మరిగించాలి. చల్లారిన తర్వాత కుదుళ్లకు నూనె పట్టేలా మర్దనా చేయాలి. గంట తర్వాత మైల్డ్ షాంపూతో తల స్నానం చేయాలి. వారంలో రెండుసార్లు ఈ విధంగా చేస్తే చుండ్రు తగ్గుతుంది.



- ఆలివ్ ఆయిల్, వేప నూనె సమపాళ్లలో కలిపి వేడి చేయాలి. గోరువెచ్చని ఈ నూనెను మాడుకు పట్టించి, వేళ్లతో మృదువుగా మర్దనా చేయాలి. అరగంట తర్వాత తల స్నానం చేయాలి.
- ఆపిల్ సైడర్ వెనిగర్‌ని మాడుకు పట్టించి, పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రపరుచుకోవాలి.
- బేబీ ఆయిల్‌ను మాడుకు పట్టించి, మర్దనా చేసి, గోరువెచ్చని నీళ్లలో ముంచి తీసిన టర్కీ టవల్‌ని తలకు చుట్టుకోవాలి. పది నిమిషాల తర్వాత చుండ్రు నివారణకు ఉపయోగించే షాంపూతో తలస్నానం చేయాలి.



- అలొవెరా జెల్‌ను పట్టించి 15 నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. అలొవెరా జెల్ చుండ్రును నివారించడమే కాకుండా మాడుపైన దురద వంటి చర్మ సమస్యలనూ నివారిస్తుంది. వెంట్రుకలకు మంచి కండిషనర్‌గా ఉపయోగపడుతుంది.

కిచెన్ టిప్స్



- గారెల కోసం తయారు చేసుకున్న పిండిలో నీరు ఎక్కువై నూనెలో వేయగానే అంచుల దగ్గర సన్న పలుకులుగా విడిపోతున్నట్లయితే, పిండిలో ఒక టేబుల్ స్పూను నెయ్యి కలపాలి.
- కూరలు, పులుసులు, సూప్‌లు మరీ పలచగా ఉన్నట్లనిపిస్తే అందులో ఒక టేబుల్ స్పూను కార్న్ ఫ్లోర్ కలపాలి. కార్న్‌ఫ్లోర్‌ను అలాగే వేస్తే ఉండలవుతుంది. ముందుగా ఒక కప్పులో వేసి చన్నీటితో కలిపి ఆ మిశ్రమాన్ని కూరల్లో వేస్తే సమంగా కలుస్తుంది.

ఫ్యాషన్

నయగారాల సోయగాలు

తరతరాలుగా చేతులు మారే ఆభరణాలలా పార్సీ 'గారా' అనే ఎంబ్రాయిడరీని అత్యున్నతమైన వారసత్వ సంపదగా పేర్కొంటారు. గాజ్ లేదా పాజ్ అనే అందమైన పట్టు వస్త్రంపై రూపొందించే ఈ ఎంబ్రాయిడరీ సంప్రదాయ వేడుకలలో వైభవంగా వెలిగిపోతుంటుంది. వందేళ్లకు పైగా ప్రాచీన చరిత్ర కల 'గారా' డిజైన్ నేడు సెలబ్రిటీలకు ఇష్టమైన ఎంపిక అయ్యింది.

వివాహాలు, ప్రత్యేక సందర్భాలలో పార్సీ మహిళలు గారా చీరలను ధరించేవారు. అత్యంత ఖరీదైనదిగా పేరొందిన ఈ ఎంబ్రాయిడరీని కొన్ని ప్రత్యేక రోజులకే పరిమితం చేయకూడదని నేడు సృజనాత్మకంగా దుపట్టాలు, లెహంగాలు, ఇండోవెస్ట్రన్ డ్రెస్సుల మీదకు తీసుకు వస్తున్నారు.

•••

భారతదేశం నుండి పార్సీలు వాణిజ్యం కోసం చైనాకు ప్రయాణించే రోజుల్లో 'గారా' ఎంబ్రాయిడరీ మన దేశంలోకి అడుగుపెట్టింది. పార్సీలు మన దేశం నుండి నల్లమందు, పత్తిని చైనాకు తీసుకెళ్లి, అక్కడి టీ కోసం మార్పిడి చేసేవారు. బ్రిటిష్ వారు యూరోపాలో ఎక్కువ టీని అమ్మాలనుకోవడంతో పార్సీలు త్వరగా వ్యాపారంలో ధనవంతులయ్యారు. వారు తిరిగి వచ్చేటప్పుడు చైనాలో అందుబాటులో ఉన్న సిరామిక్స్, వివిధ ప్రాచీన వస్తువులను కూడా తీసుకువచ్చేవారు. ఒక వ్యాపారి కళాత్మకంగా ఉండే ఆ ఎంబ్రాయిడరీ ముక్కను ఒకటి తీసుకువచ్చాడన్నది చరిత్ర. ఆ ఎంబ్రాయిడరీ లో రకరకాల మార్పులు చేసి, తదుపరి కాలంలో పార్సీ మహిళల చీరల మీద వైభవంగా వెలిసింది. ముంబైలో స్థిరపడిన పార్సీ సమాజం చాలా ధనవంతులుగా, గారా చీరలు వారి సిగ్నేచర్‌గా మారిపోయాయి. ఆ విధంగా పార్సీ గారా అనే పేరు స్థిరపడిపోయింది.

•••

'గారా' ఎంబ్రాయిడరీలో పోల్కా చుక్కలను, సాలీడులా అనిపించే మోటిఫ్స్ కనిపిస్తాయి. పక్షులు, వృక్షజాలం, జంతుజాలం.. వంటివి ఈ ఎంబ్రాయిడరీలో ఒద్దికగా కనిపిస్తాయి. అచ్చమైన పట్టు దారాలతో సంక్లిష్టంగా ఉండే ఈ డిజైన్‌తో చీర రూపొందించాలంటే కళాకారులకు కొన్ని నెలల సమయం పడుతుంది. అందుకే ఈ ఎంబ్రాయిడరీ అత్యంత ఖరీదైనదిగా పేరొందింది.

•••

నాటి రోజుల్లో ఈ ఎంబ్రాయిడరీకి సాలిఘజ్' అని పిలిచే ప్రత్యేక ఫ్యాబ్రిక్‌ను ఎంపిక చేసుకునేవారు.. 1930లలో ఈ ఫ్యాషన్ వెలుగు చూసింది. తర్వాత 80లలో పునరుద్ధరించబడింది. ముంబైలో పార్సీలు ఈ ఎంబ్రాయిడరీని మందపాటి పట్టు ఫ్యాబ్రిక్ పైనే డిజైన్ చేసేవారు. ఇప్పుడు క్రేప్, జార్జెట్, షిఫాన్ ఫ్యాబ్రిక్‌లను ఉపయోగిస్తున్నారు. డిజైన్‌కి పెద్దమొత్తంలో పట్టుదారాలు ఉపయోగిస్తారు కాబట్టి కొన్ని ఫ్యాబ్రిక్స్ ఈ ఎంబ్రాయిడరీ బరువును మోయలేవు.

దాదాపు 40–50 సంవత్సరాల క్రితం ట్రెండ్‌లో ఉన్న ఈ కళ ఇప్పుడు మళ్లీ కళగా వెలుగులోకి రావడం చూస్తుంటే టైమ్‌లెస్ ట్రెడిషన్ అనిపించకమానదు.



గారా ర్యాప్ టాప్





గారా ఎంబ్రాయిడరీ



గారా లాంగ్ గౌన్



ఇటీవల హార్వర్డ్ ఇండియా కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నీతా అంబానీ పార్సీ గారా శారీలో మెరిసి, మరోసారి వారసత్వ సంపదను అందరికీ గుర్తుచేశారు. సంక్లిష్టమైన ఈ హస్తకళ పూర్తి కావడానికి దాదాపు రెండేళ్లు పట్టింది. ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జెనోబియా ఎస్.దావర్ ఈ చీర రూపకర్త.

గారా దుపట్టా

సరికొత్త మాస్ లుక్‌లో...



● ఎన్టీఆర్

‘ఆర్ఆర్ఆర్, దేవర’ వంటి వరుస విజయాల తర్వాత హీరో ఎన్టీఆర్, ‘కేజీఎఫ్, సలార్’ వంటి విజయాల తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో ‘ఎన్టీఆర్ నీల్’ (వర్కింగ్ టైటిల్) అనే పాన్ ఇండియా మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ ప్రకటించి, లొకేషన్‌లోని ఓ ఫొటోని షేర్ చేసింది. ‘‘మాస్ హీరో, మాస్ డైరెక్టర్ ఇమేజ్ ఉన్న స్టార్స్ కాంబోలో తెరకెక్కుతోన్న ‘ఎన్టీఆర్ నీల్’ పై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో ఫుల్ క్రేజ్ నెలకొంది. మూడు వేల మంది జూనియర్ ఆర్టిస్టులతో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరణతో షూటింగ్ ఆరంభించాం. తర్వాతి షెడ్యూల్ నుంచి ఎన్టీఆర్ షూటింగ్‌లో పాల్గొంటారు. ఇప్పటివరకు చూడనటువంటి మాస్ లుక్‌లో ఎన్టీఆర్‌ని చూపించనున్నారు ప్రశాంత్ నీల్. ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించనున్నాం. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 2026 జనవరి 9న మా సినిమాని విడుదల చేస్తాం’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: భువన్ గౌడ, సంగీతం: రవి బస్రూర్.



● నాగార్జున, అమల, చిరంజీవి, సురేఖ...

ఆమె నా బలం - చిరంజీవి

హీరో చిరంజీవి, సురేఖ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని గురువారం (ఫిబ్రవరి 20) చాలా ప్రత్యేకంగా సెలబ్రేట్ చేసుకున్నారు. అది కూడా విమానంలో ఆకాశంలో విహరిస్తూ... ఆ ఫ్లైట్‌లో హీరో అక్కినేని నాగార్జున, ఆయన సతీమణి అమల, మహేశ్‌బాబు సతీమణి నమ్రతతో పాటు అత్యంత ఆత్మీయులు, స్నేహితులున్నారు. అందుకు సంబంధించిన ఫొటోలను చిరంజీవి సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. ‘‘ప్రియమైన స్నేహితులతో కలిసి ఫ్లైట్‌లో దుబాయ్ వెళ్తూ వారి సమక్షంలో మా పెళ్లి రోజును సెలబ్రేట్ చేసుకోవడం సంతోషంగా ఉంది. నా కలల జీవిత భాగస్వామిగా సురేఖ నా జీవితంలోకి అడుగుపెట్టినందుకు నేను చాలా అదృష్టవంతుణ్ణి. ఆమె నా బలం, నా యాంకర్ కూడా. ప్రపంచంలో నాకు తెలియని ఎన్నో అద్భుతమైన విషయాలను కనుగొనేందుకు ఎల్లప్పుడూ సాయం చేస్తుంటుంది. తను నా పక్కన ఉంటే సౌకర్యంతో పాటు నాకు అద్భుతమైన ప్రేరణ కూడా. తన పట్ల నాకున్న ప్రేమ, అభిమానాన్ని తెలియజేయడానికి ఇలాంటివి మరిన్ని సందర్భాలు ఉన్నాయి. థ్యాంక్యూ... మై సోల్‌మేట్ సురేఖ. మాకెంతో ప్రత్యేకమైన ఈ రోజున శుభాకాంక్షలు తెలిపిన కుటుంబ సభ్యులు, మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు’’ అంటూ చిరంజీవి పోస్ట్ పెట్టారు. చిరంజీవి–సురేఖలకు పెళ్లయి 45 ఏళ్లయింది. 1980 ఫిబ్రవరి 20న వీరి వివాహం జరిగింది.

వినయం ముఖ్యం


- అల్లు అర్జున్



‘పుష్ప: ది రైజ్, పుష్ప 2: ది రూల్’ సినిమాలతో అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను అలరించడంతో పాటు ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు హీరో అల్లు అర్జున్. ‘పుష్ప: ది రైజ్’లో తన నటనకుగానూ ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. అలాగే ‘పుష్ప 2: ది రూల్’ చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా రూ.1871 కోట్ల వసూళ్లు సాధించి, సరికొత్త రికార్డులు సృష్టించిన అల్లు అర్జున్ తాజాగా మరో అరుదైన ఘనతని సొంతం చేసుకున్నారు. ప్రఖ్యాత హాలీవుడ్ సినిమా వార్తల మ్యాగజీన్ ‘ది హాలీవుడ్ రిపోర్టర్’ ఇప్పుడు ‘ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా’ పేరుతో ఇండియాలోనూ అడుగుపెట్టింది. ఈ మ్యాగజీన్ తొలి సంచిక కవర్ పేజీ అల్లు అర్జున్ ఫొటోతో ‘అల్లు అర్జున్: ది రూల్’ పేరుతో రానుండటం విశేషం. తాజాగా ఈ కవర్ పేజ్ ఫొటోషూట్‌ను నిర్వహించారు. ఆ ప్రోమో వీడియోను షేర్ చేశారు. అందులో అల్లు అర్జున్ పంచుకున్న కొన్ని విషయాలను చూపారు. ‘‘ఇండియన్ బాక్సాఫీస్ వద్ద నటుడిగా గుర్తింపు తెచ్చుకునే అవకాశం నాకు రావడం ఆనందంగా ఉంది. బలం, ఆత్మవిశ్వాసం అనేవి మనసులో ఉంటాయి. వాటిని ఎవరూ తీసేయలేరు. కొన్ని లక్షణాలు పుట్టుకతో వస్తాయి. ఇది అలాంటిదే. విజయం తర్వాత కూడా వినయంగా ఉండటం చాలా ముఖ్యం. జీవితంలో సక్సెస్ అయిన తర్వాత కూడా ఎలాంటి గర్వం లేని చాలా మందిని చూశాను. అది వారి వ్యక్తిత్వం మీద ఆధారపడి ఉంటుంది. నేను వంద శాతం సామాన్యుడినే. సినిమా చూస్తున్నప్పుడు కూడా ఇదే భావనతో ఉంటాను. అలాగే విరామ సమయంలో కేవలం విశ్రాంతి మాత్రమే తీసుకుంటాను. ఏమీ చేయకుండా ఉండటమే నాకిష్టం. కనీసం పుస్తకం కూడా చదవను’’ అంటూ ‘ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా’ ఇంటర్వ్యూలో అల్లు అర్జున్ పేర్కొన్నారు.

సహజంగా కనిపించే అవకాశం దక్కింది

- బ్రహ్మాజీ



‘‘‘బాపు’ చాలా యునిక్ కాన్సెప్ట్. రైతులు ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుంటుంది. అప్పుల బాధతో నా పాత్ర ఆత్మహత్యకి ప్రయత్నించినప్పుడు ఏమవుతుంది? అనేది ఈ సినిమాలో చూడాలి. ఈ చిత్రం ఫైనల్ కాపీ చూశాను... చాలా బాగా వచ్చింది. ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది’’ అని బ్రహ్మాజీ అన్నారు. దయా దర్శకత్వంలో బ్రహ్మాజీ, ఆమని, ‘బలగం’ సుధాకర్ రెడ్డి, ధన్యా బాలకృష్ణ, మణి ఏగుర్ల, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘బాపు’. రాజు, సీహెచ్ భానుప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ– ‘‘రెండేళ్ల క్రితం దయా ‘బాపు’ కథ చెప్పారు. పాయింట్ చాలా కొత్తగా, నా పాత్ర వైవిధ్యంగా ఉండటంతో పాటు సహజంగా కనిపించే అవకాశం ఉండటంతో ఒప్పుకున్నాను. అయితే బడ్జెట్‌పై చర్చ జరుగుతున్నప్పుడు.. నాకు పారితోషికం వద్దు... విడుదల తర్వాత లాభాలు వస్తే ఇవ్వమని నిర్మాతలకు చెప్పాను. నా తర్వాత ఇతర నటీనటులు కూడా పారితోషికం తగ్గించడం, లొకేషన్‌లో క్యారవ్యాన్స్ వాడకుండా చిత్రీకరణ జరిపిన ఊర్లో (కరీంనగర్) ఉంటూ సర్దుకుపోవడంతో ఈ మూవీ పూర్తి చేశాం. కథపై ఇష్టం, సినిమాపై నమ్మకంతోనే ఇది సాధ్యపడింది. ఆమనిగారు సహజ నటి. ‘బాపు’ టైటిల్ రోల్‌లో సుధాకర్ రెడ్డిగారి పాత్రతో ఆడియన్స్ చాలా కనెక్ట్ అవుతారు. ఈ సినిమాలోని రెండు పాటలు బాగా పాపులర్ అయ్యాయి. డైరెక్టర్ చంద్రశేఖర్ యేలేటిగారికి మా సినిమా చాలా నచ్చింది. ఇక ‘సూపర్ డీలక్స్’ సినిమాలో విజయ్ సేతుపతిగారు చేసినటువంటి పాత్ర చేయాలన్నది నా కల. ప్రస్తుతం చిరంజీవిగారి ‘విశ్వంభర’లో ఓ పాత్ర చేశాను. సిద్ధు జొన్నలగడ్డ ‘జాక్’తో పాటు తరుణ్ భాస్కర్, రాజ్ తరుణ్ వంటి వారి సినిమాల్లో నటిస్తున్నాను’’ అని తెలిపారు.

రా రాజా పెద్ద ప్రయోగం

- తమ్మారెడ్డి భరద్వాజ్



● శివప్రసాద్, తమ్మారెడ్డి భరద్వాజ్, హరిప్రసాద్

‘‘డైరెక్టర్ స్టీవెన్ స్పీల్ బర్గ్ తీసిన ‘డ్యూయల్’ చిత్రంలో నటీనటుల ముఖం కనిపించదు. అలాంటి నేపథ్యంలో ‘రా రాజా’ సినిమా తీసి దర్శకుడు శివ ప్రసాద్ ధైర్యం చేశాడు. ఇది చాలా పెద్ద ప్రయోగం’’ అని దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ అన్నారు. బి. శివ ప్రసాద్ దర్శకత్వంలో పద్మ సమర్పణలో శ్రీ పద్మిణి సినిమాస్ బ్యానర్‌పై రూపొందిన చిత్రం ‘రా రాజా’. బూర్లే హరి ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, కిట్టు లైన్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన ఈ సినిమా మార్చి 7న విడుదల కానుంది. ఈ మూవీ రిలీజ్ డేట్ పోస్టర్‌ను తమ్మారెడ్డి భరద్వాజ్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ‘‘ఈ చిత్రంలో ముఖాలు కనిపించవు. కథే ముందుకు వెళ్తుంటుంది. ఇది అద్భుతమైన ఐడియా. ఇది సక్సెస్ అయితే హీరోలు, స్టార్లతో పని లేకుండా అద్భుతమైన చిత్రాలు, ప్రయోగాలు చేయొచ్చని అంతా ముందుకు వస్తారు’’ అన్నారు. ‘‘మా చిత్రంలో నటీనటుల ముఖాలు కనిపించవు. కథ, కథనమే ముఖ్యంగా ఈ మూవీని తీశాం. ఇది ఒక ప్రయోగం’’ అన్నారు శివప్రసాద్.

క్రైమ్... థ్రిల్



● ఆనంది


ఆనంది, వరలక్ష్మీ శరత్‌కుమార్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం ‘శివంగి’. దేవరాజ్ భరణి ధరణ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జాన్ విజయ్, డా. కోయ కిషోర్ ఇతర పాత్రలు పోషించారు. ఫస్ట్ కాపీ మూవీస్ బ్యానర్‌పై నరేశ్‌బాబు పి. నిర్మించిన ఈ చిత్రం మార్చి 7న రిలీజ్ కానుంది. ఈ సినిమాలోని ఆనంది ఫస్ట్ లుక్‌ని డైరెక్టర్ అనిల్ రావిపూడి విడుదల చేశారు. ‘‘ఒక స్త్రీ తన జీవితంలో ఊహించని పరిస్థితులను ఎదుర్కొనే కథ చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది. విమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో మా మూవీ వైవిధ్యమైన కథ, స్క్రీన్‌ప్లేతో ఉంటుంది. మా చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది’’ అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఏహెచ్ కాషిఫ్–ఎబినేజర్ పాల్, కెమేరా: భరణి కె. ధరణ్.



స్టార్ హీరో – డైరెక్టర్ల కాంబినేషన్‌పై ‘గురూ... కొత్త కాంబినేషన్ షురూ!’ కథనం, నాని ‘హిట్ 3’, మోహన్‌లాల్ ‘దృశ్యం 3’ విశేషాల కోసం సాక్షి ఫ్లస్ ఈపేపర్‌ని చూడండి.

పరీక్షా కాలమ్!

- ఇంటర్ నుంచి సెట్స్ వరకు వరుసగా వార్షిక పరీక్షలు
- అన్ని పరీక్షలకు కలిపి 24.50 లక్షల మంది విద్యార్థులు
- మార్చి 1 నుంచి జూన్ మూడో వారం వరకు ఎగ్జామ్స్
- 1 నుంచి ఇంటర్ పరీక్షలు.. రాసే విద్యార్థులు 10.59 లక్షల మంది
- మార్చి 17 నుంచి టెన్త్ ఎగ్జామ్స్.. రాసే వారు 6.49 లక్షల మంది
- ఆ తర్వాత పలు ప్రవేశ పరీక్షలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పరీక్షల సీజన్ వచ్చేసింది. వార్షిక పరీక్షలతో పాటు ప్రవేశ, పోటీ పరీక్షలు వరుసగా జరగనున్నాయి. దాదాపు 24.50 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. విద్యా సంవత్సరంలో 10 నెలలపాటు నేర్చుకున్న అంశాలను పేపర్‌పై పెట్టి, ప్రతిభను పరీక్షించుకోనున్నారు. మార్చి ఒకటో తేదీన ఇంటర్మీడియట్ పరీక్షలతో మొదలై.. పదో తరగతి, జేఈఈ మెయిన్స్–2, అడ్వాన్స్‌డ్, ఈసెట్.. తదితర పదుల సంఖ్యలో సెట్లు జూన్ మూడో వారం వరకు దాదాపు మూడున్నర నెలల పాటు జరుగుతాయి. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ గురువారంతో ముగిశాయి. మార్చి 1 నుంచి 20 వరకూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం థియరీ పరీక్షలు జరుగుతాయి. ఇంటర్ పరీక్షలు చివరలో ఉండగానే పదో తరగతి పరీక్షలు మార్చి 17న మొదలై 31 వరకు సాగుతాయి. ఇంటర్ పూర్తి చేసిన ఎంపీసీ, బైపీసీ విద్యార్థుల్లో సగం మందికి పైగా ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఏపీఈఏపీ సెట్‌కు హాజరవుతారు. ఎంపీసీ విద్యార్థులు ఐఐటీలు, జాతీయ ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్లు సాధించేందుకు జేఈఈకి హాజరవుతారు. ఇప్పటికే జేఈఈ తొలివిడత సెషన్ పూర్తవగా, రెండో విడత ఏప్రిల్ 1 నుంచి 8 వరకూ జరుగుతుంది. ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ మే 18న జరుగుతుంది. ఇక డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికీ వరుస పరీక్షలున్నాయి. ఐసెట్, పీజీఈసెట్, ఈసెట్, ఎడ్‌సెట్, లాసెట్... వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే యూజీ, పీజీ నీట్... ఇలా జూన్ మూడో వారం వరకూ పరీక్షలే పరీక్షలు. ఇంటర్‌లో పబ్లిక్ పరీక్షలకు 10.59 లక్షల మంది విద్యార్థులు హాజరవుతుండగా, పదో తరగతి పరీక్షలకు రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 6.49 లక్షల మంది సిద్ధమవుతున్నారు. ఇతర సెట్స్‌తో పాటు అన్ని పరీక్షలకు రాష్ట్రంలో సుమారు 24.50 లక్షల మందికి పైగా హాజరు కానున్నారు. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడంలో తల్లిదండ్రులు, 3 లక్షల మంది ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తారు. ఈ లెక్కన దాదాపు 70 లక్షల మందికి ఇది పరీక్షా కాలమనే చెప్పాలి. వీరితోపాటు పరీక్ష కేంద్రాలకు ప్రశ్న పత్రాలు పంపడం నుంచి వాటిని మూల్యాంకన కేంద్రాలకు చేరవేసే వరకూ ప్రభుత్వ యంత్రాంగానికి సవాలే. విద్య, వైద్యం, రెవెన్యూ, రవాణా, పోలీస్... ఇలా అన్ని శాఖలకు కూడా ఇది పరీక్షా కాలమే.

రాష్ట్రంలో వార్షిక పరీక్షలు ఇలా..

పరీక్ష	తేదీ	రాసే విద్యార్థులు
ఇంటర్	మార్చి 1 - 20	10.59 లక్షలు
టెన్త్	మార్చి 17 - 31	6.50 లక్షలు
జేఈఈ మెయిన్-2	ఏప్రిల్ 1 - 8	1 లక్ష
అడ్వాన్స్‌డ్	మే 18	30 వేలు
ఏపీఈఏపీ సెట్	మే 19, 20 (అగ్రికల్చర్, ఫార్మా) మే 21 - 27 (ఇంజనీరింగ్)	3.70 లక్షలు
ఆర్‌సెట్	మే 2 - 5	2 వేలు
ఐసెట్	మే 7	45 వేలు
ఈసెట్	మే 6	37 వేలు
లాసెట్	మే 25	20 వేలు
ఎడ్‌సెట్	జూన్ 8	20 వేలు
పీజీఈసెట్	జూన్ 5-7	22 వేలు
పీజీ సెట్	జూన్ 9-13	34 వేలు
పీఈసెట్	జూన్ 25	2 వేలు
నీట్ యూజీ	మే 4	70 వేలు

తెలంగాణలో 25 లక్షల మంది

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది విద్యార్థులు పరీక్షల పోరుకు సిద్ధమవుతున్నారు. వీరికి అండగా నిలిచే తల్లిదండ్రులు, పరీక్షల సమరానికి సిద్ధం చేసే అధ్యాపకులు, ఇతరులు కలిపి మరో కోటి మంది ఈ క్రతువులో భాగస్వాములవుతారని అంచనా. పరీక్షల సమయంలో పిల్లలకు అందుబాటులో ఉండేందుకు తల్లిదండ్రులు సెలవులు పెట్టడం లాంటి ఏర్పాట్లు చేసుకుంటుంటే, విద్యాసంస్థలు ప్రత్యేక తరగతులు, మోడల్ టెస్టులతో విద్యార్థులను సన్నద్ధం చేయడంలో నిమగ్నమయ్యాయి. తెలంగాణలో ఇంటర్ పరీక్షలు మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు, టెన్త్ పరీక్షలు మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు జరగనున్నాయి. ఈఏపీ సెట్ ఏప్రిల్ 29, 30 (అగ్రికల్చర్, ఫార్మా), మే 2 నుంచి 5 (ఇంజనీరింగ్) వరకు జరగనున్నాయి. ఐసెట్ జూన్ 8, 9 తేదీల్లో, పీజీఈసెట్ జూన్ 16 నుంచి 19 వరకు, ఈసెట్ మే 12, ఎడ్‌సెట్ జూన్ 1, లాసెట్ జూన్ 6న జరుగుతాయి. పీఈసెట్ జూన్ 11, 14 తేదీల్లో నిర్వహిస్తారు.

మైనారిటీల సంక్షేమానికి రూ.600 కోట్లు ఇవ్వండి

- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకు మంత్రి ఫరూక్ లేఖ



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మైనారిటీల సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగు పరిచేందుకు, వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు కేంద్రం వాటా నిధులు ఇవ్వాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కేంద్రాన్ని కోరారు. ఈ విషయమై కేంద్ర మైనారిటీ మంత్రిత్వ శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు ఫరూక్ రాసిన లేఖను గురువారం మీడియాకు విడుదల చేశారు. ఏపీలో 2011 జనాభా లెక్కల ప్రకారం దాదాపు 43.46 లక్షల మైనార్టీ జనాభా ఉందని, వారి అభివృద్ధి సంక్షేమానికి రూ.వెయ్యి కోట్లతో ప్రతిపాదనలు చేసినట్టు తెలిపారు. ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం (పీఎంజేవీకే) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు కేంద్రం (60శాతం) వాటా కింద రూ.600 కోట్లు ఇవ్వాలని కోరినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు.

నాణ్యమైన మినుము వంగడాలపై దృష్టి సారించండి

- శాస్త్రవేత్తలకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మినుము సాగు విస్తీర్ణం ఉత్పత్తి, ఉత్పాదన పెంచాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు శాస్త్రవేత్తలకు సూచించారు. జాతీయ ఆహార, పోషక భద్రత మిషన్ 2024–25పై వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన గురు వారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ అపరాల సాగులో ప్రధాన పాత్ర పోషించే మినుము పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. మనుషుల ఆరోగ్యానికి ఎంతగానో దోహద పడే ప్రోటీన్స్ అధికంగా, కొలెస్ట్రాల్ తక్కువగా ఉండే మినుము వంగడాల సృష్టిపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలను అభివృద్ధి చేయాలని కోరారు. వర్క్‌షాప్‌లో వ్యవసాయ ఉప సంచాలకులు బాలు నాయక్, సంయుక్త సంచాలకులు కృపాదాస్, విజయభారతి, ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ అపరాలు పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మోహన్‌రెడ్డి, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదాకు కేంద్రం కొత్త పథకం

- బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ కార్యదర్శి మిలింద్ దేవరా వెల్లడి

సాక్షి, అమరావతి: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్‌ఎంఈ)ల్లో ఇంధన సామర్థ్య (విద్యుత్తు ఆదా) కార్యక్రమాల కోసం కొత్త పథకాన్ని తీసుకొస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ సంస్థ ‘బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) కార్యదర్శి మిలింద్ దేవరా వెల్లడించారు. ఎంఎస్‌ఎంఈల్లో అధునాతన అంతర్జాతీయ సాంకేతికతలను వినియోగించేలా, సాంకేతిక ఆధారిత ఆర్థిక ప్రోత్సాహం అందించేందుకు ‘అసిస్టెన్స్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ టెక్నాలజీస్ ఇన్ ఇండస్ట్రియల్ ఎస్టాబ్లిష్ మెంట్స్ (ఏడీఈఈటీఐఈ)’ పథకాన్ని రూపొందించినట్లు వివరించారు. బీఈఈ ఆధ్వర్యంలో విజయవాడలో గురువారం జరిగిన ఇండో జర్మన్ ఇంధన భాగస్వామ్య జాతీయ సదస్సులో దేవరా ప్రసంగించారు. ఫౌండ్రీ, ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, పేపర్, మత్స్య పరిశ్రమ రంగాల్లో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళల్లో ప్రాథమికంగా ఈ పథకాన్ని అమలు చేయాలని కేంద్రం నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఏడీఈఈటీఐఈ ద్వారా 8 వేలకు పైగా ఎంఎస్‌ఎంఈలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు రుణాలపై 5శాతం, మధ్య తరహా పరిశ్రమలకు రుణాలపై 3 శాతం వడ్డీ రాయితీ కల్పించనున్నట్లు దేవరా వెల్లడించారు. ఏడీఈఈటీఐఈలోని కీలక అంశాలు, సమగ్ర ప్రణాళికను బీఈఈ డైరెక్టర్ శ్యాంసుందర్ వివరించారు. బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖరరెడ్డి, ఏపీఎస్ఈసీఎం సీఈవో కుమారరెడ్డి పాల్గొన్నారు.

మిర్చి సేకరణలో సమస్యలున్నాయ్

సీఎం పొంతనలేని సమాధానాలు

ఢిల్లీలో మీడియాతో చంద్రబాబు



కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు జ్ఞాపికను అందిస్తున్న చంద్రబాబు. పక్కన పవన్ కళ్యాణ్

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో మిర్చి రైతు ఆర్థిక సమస్యల సుడిగుండంలో కూరుకుపోయి బాధలు పడుతుంటే... వారిని రక్షించే విషయంలో ఒక నిర్దిష్ట విధానం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఇక్కడకు వచ్చిన సీఎం చంద్రబాబు.. ఈ సమస్యపై పొంతన, దిశా నిర్దేశం లేని మాటలు మాట్లాడారు. ఆయన మాటల్లోనే చూస్తే... ‘నష్టపోయిన మిర్చి పంటను కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వం నేరుగా సేకరించాలంటే కొన్ని సమస్యలు ఉన్నాయి. 25 శాతం, 50 శాతం సేకరణ చేసి మిగిలింది ఎలా చేయాలనేది కూడా ఉంది? ఇవన్నీ రేషనలైజ్ చేయాలి. రాష్ట్ర స్థాయిలో అలాగే కేంద్ర మంత్రితో ఈ విషయంపై ఆలోచిస్తాం. రైతులతో కూడా మాట్లాడతాం. అందరితో మాట్లాడిన తర్వాత అందరికీ ఆమోదయోగ్యంగా రైతులు నష్టపోకుండా ఏం చేయాలో అది చేస్తాం’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కేంద్రం లేదా రాష్ట్రం నేరుగా సేకరణ చేస్తుందా? అన్న ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానం ఇవ్వకుండా ఈ విధమైన పొంతనలేని సమాధానం ఇచ్చారు. మీడియా సమావేశానికి ముందు ఆయన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో కలిసి జలశక్తి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ అయ్యారు. కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శితో జరిగిన భేటీలో వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

ఐసీఏఆర్ నిర్దేశిత రేటు సరికాదు...

మార్కెట్ ఇంట్రవన్షన్ స్కీం (ఎంఐఎస్) కింద 25 శాతమే కొనడానికి అవకాశం ఉండగా.. ఇప్పుడున్న అవసరాలకు తగ్గట్టుగా కొనుగోలు చేయాలని కేంద్రానికి సూచించినట్లు పేర్కొన్నారు. పంటకు గిట్టుబాటు ధర విషయంలో ‘ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసర్చ్’(ఐసీఏఆర్) నిర్దేశించిన రేటు సరికాదన్నారు. ఇప్పుడున్న సాగును దృష్టిలో ఉంచుకుని రేటును నిర్ధారించాలని మంత్రికి చెప్పినట్లు తెలిపారు. 50 శాతం రాష్ట్రం, 50 శాతం కేంద్రం ఇవ్వాలన్న అంశంపై కూడా చర్చ జరుగుతోందని అన్నారు.

రైతుకు పరామర్శ తప్పు...

‘రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయి. గుంటూరు రైతుల పరామర్శకు వెళ్లొద్దని ఎన్నికల సంఘం చెప్పిన తర్వాత వెళ్లడం ఏంటి?’ అంటూ మాజీ సీఎం వైఎస్ జగన్‌పై సీఎం పరోక్ష ఆరోపణలకు దిగారు. ఇల్లీగల్ యాక్టివిటీకి పోలీసు ప్రొటెక్షన్ ఇవ్వడం ఎక్కడైనా చూశామా? సెక్యూరిటీ మీరు అడగడం ఏంటి? పోలీసులు కూడా నీతో రావాలి అంటే ఎలా? రాబోయే రోజుల్లో నేరాలు చేస్తానంటే పోలీసులు చూస్తూ నీదగ్గరకు రావాలా’ అంటూ అడ్డగోలు ఆరోపణలకు దిగారు. సమస్య పరిష్కారం కోసం అనేక మార్గాలు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి, మంత్రికి లేఖలు రాయవచ్చన్నారు. గవర్నర్‌కు లేదా కేంద్రానికి చెప్పవచ్చని ఉచిత సలహా పడేశారు.

పోలవరం ఎత్తుపై చంద్రబాబు మౌనం!

ఇదిలాఉండగా, జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో జరిగిన సమావేశంలో.. పోలవరం ఎత్తు విషయంపై సీఎం మౌనం వహించారు. తగ్గించిన ఎత్తును బట్టే బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. ఇదే విషయంపై ఇటీవల ఉభయ సభల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీలు సైతం ప్రశ్నించారు. ఎత్తు తగ్గించలేదు అని కేంద్రమంత్రితో ప్రకటన ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఎంపీలు సీఎం దృష్టికి తెచ్చినా.. కేంద్ర మంత్రి సమావేశంలో మాత్రం ఎత్తుపై నోరెత్తకుండా మౌనంగా ఉన్నారు. మీడియా ముందు మాత్రం ఎత్తుపై రాజీపడమంటూ మాట్లాడటం గమనార్హం. పోలవరం ఎత్తు విషయంలో కొందరు కావాలనే వివాదం చేస్తున్నారని సీఎం చంద్రబాబు ఆరోపించారు. కృష్ణా జలాల పంపకాల విషయంలో రాజకీయాలు చేయడం సరికాదని చంద్రబాబు అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	203	75,736
నిఫ్టీ ▽	20	22,913

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	19,919	▽ 136
డోజోన్స్	44,042	▽ 585
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,663	▽ 50
డాక్స్	22,315	△ 119
షాంఘై	3,351	△ 1
నికాయ్	38,678	▽ 487

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	85,520
బంగారం (22 క్యారెట్)	81,450
వెండి (కిలో)	1,09,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒక్కటికి	86.45	87.47
£	బ్రిటన్ పౌండ్	ఒక్కటికి	108.10	110.92
€	యూరో	ఒక్కటికి	89.37	92.01
¥	జపాన్ ఎన్ (100)	ఒక్కటికి	57.00	58.45
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒక్కటికి	54.10	56.31
S$	సింగపూర్ డాలర్	ఒక్కటికి	62.56	67.24
SAR	సౌదీ రియాల్	ఒక్కటికి	22.21	23.77
UAE D	యూఏఈ దిర్హామ్	ఒక్కటికి	22.70	24.49
¥	చైనా యువాన్	ఒక్కటికి	11.07	12.89

వేదాంత విభజనకు గ్రీన్ సిగ్నల్



- ఐదు కంపెనీలుగా విడదీత
- ప్రణాళికకు షేర్‌హోల్డర్లు, రుణదాతల ఆమోదం
- ఒక్కో వేదాంత షేరుకు ఒక్కొక్కటి చొప్పున 4 కొత్త కంపెనీల షేర్లు

న్యూఢిల్లీ: షేర్‌హోల్డర్లు, రుణదాతలు ఆమోద ముద్ర వేయడంతో డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంత లిమిటెడ్ విభజనకు లైన్ క్లియర్ అయ్యింది. దీంతో వ్యాపారాలను అల్యూమినియం, ఆయిల్ తదితర రంగాలవారీగా అయిదు కంపెనీలుగా విడదీస్తారు. డీమెర్జర్ స్కీము ప్రకారం వేదాంత షేర్‌హోల్డర్లకు ఒక్కో షేరుకు గాను కొత్తగా ఏర్పడే నాలుగు సంస్థలకు సంబంధించి అదనంగా ఒక్కొక్క షేరు చొప్పున లభిస్తుంది. కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకునేందుకు, వనరులను సమర్ధవంతంగా ఉపయోగించుకునేందుకు, అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ డీమెర్జర్ ఉపయోగపడుతుందని వేదాంత వెల్లడించింది. అలాగే, ఒక్కో స్వతంత్ర కంపెనీ వేర్వేరుగా ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడులు సమకూర్చుకునేందుకు, వ్యూహాత్మక భాగస్వాములతో జట్టు కట్టేందుకు అవకాశం లభిస్తుందని పేర్కొంది. అయిదు కంపెనీలుగా విడదీసే ప్రణాళికకు 99.99 శాతం మంది షేర్‌హోల్డర్లు, 99.59 శాతం మంది సెక్యూర్డ్ రుణదాతలు, 99.95 శాతం మంది అన్‌సెక్యూర్డ్ రుణదాతలు ఆమోదం తెలిపినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది.

గురువారం బీఎస్‌ఈలో వేదాంత షేర్లు దాదాపు 2.40 శాతం పెరిగి రూ. 433.55 వద్ద క్లోజయ్యాయి. ఇంట్రాడేలో సుమారు 3 శాతం పెరిగి రూ. 435.50 స్థాయిని తాకాయి. కంపెనీ మార్కెట్ వేల్యుయేషన్ రూ. 3,969 కోట్లు పెరిగి రూ. 1,69,535 కోట్లకు చేరింది.

ఇవీ కంపెనీలు..

విడదీత అనంతరం వేదాంత లిమిటెడ్ ప్రధానంగా వెండి, జింకు మొదలైన మెటల్స్ ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహిస్తుంది. మిగతా కంపెనీల జాబితాలో వేదాంత అల్యూమినియం, వేదాంత ఆయిల్ అండ్ గ్యాస్, వేదాంత పవర్, వేదాంత ఐరన్ అండ్ స్టీల్ ఉంటాయి. టెక్నాలజీ విభాగాలతో పాటు కొత్త వ్యాపారాలకూ వేదాంత ఇన్‌క్యుబేటరుగా వ్యవహరిస్తుంది.

ఐపీవో రూట్లో ఫోన్‌పే



న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ (ఐపీవో) ద్వారా దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యేందుకు ఫిన్‌టెక్ దిగ్గజం ఫోన్‌పే కసరత్తు ప్రారంభించింది. ఈ ఏడాది పదో వార్షికోత్సవం జరుపుకోనున్న నేపథ్యంలో తమ సంస్థకు ఇదొక కీలక మైలురాయి అవుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఫోన్‌పే పోటీ సంస్థలు పేటీఎం, మొబిక్విక్ ఇప్పటికే దేశీ మార్కెట్లలో లిస్టయిన సంగతి తెలిసిందే. సింగపూర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించిన ఫోన్‌పే 2022లో తమ ప్రధాన కార్యాలయాన్ని భారత్‌కి మార్చుకుంది. 2023లో చివరిసారిగా నిధులు సమీకరించినప్పుడు ఫోన్‌పే వేల్యుయేషన్‌ను 12 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టారు. ఫోన్‌పేలో వాల్‌మార్ట్‌కి చెందిన లక్సెంబర్గ్ సంస్థ ఫిట్ హోల్డింగ్స్ ఎస్‌ఏఆర్‌ఎల్‌కి 83.91 శాతం, జనరల్ అట్లాంటిక్ సింగపూర్‌కి 5.14 శాతం, ఫోన్‌పే సింగపూర్ విభాగానికి 6.7 శాతం వాటాలు ఉన్నాయి.

పీఎన్‌బీ రుణ రేట్లు కట్..

- రిటైల్ రుణాలన్నింటికీ వర్తింపు...
- ఆర్‌బీఐ రెపో రేటు తగ్గింపు ఎఫెక్ట్



న్యూఢిల్లీ: రిటైల్ రుణాలపై (గృహ, వాహన సహా) 25 బేసిస్ పాయింట్ల (0.25శాతం) మేర వడ్డీ రేటును తగ్గిస్తున్నట్లు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ప్రకటించింది. గృహ, కార్ల రుణాలు, విద్య, వ్యక్తిగత రుణాలకు ఈ తగ్గింపు అమలు కానుంది. ఐదేళ్ల విరామం తర్వాత ఆర్‌బీఐ ఈ నెల మొదట్లో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించడం తెలిసిందే. ఈ తగ్గింపు ప్రయోజనాన్ని రుణగ్రహీతలకు బదిలీ చేస్తూ పీఎన్‌బీ కొత్త రేట్లను ప్రకటించింది. సవరణ తర్వాత గృహ రుణాలపై రేటు 8.15 శాతం నుంచి మొదలవుతుంది. అంటే ప్రతి లక్షకు చెల్లించాల్సిన ఈఎంఐ రూ.744గా ఉంటుందని పీఎన్‌బీ ప్రకటించింది. ఆటో రుణాలపై 8.50 శాతం నుంచి రేట్లు మొదలవుతాయి. ప్రతి లక్షకు రూ.1,240 ఈఎంఐ చెల్లించాల్సి ఉంటుంది. పర్యావరణ అనుకూల ఇంధన వాహనాలకు 0.05 శాతం మేర వడ్డీలో రాయితీ ఇవ్వనుంది. అలాగే ఎక్స్ షోరూమ్ ధరపై 100 శాతం రుణంగా లభిస్తుంది. 120 నెలల కాలానికి ఎంపిక చేసుకోవచ్చు. విద్యా రుణాలపై రేట్లు 7.85 శాతానికి తగ్గాయి. వ్యక్తిగత రుణాలపై రేట్లు 11.25 శాతం నుంచి మొదలవుతాయి. కొత్త రేట్లు ఫిబ్రవరి 10 నుంచే అమల్లోకి వస్తాయని పీఎన్‌బీ ప్రకటించింది.

టారిఫ్ భయాలు

సూచీలకు మూడో రోజూ నష్టాలే



ముంబై: అమెరికా తాజా సుంకాల విధింపు ఆందోళనలతో దలాల్ స్ట్రీట్‌లో మూడోరోజూ అమ్మకాలు కొనసాగాయి. సెన్సెక్స్ 203 పాయింట్లు పతనమై 75,736 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 20 పాయింట్లు నష్టపోయి 22,913 వద్ద నిలిచింది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, మారుతీ సుజుకీ, ఐసీఐసీఐ బ్యాంకు, ఐటీసీ షేర్లు 2-1% పతనంతో సూచీలు ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 476 పాయింట్లు క్షీణించి 75,463 వద్ద, నిఫ్టీ 120 పాయింట్లు కోల్పోయి 22,813 వద్ద కనిష్టాన్ని నమోదు చేశాయి. ఇటీవల భారీ పతనమైన చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ కొనసాగింది. బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ 1.32%, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.18 శాతం పెరిగాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 34 పైసలు బలపడి 86.64 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
టెర్మినల్ నుంచి బంక్ దాకా ప్రతీ చుక్కకూ లెక్క!
ఈ-రీసైక్లింగ్ @ 20 కోట్ల డాలర్లు

షాపింగ్ ఓ రేంజ్‌లో..!

- చిన్న పట్టణాల్లోనూ లగ్జరీ ఉత్పత్తులకు సై..
- ఖరీదైన పాదరక్షలు, వాచీలు, వస్త్రాల కొనుగోళ్లు
- టాటా క్లిక్ లగ్జరీ అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: విలాసవంతమైన ఉత్పత్తుల పట్ల అభిరుచి చిన్న పట్టణాలకూ విస్తరిస్తోంది. ఖరీదైన పాదరక్షలు, వాచీలు, వస్త్రాలు, యాక్సెసరీల కోసం దేశవ్యాప్తంగా ఉన్న మారుమూల పట్టణ వాసులు సైతం ఆర్డర్ చేస్తున్నారు. దీంతో లగ్జరీ ఉత్పత్తుల కొనుగోళ్లు ప్రధానంగా ముంబై, ఢిల్లీ, బెంగళూరు తదితర మెట్రోలకే పరిమితం అన్న అభిప్రాయం క్రమంగా చెరిగిపోతోంది. గుజరాత్‌లో 2 లక్షల జనాభా కూడా లేని బోటాడ్ నుంచి వీటి కోసం ఆర్డర్లు వస్తుండడమే ఇందుకు నిదర్శనం. ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు ఇందుకు వారధిగా నిలుస్తున్నాయి. టాటా క్లిక్ లగ్జరీ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో ఈ వివరాలు తెలిశాయి. ''లగ్జరీ అన్నది ఇక ఎంత మాత్రం అధిక ధనవంతులకు సంబంధించిన విభాగం కాబోదు. టైర్-2, 3 పట్టణ వాసులు, మెట్రో పరిధిలో కొత్త భౌగోళిక ప్రదేశాలు పరిశ్రమకు కొత్త పునరుజ్జీవాన్నిస్తున్నాయి''అని టాటా క్లిక్ లగ్జరీ నివేదికలో అనలిస్టులు పేర్కొన్నారు. సంపన్నులు కాని అధిక ఆదాయ వర్గాలతో (హెన్రీ) కూడిన వినియోగ వర్గం గురించి ఈ నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. వీరు లగ్జరీ ఉత్పత్తుల అనుభవాన్ని కోరుకుంటున్నట్టు తెలిపింది.

నాన్ మెట్రోల్లోనే అధిక అమ్మకాలు..

టాటా క్లిక్‌లో లగ్జరీ ఉత్పత్తుల ప్రత్యేక విభాగమైన 'టాటా క్లిక్ లగ్జరీ'పై జరిగే విక్రయాల్లో 55 శాతం నాన్ మెట్రోలైన పంచకుల, మైసూరు తదితర పట్టణాల నుంచే ఉంటున్నాయి. ''ఇలా కొనుగోలు చేసే వారంతా ఉద్యోగాలు చేస్తూ, అధిక ఆదాయం సంపాదిస్తున్న వారు. విలాస అనుభం, ఉత్పత్తుల వినియోగాన్ని కోరుకుంటున్నారు. దీంతో సౌందర్య ఉత్పత్తులు, యాక్సెసరీలు, వస్త్రాలు, పాదరక్షల విక్రయాల్లో అధిక విక్రయాలకు మద్దతుగా నిలుస్తున్నారు. మెట్రో వినియోగదారుల మాదిరే వీరి కొనుగోళ్ల విలువ కూడా ఉంటోంది''అని టాటా క్లిక్ లగ్జరీ సీఈవో గోపాల్ ఆస్థానా తెలిపారు. సంపన్నులే కాకుండా చిన్న పట్టణాల్లోని వృత్తి నిపుణులు సైతం లగ్జరీ వస్తువులకు వినియోగదారులుగా మారుతున్నట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. బల్గరీ తదితర అంతర్జాతీయ లగ్జరీ బ్రాండ్‌లు ఆన్ లైన్ ప్లాట్‌ఫామ్‌ల సహకారంతో భారత్‌లో కొత్త కస్టమర్లను చేరుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. అజియో లగ్జే సైతం అంతర్జాతీయ బ్రాండ్లకు చిన్న పట్టణాల్లో భౌతిక స్టోర్లు తెరవాల్సిన అవసరాన్ని తప్పిస్తోంది. సంప్రదాయ లగ్జరీ షాపర్లకు భిన్నంగా.. కొత్త కస్టమర్లు తగిన పరిశోధన తర్వాతే ఆర్డర్ చేస్తున్నారు. ఇందుకు సోషల్ మీడియా వేదికలు, వెబ్‌సైట్లు, కస్టమర్ల రివ్యూలను ఉపయోగించుకుంటున్నారు. కనీసం ఆరేడు బ్రాండ్ల ఉత్పత్తులను పరిశీలించిన తర్వాతే చివరికి ఒకటి ఎంపిక చేసుకుంటున్నారు.

✔ అధిక ఆదాయంతో మెరుగైన అనుభవానికి మొగ్గు	✔ సరైన పరిశోధన తర్వాతే ఉత్పత్తి ఎంపిక	✔ ఈ కామర్స్ రూట్‌లో అంతర్జాతీయ బ్రాండ్లు
✔ పలు బ్రాండ్లను పరిశీలించిన తర్వాత కొనుగోలు	✔ జెన్ జెడ్, జెన్ ఆల్ఫా భవిష్యత్ లగ్జరీ కస్టమర్లు	✔ నాన్ మెట్రోల నుంచే 55 శాతం అమ్మకాలు

సీఈఏ పదవీ కాలం పొడిగింపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి అనంత నాగేశ్వరన్ పదవీకాలాన్ని కేంద్రం మరో రెండేళ్ల పొడిగించింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. దీంతో నాగేశ్వరన్ మార్చి 31, 2027 వరకు పదవిలో కొనసాగనున్నారు. కేవీ సుబ్రమణియన్ స్థానంలో 2022, జనవరి 28న సీఈఏగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. వివిధ ఆర్థిక విధానాలపై ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడంతో పాటు కేంద్ర బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఆర్థిక సర్వేను రూపొందించడం సీఈఏ కార్యాలయం ప్రధాన బాధ్యత. నాగేశ్వర్ సీఈఏగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు 2019 నుంచి 2021 వరకు ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలిలో పార్ట్‌టైం సభ్యుడిగా పనిచేశారు. భారత్, సింగపూర్‌లో అనేక బిజినెస్ స్కూల్స్‌లో బోధించారు. నాగేశ్వరన్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ డిగ్రీని పొందారు. 1994లో మసాచుసెట్స్ విశ్వవిద్యాలయం నుంచి ఫైనాన్స్‌లో డాక్టరేట్ పట్టా అందుకున్నారు.



సాక్షి స్పోర్ట్స్

200 వన్డేల్లో షమీ 200 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. బంతుల పరంగా చూస్తే అందరికంటే వేగంగా (5126 బంతుల్లో) ఈ ఘనత సాధించిన బౌలర్‌గా అతను రికార్డు సాధించాడు. ఇందు కోసం మిచెల్ స్టార్క్‌కు (ఆస్ట్రేలియా) 5240 బంతులు పట్టాయి. తక్కువ ఇన్నింగ్స్‌లో ఈ ఘనత సాధించిన భారత బౌలర్‌గానూ షమీ గుర్తింపు పొందాడు. గతంలో అజిత్ అగార్కర్ 133 ఇన్నింగ్స్‌లో ఈ మైలురాయి అందుకోగా... షమీ 103 ఇన్నింగ్స్‌లు తీసుకున్నాడు.

60 ఐసీసీ టోర్నీల్లో అత్యధిక (60) వికెట్లు తీసిన భారత బౌలర్‌గా షమీ నిలిచాడు. జహీర్ ఖాన్ (32 ఇన్నింగ్స్‌లలో 59) రికార్డును షమీ (19 ఇన్నింగ్స్‌లలో 60) సవరించాడు.

11,000 వన్డేల్లో రోహిత్ 11 వేల పరుగులు పూర్తి చేసుకొని ఈ ఘనత సాధించిన 10వ ఆటగాడిగా నిలిచాడు.

156 వన్డేల్లో కోహ్లి క్యాచ్‌ల సంఖ్య. భారత్ తరఫున అత్యధిక క్యాచ్‌లు పట్టిన ఫీల్డర్‌గా అజహరుద్దీన్ (156) రికార్డును సమం చేయగా... జయవర్ధనే (218), పాంటింగ్ (160) వీరికంటే ముందున్నారు.

చాంపియన్స్ ట్రోఫీలో నేడు
దక్షిణాఫ్రికా x అఫ్గానిస్తాన్
వేదిక: కరాచీ
మధ్యాహ్నం గం. 2:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ 18, జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

షమీ... శుబ్... ఆరంభం



గిల్ సెంచరీ అభివాదం

229 పరుగుల స్వల్ప విజయలక్ష్యం...భారత్‌లాంటి బలమైన జట్టు ఆడుతూపాడుతూ దీనిని ఛేదిస్తుందని ఎవరైనా భావిస్తారు... కానీ పిచ్ ఒక్కసారిగా నెమ్మదించింది... పరుగులు రావడం కష్టంగా మారిపోయింది. ఈ స్థితిలో శుబ్‌మన్ గిల్ పట్టుదలగా నిలబడ్డాడు... కీలక భాగస్వామ్యాలతో జట్టును గెలుపుతీరం చేర్చడంతో పాటు వరుసగా రెండో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అంతకుముందు భారత్ పదునైన బౌలింగ్‌కు ఒకదశలో 35/5 వద్ద కుప్పకూలే స్థితిలో నిలిచిన బంగ్లాదేశ్... తౌహీద్, జాకీర్ ఆటతో 200 పరుగులు దాటగలిగింది. మరో ఐసీసీ మ్యాచ్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనతో షమీ తన పునరాగమాన్ని ఘనంగా ప్రదర్శించాడు. శుభారంభం తర్వాత ఆదివారం అసలు పోరులో పాకిస్తాన్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

చాంపియన్స్ ట్రోఫీ తొలి పోరులో భారత్ ఘన విజయం

ఆరు వికెట్లతో బంగ్లాదేశ్ చిత్తు ● గిల్ అజేయ సెంచరీ
5 వికెట్లతో మెరిసిన షమీ ● ఆదివారం పాకిస్తాన్‌తో పోరు

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో భారత్ గెలుపు బోణీ చేసింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌటైంది. తౌహీద్ హృదయ్ (118 బంతుల్లో 100; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) కెరీర్‌లో తొలి సెంచరీ సాధించగా... జాకీర్ అలీ (114 బంతుల్లో 68; 4 ఫోర్లు) రాణించాడు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 34.2 ఓవర్లలో 154 పరుగులు జోడించారు. మొహమ్మద్ షమీ (5/53) ఐదు వికెట్లతో చెలరేగగా... హర్షిత్ రాణా 3, అక్షర్ 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 46.3 ఓవర్లలో 4 వికెట్లకు 231 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (129 బంతుల్లో 101 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ శతకం నమోదు చేయగా... కెప్టెన్ రోహిత్ శర్మ (36 బంతుల్లో 41; 7 ఫోర్లు), కేఎల్ రాహుల్ (47 బంతుల్లో 41 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించారు.

భారీ భాగస్వామ్యం...

తొలి 5 వికెట్లకు 35 పరుగులు... చివరి 5 వికెట్లకు 39 పరుగులు... మధ్యలో తౌహీద్, జాకీర్ భారీ భాగస్వామ్యం! బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ సాగిన తీరిది. షమీ, రాణా దెబ్బకు టపటపా 3 వికెట్లు కోల్పోయిన బంగ్లాను అక్షర్ తన తొలి ఓవర్లోనే దెబ్బ కొట్టాడు. వరుస బంతుల్లో తన్‌జీద్ (25 బంతుల్లో 25; 4 ఫోర్లు), ముష్ఫికర్ (0)ను అవుట్ చేసిన అతను త్రుటిలో హ్యాట్రిక్ కోల్పోయాడు. 35/5 నుంచి తౌహీద్, జాకీర్ జట్టును ఆదుకున్నారు. భారత ఆటగాళ్ల పేలవ ఫీల్డింగ్ కూడా వారికి కలిసొచ్చింది. సుదీర్ఘ ప్రయత్నం తర్వాత ఎట్టకేలకు 206 బంతుల ఈ భాగస్వామ్యాన్ని షమీ విడగొట్టాడు. ఆ తర్వాత 49వ ఓవర్ తొలి బంతికి సింగిల్‌తో తౌహీద్ 114 బంతుల్లో కెరీర్‌లో తొలి సెంచరీని పూర్తి చేసుకున్నాడు.

రాణించిన రాహుల్...

స్వల్ప లక్ష్యమే అయినా భారత్ ఛేదన సులువుగా సాగలేదు. ముస్తఫిజుర్ ఓవర్లో 3 ఫోర్లు సహా కొన్ని చక్కటి షాట్లు ఆడిన రోహిత్ పదో ఓవర్లో వెనుదిరగ్గా, గిల్ తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత పిచ్ ఒక్కసారిగా మందగించడంతో పరుగుల రాక గగనమైంది. గిల్, విరాట్ కోహ్లి (38 బంతుల్లో 22; 1 ఫోర్) కలిసి 12.5 ఓవర్లలో 43 పరుగులే జోడించగలిగారు. అనంతరం 11 పరుగుల వ్యవధిలో శ్రేయస్ అయ్యర్ (15), అక్షర్ పటేల్ (8) అవుటయ్యారు. అయితే గిల్‌కు రాహుల్ అండగా నిలిచాడు. బంగ్లా బౌలర్లు మధ్యలో కొద్ది సేపు ఆధిపత్యం ప్రదర్శించినట్లు కనిపించినా... నిలదొక్కుకున్న తర్వాత వీరిద్దరు స్వేచ్ఛగా ఆడారు. గిల్, రాహుల్ 16.2 ఓవర్లలో అభేద్యంగా 87 పరుగులు జోడించి మ్యాచ్‌ను ముగించారు. ఈ క్రమంలో 46వ ఓవర్లో సింగిల్‌తో 125 బంతుల్లో గిల్ వన్డేల్లో ఎనిమిదో సెంచరీని పూర్తి చేసుకున్నాడు.



తౌహీద్ హృదయ్



షమీ

అక్షర్ 'హ్యాట్రిక్' మిస్

మ్యాచ్‌లో బంగ్లాను తక్కువ స్కోరుకే పరిమితం చేయగలిగినా భారత్ ఫీల్డింగ్ స్థాయికి తగినట్లుగా లేకపోయింది. అక్షర్ తొలి ఓవర్లో వరుసగా రెండు వికెట్ల తర్వాత జాకీర్ (0 వద్ద) ఇచ్చిన అతి సునాయాస క్యాచ్‌ను స్లిప్‌లో రోహిత్ వదిలేశాడు. దాంతో అక్షర్ 'హ్యాట్రిక్' అవకాశం చేజారింది. రోహిత్ ఆ క్యాచ్ పట్టి ఉంటే స్కోరు 35/6తో ఇక కోలుకునే అవకాశం లేకపోయేది. ఆ తర్వాత జాకీర్ 24 వద్ద ఉన్నప్పుడు జడేజా బౌలింగ్‌లో స్టంప్ చేసే అవకాశాన్ని రాహుల్ చేజార్చాడు. చివరకు బ్యాటర్ 68 పరుగులు సాధించగలిగాడు. తౌహీద్ స్కోరు 23 వద్ద కుల్దీప్ బౌలింగ్‌లో మిడాఫ్‌లో పాండ్యా సునాయాస క్యాచ్ వదిలేయగా చివరకు అతను సెంచరీ పూర్తి చేసుకోగలిగాడు. ఇన్నింగ్స్ ఆరంభంలో 12 వద్ద తన్‌జీద్‌ను రనౌట్ చేసే అవకాశం వచ్చినా...అయ్యర్ త్రో స్టంప్స్‌కు చాలా దూరంగా వెళ్లింది. భారత్ ఇన్నింగ్స్‌లో రాహుల్ 9 వద్ద ఉన్నప్పుడు జాకీర్ సులువైన క్యాచ్ వదిలేసి మేలు చేశాడు.



స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తన్‌జీద్ (సి) రాహుల్ (బి) అక్షర్ 25; సౌమ్య సర్కార్ (సి) రాహుల్ (బి) షమీ 0; నజ్ముల్ (సి) కోహ్లి (బి) రాణా 0; మిరాజ్ (సి) గిల్ (బి) షమీ 5; తౌహీద్ (సి) షమీ (బి) రాణా 100; ముష్ఫికర్ (సి) రాహుల్ (బి) అక్షర్ 0; జాకీర్ (సి) కోహ్లి (బి) షమీ 68; రిషాద్ (సి) పాండ్యా (బి) రాణా 18; తన్‌జీమ్ (బి) షమీ 0; తస్కీన్ (సి) అయ్యర్ (బి) షమీ 3; ముస్తఫిజుర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (49.4 ఓవర్లలో ఆలౌట్) 228. వికెట్ల పతనం:** 1-1, 2-2, 3-26, 4-35, 5-35, 6-189, 7-214, 8-215, 9-228, 10-228. **బౌలింగ్:** షమీ 10-0-53-5, హర్షిత్ రాణా 7.4-0-31-3, అక్షర్ 9-1-43-2, పాండ్యా 4-0-20-0, జడేజా 9-0-37-0, కుల్దీప్ 10-0-43-0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) రిషాద్ (బి) తస్కీన్ 41; గిల్ (నాటౌట్) 101; కోహ్లి (సి) సర్కార్ (బి) రిషాద్ 22; అయ్యర్ (సి) నజ్ముల్ (బి) ముస్తఫిజుర్ 15; అక్షర్ (సి అండ్ బి) రిషాద్ 8; రాహుల్ (నాటౌట్) 41; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (46.3 ఓవర్లలో 4 వికెట్లకు) 231. వికెట్ల పతనం:** 1-69, 2-112, 3-133, 4-144. **బౌలింగ్:** తస్కీన్ 9-0-36-1, ముస్తఫిజుర్ 9-0-62-1, తన్‌జీమ్ 8.3-0-58-0, మిరాజ్ 10-0-37-0, రిషాద్ 10-0-38-2.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాత్విక్ సాయిరాజ్‌కు పితృవియోగం

గుండెపోటుతో తండ్రి కాశీ విశ్వనాథం మృతి



సాక్షి, అమలాపురం: ఇది విధి రాసిన విషాదవార్త! తనయుడి అవార్డుని చూసి మురిసిపోదామనుకుంటే... తండ్రి భౌతికకాయాన్ని చూసి కన్నీరు మున్నీరయ్యే పరిస్థితి! 'ఖేల్‌రత్న'తో విజయోత్సవ వేడుకలు చేసుకోవాల్సిన ఇంట విషాదం అలుముకున్న దుస్థితి! ఆంధ్రప్రదేశ్ స్టార్ షట్లర్ సాత్విక్ సాయిరాజ్ తండ్రి రంకిరెడ్డి కాశీ విశ్వనాథం గురువారం ఉదయం గుండెపోటుతో హఠాత్తుగా కన్నుమూశారు. ఆయనకు భార్య రంగమణి, ఇద్దరు కుమారులు రాంచరణ్, సాత్విక్ ఉన్నారు. 65 ఏళ్ల కాశీ విశ్వనాథం గురువారం సాయంత్రం దేశ రాజధానిలో తనయుడు సాత్విక్‌కు 'ఖేల్‌రత్న' పురస్కార ప్రదానోత్సవంలో పాల్గొనాల్సి ఉంది. ఇందుకోసం సొంతూరు అమలాపురం నుంచి కారులో రాజమండ్రి విమానాశ్రయానికి బయలుదేరిన ఆయన పట్టణం దాటిన కొద్దిసేపటికే గుండెపోటుకు గురై మృతి చెందారు. ఊహించని విషాద వార్త అక్కడి కుటుంబసభ్యుల్ని, ఢిల్లీలో ఉన్న సాత్విక్ సాయిరాజ్‌ను కన్నీటి సంద్రంలో ముంచేసింది. అమెరికాలో ఉన్న సాత్విక్ సోదరుడు రాంచరణ్ స్వస్థలం చేరుకున్నాక శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తారు.

బ్యాడ్మింటన్ క్రీడపై ఆసక్తి కనబరిచిన సాత్విక్‌కు తొలి కోచ్‌గా ఓనమాలు నేర్పిన తండ్రి తదనంతరం అతని ప్రతిభను గుర్తించి అంతర్జాతీయ షట్లర్‌గా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించారు. డబుల్స్‌లో అసాధారణ ప్లేయర్‌గా ఎదిగిన సాత్విక్ ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య అంతర్జాతీయ టోర్నీల్లో, ఒలింపిక్స్, కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో పాల్గొన్నాడు. అనతికాలంలోనే ఎన్నో పతకాలు, ట్రోఫీలు నెగ్గిన సాత్విక్ ప్రతిభను గుర్తించిన భారత ప్రభుత్వం సాత్విక్‌తోపాటు అతని డబుల్స్ భాగస్వామి చిరాగ్ శెట్టిని 2023 సంవత్సరానికిగాను 'ఖేల్‌రత్న' పురస్కారానికి ఎంపిక చేసింది. 2024 జనవరిలో ఢిల్లీలో జాతీయ క్రీడా అవార్డుల ప్రదానోత్సవం జరగ్గా... సాత్విక్-చిరాగ్ మలేసియా ఓపెన్ టోర్నీ లో ఆడుతుండటంతో హాజరు కాలేకపోయారు. ప్రస్తుతం పెట్రోలియం స్పోర్ట్స్ ఇంటర్ యూనిట్ టోర్నీ ఆడేందుకు సాత్విక్, చిరాగ్ ఢిల్లీలో ఉన్నారు. దాంతో కేంద్ర క్రీడా శాఖ 'ఖేల్‌రత్న' అందజేయాలని భావించి కార్యక్రమం ఏర్పాటు చేసింది.

గ్రూప్-2 మెయిన్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

- 23వ తేదీన 175 కేంద్రాల్లో పరీక్షలు
- 92,250 మంది అభ్యర్థులు హాజరు



సాక్షి, అమరావతి: ఏపీపీఎస్సీ గ్రూప్–2 మెయిన్ రాత పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చెప్పారు. ఈ నెల 23వ తేదీన జరగనున్న పరీక్షల నిర్వహణపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఏపీపీఎస్సీ చైర్మన్ ఎ.అనురాధతో కలసి ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. 13 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని 175 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షలకు 92,250 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఎక్కడైనా ఎవరైనా వదంతులు లేదా నకిలీ వార్తలు సోషల్ మీడియాలో ప్రసారం చేసినా లేదా సర్క్యులేట్ చేసినా అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆలస్యంగా వస్తే అనుమతించేది లేదు

చైర్‌పర్సన్ అనురాధ మాట్లాడుతూ.. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పేపర్– 1 రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఉదయం.9.30 గంటలలోపు ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఉదయం 9.45 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేయాలని, ఆలస్యంగా వచ్చిన ఎవ్వరినీ లోనికి అనుమతించకూడదని స్పష్టం చేశారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకూ పేపర్–2 పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు మధ్యాహ్నం 2.30 గంటల్లోగా ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, 2.45 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేసి ఆ తర్వాత ఎట్టిపరిస్థితుల్లోను అభ్యర్థులెవరినీ లోనికి అనుమతించకూడదని ఆమె స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు చెప్పారు.

గ్రూప్-2 పరీక్ష నిలిపివేయలేం

హైకోర్టు న్యాయమూర్తి సత్తి సుబ్బారెడ్డి ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: ఈ నెల 23న జరిగే గ్రూప్–2 ప్రధాన పరీక్ష నిలిపివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ విషయంలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని తేల్చి చెప్పింది. షెడ్యూల్ ప్రకారం ప్రధాన పరీక్ష జరగకపోతే అర్హులైన అభ్యర్థులందరి ప్రయోజనాలు ప్రమాదంలో పడతాయని తెలిపింది. ప్రధాన పరీక్షకు 92,250 మంది అర్హత సాధించారని, అందులో ఇద్దరే హారిజాంటల్ రిజర్వేషన్‌పై అభ్యంతరం తెలుపుతూ తదుపరి చర్యలన్నీ నిలిపేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారని పేర్కొంది. ఒకవేళ పిటిషనర్లు ఈ వ్యాజ్యంలో విజయం సాధిస్తే, అప్పుడు ఈ కోర్టు మొత్తం ప్రక్రియను తిరిగి ప్రారంభించాలని ఆదేశిస్తుందని తెలిపింది. అయితే ప్రధాన పరీక్షను నిలిపేస్తే అనేక మంది అభ్యర్థులకు తీరని నష్టం కలుగుతుందని పేర్కొంది. అందువల్లే ప్రధాన పరీక్షను నిలుపుదల చేయడం లేదంది. అయితే నోటిఫికేషన్‌కు అనుగుణంగా చేపట్టే తదుపరి చర్యలన్నీ ఈ వ్యాజ్యాల్లో వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటాయని హైకోర్టు తేల్చి చెప్పింది. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో 10 రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 11కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏప్రిల్‌లో పాలీసెట్-2025

సాక్షి, అమరావతి: ఏపీ పాలీసెట్-2025ను ఏప్రిల్ 30న నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. పరీక్షల నిర్వహణకు రాష్ట్రంలో 69 సమన్వయ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే పరీక్షకు 1.50 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. దరఖాస్తు ఫీజు ఓసీ/బీసీ అభ్యర్థులకు రూ.400, ఎస్సీ, ఎస్టీలకు రూ.100గా నిర్ణయించారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సాంకేతిక విద్యాశాఖను ఆదేశిస్తూ గురువారం విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కర్నూలులో మహిళకు జీబీ సిండ్రోమ్!

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు నగరంలో మరో గులియన్ బారే సిండ్రోమ్ (జీబీ సిండ్రోమ్) కేసు నమోదైంది. నగరంలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన డి.గోకారమ్మ(44)కు ఈ వ్యాధి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ నెల 15న కాళ్లు సచ్చుబడిపోయి ఆస్పత్రికి రావడంతో వైద్యులు ఆమెను జనరల్ మెడిసిన్ వార్డులో ఉంచి చికిత్స చేస్తున్నారు. తాజాగా బుధవారం ఆమెను ఆస్పత్రిలోని ఏఎంసీ వార్డులో చేర్చారు. ప్రస్తుతం కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.కాగా, గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 48 జీబీ సిండ్రోమ్ కేసులు గుర్తించి ఆస్పత్రిలో చికిత్స అందించారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఏపీ సీఎస్ కే విజయానంద్
- ఫిర్యాదులకు రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్ నంబరు 18004251531

సాక్షి, అమరావతి: రెగ్యులర్ ఇంటర్, ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్ పరీక్షలపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ విద్యా శాఖ అధికారులతో సమీక్షించారు. మార్చి, ఏప్రిల్ నెలలు పరీక్షల నెలలని, సజావుగా నిర్వహించేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. రెగ్యులర్ ఇంటర్ పరీక్షలకు 1,535 కేంద్రాలకు గాను 68 సెంటర్లను సున్నిత, 36 కేంద్రాలను అతి సున్నితమైనవిగా గుర్తించామన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని వీటిలో పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని విజయానంద్ ఆదేశించారు. వేసవి దృష్ట్యా తాగునీరు, ప్రథమ చికిత్స, విద్యుత్తు, బెంచ్‌లు వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.పేపర్ లీకేజీ వంటి వదంతులు వ్యాపింపజేసేవారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు జారీ చేయాలని, జిరాక్స్ సెంటర్లు, ఇంటర్‌నెట్ కేంద్రాలు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్ మాట్లాడుతూ విద్యార్థులు సకాలంలో చేరుకునేలా తగిన సంఖ్యలో బస్సులను నడపాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఫిర్యాదుల స్వీకరణకు రాష్ట్రస్థాయిలో కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబరు 18004251531 ఏర్పాటు చేశామని, జిల్లా కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు నెలకొల్పాలని కలెక్టర్లకు సూచించారు. వయోజన విద్యాశాఖ డైరెక్టర్ కృతికా శుక్లా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఏర్పాట్లను వివరించారు. కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులేవీ అనుమతించొద్దని స్పష్టం చేశారు. తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు గదుల్లో తగినంత వెలుతురు ఉండేలా, విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని నిర్దేశించారు. పరీక్ష కేంద్రాలను సీసీ కెమెరాలతో అనుసంధానించి చీఫ్ సూపరింటెండెంట్ లైవ్ స్ట్రీమింగ్‌లో పర్యవేక్షించాలని తెలిపారు. ప్రథమ చికిత్స కిట్లతో పాటు అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్‌ను కూడా అందుబాటులో ఉంచేలా చూడాలని తెలిపారు. రాష్ట్రంలో మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు రెగ్యులర్ ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. 1 నుంచి 19 వరకు ప్రథమ, 3 నుంచి 20 వరకు ద్వితీయ సంవత్సర పరీక్షలు నిర్వహించనున్నారు. 26 జిల్లాల్లో 10,58,892 మంది హాజరు కానున్నారు. ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్ పరీక్షలు మార్చి 3 నుంచి 15 వరకు జరగనుండగా 325 కేంద్రాల్లో 67,952 మంది హాజరుకానున్నారు.

Published and printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

కవి సర్వజ్ఞ జయంతి



ఊరేగింపులో పాల్గొన్న ప్రముఖులు

రాయచూరు రూరల్: నగరంలో కవి సర్వజ్ఞ జయంతిని ఆచరించారు. గురువారం అంబేడ్కర్ సర్కిల్‌లో కవి సర్వజ్ఞ చిత్రపటానికి శాసన సభ్యుడు శివరాజ్ పాటిల్ పూలమాల వేసి పూజలు నిర్వహించారు. అనంతరం పండిత సిద్దరామ జంబలదిన్ని రంగమందిరంలో జిల్లాధికార యంత్రాంగం, జిల్లా పంచాయతీ, నగరసభ, కన్నడ సంస్కృతి శాఖల ఆధ్వర్యంలో త్రిపది జయంతిని ప్రారంభించారు. తహసీల్దార్ సురేష్ వర్మ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున ఉన్న కుమ్మర సమాజం ఆర్థికంగా, సాంఘీకంగా, విద్యాపరంగా అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో సమాజం అధ్యక్షుడు సురేంద్రబాబు, నగర సభ అధ్యక్షురాలు నరసమ్మ, ఆంజనేయ, తిమ్మప్ప ఫిరంగిలున్నారు.

రేపు రాయచూరు మహోత్సవం

రాయచూరు రూరల్: నగరంలో ఈనెల 22న రాయచూరు మహోత్సవం-2025ను నిర్వహిస్తున్నట్లు డాజిల్ సూపర్ స్టార్ వీరేంద్ర జాలదార్, విశ్వాస్ జాలదార్ వెల్లడించారు. గురువారం ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1995 నుంచి ఇంతవరకు నృత్యం, సంగీత, గీతాలాపనలో ఎంతో మంది ప్రతిభావంతులను తెరపైకి తెచ్చామన్నారు. ఆరోజున నగరంలోని మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో రాయచూరు మహోత్సవం కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.

శస్త్రచికిత్సతో కుళ్లిన వెన్నెముక తొలగింపు



కుళ్లిన వెన్నెముక తొలగించిన దృశ్యం



ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ శ్రీధర్ రెడ్డి

రాయచూరు రూరల్: నగరంలోని బాలంకు ఆస్పత్రిలో కుళ్లిన వెన్నెముకను శస్త్రచికిత్స ద్వారా తొలగించడంలో వైద్యులు సఫలీకృతులయ్యారు. ఓ రోగికి ఇటీవల బాలంకు ఆస్పత్రిలో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి బృందం ఐదు గంటల పాటు శస్త్రచికిత్స చేసి కుళ్లిన వెన్నెముకను తొలగించారు. ఐదు నెలల క్రితం క్షయ వ్యాధి సోకిన వ్యక్తికి నరాలు బలహీనం కావడంతో సీటీ స్కాన్ పరీక్ష జరిపారు. మూడో స్పైనల్ కార్డు కుళ్లిపోయి ఆరోగ్యం క్షీణించడంతో శస్త్రచికిత్స చేసి కుళ్లిన వెన్నెముకను తొలగించి రోగి ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మేలుకుంది, యశ్వంత్, సర్ఫరాజ్‌లున్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల సమ్మె



వాకౌట్ సమ్మె చేస్తున్న ఉద్యోగులు

బళ్లారి రూరల్: ఎల్ఐసీ సంస్థలో ఉద్యోగ నియామకాలను చేపట్టాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన గంటపాటు వాకౌట్ సమ్మెలో భాగంగా గురువారం మధ్యాహ్నం బళ్లారి బ్రాంచ్-2లో సమ్మె చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘ కార్యదర్శి సూర్యనారాయణ మాట్లాడారు. ఎల్ఐసీ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. దీంతో ఇప్పుడు పని చేస్తున్న ఉద్యోగులపై పని భారం పెరిగింది. దీంతో ఒత్తిడికి లోనవుతున్నారు. పాలసీదారులకు ఉత్తమ సేవలు అందించడానికి ఉద్యోగాల భర్తీ అత్యంత ఆవశ్యకమని తెలిపారు. ఇంతటి కఠిన పరిస్థితుల్లో ఎల్ఐసీ యాజమాన్యం ఎటువంటి చర్యలు తీసుకోడానికి ముందుకు రాకపోవడంతో అఖిల భారత ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం దేశవ్యాప్తంగా గంట పాటు విధులు బహిష్కరించి వాకౌట్ సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. యాజమాన్యం స్పందించక పోతే దేశవ్యాప్తంగా ఉగ్రపోరాటానికి పూనుకోనున్నట్లు తెలిపారు. సమ్మెలో అధ్యక్షుడు దత్తాత్రేయ, కోశాధికారి విఘ్నేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

విలువైన కెమెరా లెన్స్ చోరీ

హొసపేటె: తుంగభద్ర జలాశయం పోటు జలాల ప్రాంతంలోని గుండా అడవి సమీపంలో నిలిపి ఉన్న కారు అద్దాలు పగులగొట్టి ప్రీ వెడ్డింగ్ ఫోటో షూట్‌కు ఉపయోగించే కెమెరా లెన్స్‌లను దుండగులు చోరీ చేసిన ఘటన గురువారం జరిగింది. రూ.4 లక్షల విలువైన కెనాన్ ఆర్ 5 కెమెరా, లెన్స్ చోరీకి గురయ్యాయి. చోరీకి గురైన కెమెరా, లెన్స్ రాయచూరు జిల్లాలోని మాన్వికి చెందిన ఫోటోగ్రాఫర్ హుమయూన్‌కు చెందినవని పోలీసులు తెలిపారు. హుమయూన్ ఏపీ-40 ఏఎం-5041 నంబరుగల కారులో కెమెరా, లెన్స్ పెట్టుకొని ఫోటో షూట్ చేస్తున్నాడు. కారు వద్ద ఎవరూ లేకపోవడంతో అద్దాన్ని పగలగొట్టి కెమెరా, లెన్స్‌ను అపహరించారు. ఘటనపై మరియమ్మనహళ్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

మహిమాన్విత ఆలయం.. సమస్యల నిలయం

- దత్తాత్రేయుడు కొలువైన పుణ్యక్షేత్రం గాణగాపుర
- అస్తవ్యస్తంగా రోడ్లు, లోపించిన పరిశుభ్రత



ఆలయంలో స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సాక్షి,బళ్లారి: నిత్యం వేలాది మంది భక్తులతో కిటికిటలాడే మహిమాన్విత పుణ్యక్షేత్రంలో మౌలిక సదుపాయాలతో పాటు స్వచ్ఛత కరువు కావడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భక్తులకు కొంగుబంగారంగా పిలవబడే ఈ క్షేత్రానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. మాఘ మాసంలో ప్రతి ఏటా భక్తుల సందడి పెరిగే ఈ ఆలయం విశిష్టత, చరిత్రను పరిశీలిస్తే...

యోగమార్గ శిక్షణ, సన్యాసాశ్రమ ధర్మాచరణ, భక్తి మార్గ పరిరక్షణ అనే మూడు అంశాలు నేపథ్యంగా ఆవిష్కారమైన త్రిమూర్తుల అంశావతార మహాపుణ్యక్షేత్రమైన గాణగాపుర ప్రతి నిత్యం భక్తుల సందడితో విరాజిల్లుతోంది. గురువులకే ఆది గురువైన దత్తాత్రేయుడు దివ్య నిర్గుణపాదుకలను దర్శించుకోవడానికి భక్తుల పరంపరం కొనసాగుతోంది. మహావిష్ణువు దశావతరాల పరంపరలో భాగంగా అత్రి, అనసూయ దంపతులకు మార్గశిర పౌర్ణమి రోజున శ్రీహరి దత్తాత్రేయుడుగా జన్మించారని పురాణాలు చెబుతున్నాయి. అంతేకాకుండా త్రిమూర్తుల అంశావతారమని కూడా పురాణాలు ఘోషిస్తున్నాయి. దత్తాత్రేయ క్షేత్రంలో నిత్యం దిగంబర..దిగంబర.. శ్రీపాదవల్లభ దిగంబర అంటూ భక్తులు వేనోళ్ల కీర్తించుకునే గురుదైవం దత్తాత్రేయుల వారి నిండైన విగ్రహాలు గాణాపురలో వెలసి ఉన్నాయి.

కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్వితుడు

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురిని ఏకకాలంలో దర్శించుకుంటున్నామా అని భక్తులు పరవశించిపోయే మహాపుణ్యక్షేత్రమిది. దత్తాత్రేయుడి పాదుకలను దర్శించుకోవడానికి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి నిత్యం వచ్చే భక్తులతో కిటకిటలాడుతోంది. దివ్యపాదుకలతో పాటు కల్లేశ్వర ఆలయం, సంగమ భీమా దర్శనాలు ఇక్కడి విశేషం. శ్రీదత్త శరణం మమా అంటూ నిత్యం ఇక్కడ స్మరించుకోవడానికి భక్తులు తరలివస్తుంటారు. దత్తక్షేత్రంగా ప్రసిద్ధిపొందిన గాణగాపురలో ఉడిపిలో శ్రీకృష్ణుని దర్శనం మాదిరిగానే దత్తాత్రేయుడు శ్రీగురు పాదుకలను ఒక గవాక్షంలో దర్శనం చేసుకుంటూ భక్తులు పునీతులవుతుంటారు. భీమ, అమర్జా అనే రెండు నదుల సంగమం కూడా ఇక్కడ ఉంది. దత్తాత్రేయుడి రెండో అవతారమైన శ్రీనరసింహస్వామి రూపం అని కూడా భక్తుల నమ్మకం. సంగమ భీమా దర్శనం, ఏకగవాక్షి ద్వారా శ్రీగురు పాదుకలను, శ్రీకల్లేశ్వర, శనిమందిరం, శ్రీఆంజనేయ స్వామి, పంచముఖ గణపతిని, అశ్వర్థ వృక్షాన్ని, నరసింహ సరస్వతి ఆలయం, మేడిచెట్టును దర్శించుకునే శ్రీదత్తాత్రేయ ఆలయం కలబుర్గి జిల్లా అఫ్జల్‌పుర తాలూకాలోని గాణగాపురలో వెలసి ఉంది.

ఆలయ పరిసరాల్లో భక్తుల పాట్లు

దత్తాత్రేయ ఆలయ పరిసరాల్లో సమస్యలు తిష్ట వేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాక్షాత్తు బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరులు కొలువుదీరారని భక్తులు విశ్వసించే, పురాణాలు ఘోషించే శ్రీదత్తాత్రేయ ఆలయ ముఖ ద్వారం ముందే రోడ్డు గుంతలమయంగా కనిపిస్తోంది. శ్రీకల్లేశ్వర, శనిమందిరానికి వెళ్లే దారి కంకర తేలి గుంతల మయంగా ఉండటంతో రెండు కిలోమీటర్ల దూరం మేర ఆలయం వద్దకు చేరుకునేందుకు నానాయాతన పడుతున్నారు. సంగమ, భీమా నదిలో స్నానాలు చేస్తే ఎంతో పుణ్యం వస్తుందని భక్తులు ఎంతో దూరం వచ్చే ఈ క్షేత్రంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో నిత్యం భక్తులు పడుతున్న ఇబ్బందులు వర్ణించలేనివి. గాణగాపుర శ్రీదత్తాత్రేయ ఆలయానికి దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులకు ఇక్కడ స్వామివారిని దర్శించుకునేందుకు క్షేత్ర పరిసరాల్లో కల్పించాల్సిన రోడ్లు, స్వచ్ఛత తదితర మౌలిక సదుపాయాలపై పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి మహామహిమాన్విత క్షేత్రంలో స్వచ్ఛత, పారిశుధ్యంపై ఆలయ కమిటీ నిర్వాహకులు, పాలకులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.



ప్రధాన వీధిలో పశువులు, లోపించిన పరిశుభ్రత



ఆలయ వీధిలో పడిన చెత్తచెదారం, చిత్తు కాగితాలు

నేడు ఎల్లో జోగప్ప నిన్న అరమనె చిత్రం విడుదల

హుబ్లీ: రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి ఎల్లో జోగప్ప నిన్న అరమనె సినిమాను విడుదల చేస్తున్నట్లు ఆ చిత్ర దర్శకుడు హయవదన, నిర్మాత పవన్ సీనికెరి తెలిపారు. వారు స్థానిక మీడియాతో మాట్లాడుతూ పాండోరస్ బాక్స్ ప్రొడక్షన్స్ అండ్ కృష్ణఛాయ చిత్ర బ్యానర్‌లో ఈ చిత్రాన్ని బెంగళూరు, మైసూరు, ఉత్తర కర్ణాటకలోని చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా బాగల్‌కోటె, విజయపుర, మహారాష్ట్రలోని పండరాపుర, ఆగ్రా, ఢిల్లీ, మనాలి, హిమాచల్‌ప్రదేశ్‌లోని మరికొన్ని ప్రాంతాలు, ఉత్తరాఖండ్‌లో షూటింగ్ చేశామన్నారు. ఫొటోగ్రఫీ నటరాజ మాదాల, శివం సంగీతం అందించిన ఈ చిత్రంలో అంజన్ నాగేంద్ర, సంజనదాస్, శరత్ లోహితాశ్వ, స్వాతి, దినేష్ మంగళూరు, దానప్ప ఉమేష్, విఠల పరీట, ఇలా విట్లా నటించారన్నారు.

దుకాణాల తొలగింపుపై నిరసన



నిరసన తెలియజేస్తున్న ఫుట్‌పాత్ వ్యాపారులు

రాయచూరు రూరల్: సింధనూరు-హైదరాబాద్ జాతీయ రహదారిలోని ఫుట్‌పాత్ దుకాణాలను తొలగించడం తగదని ఏఐసీసీటీయూ డిమాండ్ చేసింది. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు నాగరాజ్ మాట్లాడారు. సింధనూరు-హైదరాబాద్ జాతీయ రహదారిలో ఫుట్‌పాత్‌పై వెలసిన, నిర్మించుకున్న దుకాణాల తొలగింపునకు నగరసభ, సిటీ కార్పొరేషన్ అధికారులు శ్రీకారం చుట్టారన్నారు. వ్యాపారులకు తగిన పరిహారం అందించాలన్నారు. లేకుంటే ప్రైవేట్ బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు తీర్చడానికి ఇబ్బందిగా మారుతుందన్నారు. వీధుల్లో వ్యాపారులు, ఫుట్‌పాత్ వ్యాపారులకు పరిహారం, ప్రత్యామ్నాయం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

పేదలకు ఇళ్ల మంజూరుకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న జనార్దన

రాయచూరు రూరల్: నగరంలోని మురికివాడల్లో నివాసమున్న పేదలకు ప్రమాణ పత్రాలను ఇచ్చి ఇళ్లను మంజూరు చేయాలని మురికివాడ ప్రాంత క్రియా సేన సమితి అధ్యక్షుడు జనార్దన డిమాండ్ చేశారు. గురువారం జిల్లాధికారి కార్యాలయంలో శాసన సభ్యుడు శివరాజ్ పాటిల్ అధ్యక్షతన వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగరంలో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రూ.6 లక్షల్లో కేవలం స్లం బోర్డు అధికారులు రూ.3 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. సగానికే నిర్మాణాలు చేపట్టి మిగిలిన భాగాన్ని పూర్తి చేయాలంటే ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు.

డాక్టర్ అనన్యరావు మృతదేహం లభ్యం



డాక్టర్ అనన్యరావు మృతదేహం వద్ద గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది



గాలింపు అనంతరం నదిలో లభించిన డాక్టర్ అనన్యరావు మృతదేహం

సాక్షి,బళ్లారి/హొసపేటె: ప్రపంచ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న హంపీ అందాలతో పాటు చుట్టుపక్కల తుంగభద్ర నదీ తీర ప్రాంతాలను సందర్శించి రెండు రోజులు సేద తీరుదామని వచ్చిన డాక్టర్ అనన్యరావు కానరాని లోకాలకు చేరింది. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అనన్య తన స్నేహితులతో కలిసి కొప్పళ జిల్లా గంగావతి తాలూకా సణాపురం వద్ద తుంగభద్ర నదిలో బుధవారం ఉదయం కొట్టుకుపోయిన సంగతి విదితమే. రెండు రోజులుగా అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, గజ ఈతగాళ్లు 16 గంటల పాటు ముమ్మరంగా గాలించడంతో నదిలో బండరాళ్ల మధ్యలో గురువారం డాక్టర్ అనన్య మృతదేహం లభ్యమైంది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో వైద్యురాలిగా పని చేస్తున్న డాక్టర్ అనన్య సెలవులు రావడంతో సరదాగా హంపీ పరిసరాలను, తుంగభద్ర నది సోయగాలను వీక్షించేందుకు వచ్చి ప్రాణాలు కోల్పోయింది. ఘటనపై మునిరాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనన్య మృతదేహాన్ని అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలించారు.

పౌష్టికాహార అక్రమ నిల్వ.. డీడీ, సీడీపీఓలపై వేటు

హుబ్లీ: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేయాల్సిన పౌష్టికాహార పదార్థాలను అక్రమంగా గోదాములో నిల్వ చేసిన కేసులో ధార్వాడ జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ హులిగవ్వ కుకునూర, హుబ్లీ సీడీపీఓ ముత్తన్నలను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలను వెల్లడించింది. కేసును తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం శాఖా విచారణలో ఉండగానే ఇద్దరిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి పాల్పడినట్లు తేలడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారనే ఆరోపణలతో మహిళా, బాలల కళ్యాణ అభివృద్ధి శాఖా ఉప కార్యదర్శి సీ.బలరామ గురువారం ఈ ఉత్తర్వులను వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రం లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని సమకూర్చడంలో డీడీ, సీడీపీఓ విఫలయ్యారు. కాలానుగుణంగా గోదాముల్లోని నిల్వలను పరిశీలించకుండా విధి నిర్వహణలో విఫలం కావడమేగాకుండా ఆహార పదార్థాల అక్రమ నిల్వలకు అవకాశం కల్పించారు. ఈ విషయంలో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలింది. దీంతో లబ్ధిదారులు పౌష్టికాహారం నుంచి వంచితులయ్యే ప్రమాదం ఉన్న కారణాన్ని చూపుతూ ఆదేశాలు వెల్లడించినట్లు ఓ అధికారి తెలిపారు.

చురుగ్గా హంపీ ఉత్సవ ప్రధాన వేదికల నిర్మాణం



హంపీ ఉత్సవ ప్రధాన వేదికలను నిర్మిస్తున్న దృశ్యం

హొసపేటె: ఈసారి హంపీ ఉత్సవ ప్రధాన వేదికల నిర్మాణం ఊపందుకుంది. విజయనగర శిల్ప కళా నమూనాలో హంపీ శ్రీవిరుపాక్షేశ్వర ఆలయంలోని ప్రధాన గోపుర నమూనాను వినియోగించి వేదికను ఆకర్షణీయంగా నిర్మించాలని జిల్లా యంత్రాంగం నడుం బిగించింది. హంపీ ఉత్సవ ప్రధాన వేదిక నిర్మాణ పనులు చురుకుగా జరుగుతుండటంతో ఈసారి హంపీ ఉత్సవాలు మరింతగా వైభవంగా నిర్వహించేందుకు అడుగులు పడుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన వేదిక ప్రధాన ఆకర్షణ కనుక ఈ వేదికను విరుపాక్షేశ్వర ఆలయం ప్రధాన గోపురం, రాతి రథం, సాసివెకాళు గణపతి, అంజనేయ స్వామి ఆలయం, హేమకూట పర్వతాలయం నమూనాలతో నిర్మిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఫిబ్రవరి 28, మార్చి 1, 2 తేదీల్లో ఉత్సవాలు జరుగనున్నాయి.

గుండెపోటుతో కార్మికుడి మృతి



మరణించిన చందన్‌సింగ్



మృతదేహాన్ని లాక్కెళుతున్న కార్మికులు

- మృతదేహాన్ని లాక్కెళ్లిన కార్మికులు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- ఆరుగురు నిందితుల అరెస్ట్

రాయచూరు రూరల్: కలబుర్గి జిల్లా సేడం తాలూకా కోడ్లా శ్రీసిమెంట్ పరిశ్రమలో విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో కార్మికుడు మరణించిన ఘటన జరిగింది. మృతుడిని సిమెంట్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న బిహార్ వలస కార్మికుడు చందన్ సింగ్(35)గా పోలీసులు గుర్తించారు. విధి నిర్వహణలో గుండెపోటు రావడం, రక్తపోటు(బీపీ) తగ్గడంతో ప్రాణాలు వదిలాడు. అయితే మానవత్వం మరచి మరణించిన సాటి కార్మికుడి మృతదేహాన్ని కార్మికులు లాక్కెళ్లిన ఘటన అందరినీ కలిచి వేసిన విషయంపై బుధవారం సాయంత్రం వీడియో వైరల్ అయింది. ఇందుకు సంబంధించి ఉత్తర భారతదేశానికి చెందిన హైదర్ అలీ, రవిశంకర్, హరిందర్ నిశాద్, అజయ్, రమేష్, చంద్రలను పోలీసులు అరెస్ట్ చేశారు.

అగ్నిప్రమాదంలో జొన్న పంట దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా కప్పగల్‌లో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు జొన్న పంటల రాశులకు నిప్పంటించిన ఘటన చోటు చేసుకుంది. రాజశేఖర్ గౌడ అనే రైతు తన 14 ఎకరాల పొలంలో పండించిన జొన్న పంటను గ్రామంలోని బసవణ్ణ ఆలయం సమీపంలో కుప్పగా వేశారు. అయితే ఎవరో దుండగులు కుప్పలకు నిప్పంటించారు. సమాచారం అందగానే పోలీసులు అగ్నిమాపక దళం సిబ్బందితో వచ్చి మంటలను ఆర్పారు. ప్రమాదంలో దాదాపు రూ.14 లక్షల మేర నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. తహసీల్దార్ రాజు ఫిరంగి ఘటన స్థలాన్ని పరిశీలించారు.

కుట్టుమిషన్ల పంపిణీ



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

హొసపేటె: ఆర్థికంగా వెనుకబడిన మహిళల సాధికారత కోసం హొసపేటె ఇన్నర్ వీల్ క్లబ్ ఎల్లవేళలా ముందుంటుందని, ఇతర క్లబ్‌లకు ఆదర్శంగా నిలుస్తుందని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు సుష్మా ప్రసంశించారు. నగరంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుట్టుమిషన్లను పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. డబ్బు ఉన్నవాళ్లంతా దాతలు కాదన్నారు. దానం చేసే గుణం ఉన్నవాళ్లకు మాత్రమే దానం గుణం ఉంటుందన్నారు. సమాజ సేవలో తమ వంతు తోడ్పాటును అందించే వారికి మానవత్వం ఉంటుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు సునీత, కార్యదర్శి రాజేశ్వరి, డాక్టర్ మహాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం.. ముగ్గురు అధికారుల సస్పెండ్



నాగరత్న సిద్దప్ప



ఇబ్రహీం

రాయచూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(నరేగ) నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఆరోపణలపై జిల్లాలోని లింగసూగూరు తాలూకా వ్యవసాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు అధికారులను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆదేశాలు జారీ చేసినట్లు జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే వెల్లడించారు. లింగసూగూరు తాలూకా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరత్న, అధికారి సిద్దప్ప, సింధనూరు రైతు కేంద్రం అధికారి ఇబ్రహీంలు అవినీతిలో భాగస్వాములయ్యారని వెల్లడైన నివేదిక ఆధారంగా వాస్తవాలను గుర్తించి వారిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

ఎడమ కాలువకు ఏప్రిల్ వరకు నీరివ్వాలి



వినతిపత్రం సమర్పిస్తున్న రైతు సంఘం నేతలు

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువకు ఏప్రిల్ నెలాఖరు వరకు నీరు వదలాలని కర్ణాటక ప్రాంత రైతు సంఘం డిమాండ్ చేసింది. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు విరుపాక్షిగౌడ మాట్లాడారు. సింధనూరు, మాన్వి, రాయచూరు తాలూకాల్లో ఫిబ్రవరిలో సాగు చేసిన రెండో పంటకు ఏప్రిల్ వరకు నీరు వదలాలని కోరారు. 54వ డిస్ట్రిబ్యూటరీ వద్ద ఆరు అడుగుల మేర గేజ్ కాపాడేలా నీటిపారుదల శాఖ అధికారులకు జిల్లాధికారి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ఆ కేసు త్వరలో సుఖాంతం



మాట్లాడుతున్న పరిషత్ స్పీకర్ బసవరాజ హొరట్టి

హుబ్లీ: సీటీ రవి, లక్ష్మీద హెబ్బాళ్కర్ కేసు త్వరలో పరిష్కారం అవుతుందని విధాన పరిషత్ స్పీకర్ బసవరాజ హొరట్టి తెలిపారు. గురువారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ సీటీ రవి, మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ జగడం వ్యవహారం పరిషత్ విషయ నీతి నిరూపణ సమితికి పంపించాం. ఇంకా అక్కడి నుంచి నివేదిక వివరాలు అందలేదు. వీలైనంత త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అన్ని పార్టీల 8 మంది సభ్యులతో కూడిన సమితి ఏర్పాటైందన్నారు. ఆ సమితి త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేస్తుందని ఆశిస్తున్నానన్నారు. ఏదేమైనా కేసును పరిష్కరించే బాధ్యత తనపై ఉందన్నారు. త్వరలోనే పరిష్కరించే అవకాశం ఉందన్నారు. మార్చిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో కేసును సుఖాంతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కేసుకు సంబంధించి అత్యధికంగా గడువు మేరకు అసెంబ్లీ సమావేశాల నుంచి బహిష్కరించవచ్చన్నారు. కేసుపై మాట్లాడేందుకు ఇటీవల మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్‌కు రెండు సార్లు ఫోన్ చేశాను. అయితే ఆమె ఫోన్ రిసీవ్ చేయలేదన్న రుజువులు కూడా ఆయన ఫోన్‌లో మీడియా ప్రతినిధులకు చూపించారు. కొన్ని సార్లు ఎమోషన్ అయినప్పుడు ఇలాంటి ఘటనలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. అసెంబ్లీ అయితే వాటిని అక్కడే పరిష్కరించేవాడిని, ఏదేమైనా కానీ ఈ కేసును ముగించాలి. ఎందుకంటే దీని చరిత్ర అలాగే ఉండిపోతుంది. ఈ కేసు మంచి ముగింపుతో పరిష్కారమవుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

గ్యారెంటీతో విద్యుత్ శాఖకు షాక్

- చార్జీలు పెంచినా తగ్గని నష్టం
- విద్యుత్ చార్జీల మోతకు సిద్ధం
- నష్టాల ఊబిలో ఎస్కాం సంస్థలు



కలబుర్గిలోని జెస్కాం ప్రధాన కార్యాలయం

రాయచూరు రూరల్: నగర, గ్రామీణ ప్రాంతాల్లో పంచ గ్యారెంటీల అమలుతో విద్యుత్ శాఖ పరిధిలోని నాలుగు ఎస్కాం సంస్థలకు షాక్ తగిలింది. ప్రభుత్వం అమలు పరిచిన శక్తి పథకం తరువాత విద్యుత్ శాఖ నిర్వీర్యం అవుతోంది. మహిళలకు ఉచిత బస్ ప్రయాణంతో ఆర్టీసీ నష్టాల బాటలోకి వెళ్లింది. అదే బాటలోకి ఎస్కాం సంస్థలు పయనిస్తున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీ అమలుకు మొదట్లో వ్యతిరేకత చెప్పిన నిపుణుల అభిప్రాయాలను సర్కార్ తీవ్రంగా పరిగణించలేదు. బస్ చార్జీలు ఒకటిన్నర శాతం పెంచిన అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఎస్కాంలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఉద్యోగులకు పీఎఫ్, జీపీఎఫ్, ఇంధన వ్యయం, గ్రాచ్యుటీ, వేతన బకాయిలు, ఇతరత్ర కలిపి రూ.2,850 కోట్ల మేర నష్టాల బాటలో సంస్థలున్నాయి. కర్ణాటక విద్యుత్ రెగ్యులేటరీ కమిటీ(కేఈఆర్‌సీ) నివేదిక మేరకు మూడేళ్ల పాటు వరుసగా 2026లో 67, 2027లో 75, 2028లో 91 పైసల మేర యూనిట్ ధర పెంచాలని నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా 2025లో కేఈఆర్‌సీ నివేదిక ప్రకారం మెస్కాం, బెస్కాం, హెస్కాం, జెస్కాంలలో 20 శాతం మేర విద్యుత్ చార్జీలు పెంచడానికి అనుమతి కోరారు. 2025 ఏప్రిల్ 1 నుంచి ధరల పెంపుదలను అమలు చేయాలని కేఈఆర్‌సీ ఇచ్చిన నివేదిక జారీకి సిద్ధమైనట్లు తెలుస్తోంది.